SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 01
June-2024, Price Rs.20/-.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

జూన్ 2024
వెల రూ.20/-
పుటలు - 56



తిరుమల శ్రీ వారి జ్యేష్ఠాభిషేకం
2024, జూన్ 19 నుండి 21 వరకు



## అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం

| తేదీలు | వారము | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|---|
| 16-06-2024 | ఆదివారం | -- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 17-06-2024 | సోమవారం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 18-06-2024 | మంగళవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 19-06-2024 | బుధవారం | సింహవాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 20-06-2024 | గురువారం | కల్పవృక్ష వాహనం | సర్వభూపాల వాహనం |
| 21-06-2024 | శుక్రవారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 22-06-2024 | శనివారం | హనుమద్వాహనం సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 23-06-2024 | ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 24-06-2024 | సోమవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 25-06-2024 | మంగళవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం, ద్వాదశారాధానం, ఏకాంతసేవ |



## తిరుచానూరు శ్రీ పద్మావతీ తాయార్ల తెప్పోత్సవం

| తేదీలు | వారము | ఉత్సవములు |
|---|---|---|
| 17-06-2024 | - సోమవారం | - శ్రీ కృష్ణస్వామివారికి |
| 18-06-2024 | - మంగళవారం | - శ్రీ సుందరరాజస్వామివారికి |
| 19-06-2024 | - బుధవారం | - శ్రీ పద్మావతి అమ్మవార్లకు |
| 20-06-2024 | - గురువారం | - శ్రీ పద్మావతి అమ్మవార్లకు |
| 21-06-2024 | - శుక్రవారం | - శ్రీ పద్మావతి అమ్మవార్లకు |



## గీతాశ్లోకార్థసారం

**శ్లో : అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్।**
**వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-17వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అవినాశి=నాశరహితమైన; తత్, విద్ధి= దానిని తెలిసికొనుము; యేన, తు= దేని; చేనైతే; ఇదమ్, సర్వమ్= ఈ జగత్తంతయు (దృశ్యవర్గము); తతమ్= వ్యాప్తమైయున్నదో; అస్య అవ్యయస్య= శాశ్వతమైన దానియొక్క (ఆత్మయొక్క); వినాశమ్= వినాశమును; కర్తుమ్= చేయుటకు; కశ్చిత్= ఎవ్వడును; న, అర్హతి= సమర్థుడు కాడు.

**భావం:** నాశరహితమైన ఆ సత్యము (పరమాత్మ తత్త్వము) జగత్తునందు అంతటను వ్యాపించియున్నదని యెరుంగుము. శాశ్వతమైన దానినెవ్వరును నశింపజేయజాలరు.

## అఖిలలోకైక వంద్య హనుమంతుడా!!

అఖిలలోకైక వంద్య హనుమంతుఁ డా సీత -
శిఖామణి రామునికిఁ జేకొని తెచ్చితివి.

అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజదూతవైతి గురుహనుమంతుఁడ
గంభీరప్రతాపమునఁ గడఁగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి.

అంజనీదేవికుమార హనుమంతుఁడ
కఁజాప్తఫలహస్త ఘనహనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజిత వానరకులరక్షకుఁడ వైతివి.

ఆట లంకసాధించినహనుమంతుఁడ
చటులసత్వసమేత జయహనుమంతుఁడ
ఘటన నలమేల్మంగ కాంత శ్రీవేంకటేశుకుఁ
దటుకన బంటవై ధరణి నిల్పితివి.

(అధ్యాత్మ సంకీర్తన - 3-522)





*"లోకములచే స్తుతించబడిన ఓ హనుమా! సీతాదేవి శిఖామణిని రామునికి తెచ్చి ఇచ్చితివి. సముద్రమును దాటావు. సీతమ్మకు దూతవైనావు. గొప్ప పరాక్రమవంతుడవు. ఇంద్రునిచే వరాలు పొందినవాడవు. అంజని తనయా ఓ హనుమా! సూర్యుని ఫలమని భ్రమించి పట్టుకోబోయావు. సంజీవపర్వతం తెచ్చిన పరాక్రమవంతుడవు. వానరులకు రక్షకుడైనావు. లంక జయించినవాడవు. గొప్పబల పరాక్రమవంతుడవు. శ్రీవేంకటేశునకు బంటుగా ధరణిమీద నిల్చితివి." అని హనుమ చేసిన ఘనకార్యములను ఈ కీర్తనలో విశ్లేషించాడు అన్నమయ్య.*

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు

## (ఒకరోజు విరాళపథకం)

అన్నం పరబ్రహ్మస్వరూపం. ఆకలిగా ఉన్నవారికి అన్నం పెట్టడంకంటే పుణ్యం మరొకటి లేదు. ఈ సదాశయంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, తిరుచానూరు, శ్రీగోవిందరాజస్వామి ఆలయం, తిరుపతిలలో నిత్యం అన్నప్రసాద వితరణ చేస్తోంది. దీనికి ఎంతోమంది దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. ఇవ్వడమూ తెలిసిన విషయమే! అయితే, భూరివిరాళాలు ఇచ్చే సౌకర్యం అందరికీ ఉండకపోవచ్చు. దీన్ని గమనించి తి.తి.దే. ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చును కూడా భక్తులనుండి విరాళంగా స్వీకరించేందుకు సంసిద్ధమైంది. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తోటివారి ఆకలి తీర్చవచ్చు!! మాధవుని అనుగ్రహాన్ని పొందవచ్చు!!!

### ఒకరోజు ఖర్చు..

| | |
|---|---|
| 1) అల్పాహారం (టిఫిన్) | - 08 లక్షలు |
| 2) మధ్యాహ్నభోజనం | - 15 లక్షలు |
| 3) రాత్రిభోజనం | - 15 లక్షలు |
| మొత్తం | - 38 లక్షలు |

ఈ మొత్తాన్ని దాతలు తి.తి.దే. అన్నప్రసాదం ట్రస్టుకు అందజేయవచ్చు

ఈ విరాళాలను కేవలం వ్యక్తిగతంగానే కాక, కంపెనీలు, సంస్థలు, ట్రస్టులు సంయుక్తంగా కూడా అందజేయవచ్చు. దాతలు రోజువారి మొత్తం (రూ.38 లక్షలు) గానీ, అల్పాహారం (రూ.8 లక్షలు) గానీ, మధ్యాహ్న భోజనం (రూ.15 లక్షలు) గానీ, రాత్రి భోజనం- (రూ.15 లక్షలు) గానీ ఎంపిక చేసుకుని వితరణ చేయవచ్చు. దాతలకు తి.తి.దేవస్థానం కల్పించే సౌకర్యాలు ఒకే విధంగానే ఉంటాయి. *ఈ ఒకరోజు విరాళాల పథకం సెప్టెంబరు, 2024 వరకు అమలులో ఉంటుంది.*

మరిన్ని వివరాలకు - ఉపకార్యనిర్వహణాధికారి, (డోనార్‌సెల్) ఎఫ్.ఏ.సి., తి.తి.దే., తిరుమల. ఫోన్ - 0877-2263001, 2263472. మెయిల్ ఐడి- cdmc.ttd@tirumala.org.

విరాళాలు ఇచ్చేదాతలు భక్తులకు తామే స్వయంగా వడ్డించే అవకాశం కలదు. ఈ దాతల పేరు మాతృశ్రీ తరిగొండవెంగమాంబ అన్న ప్రసాదవితరణకేంద్రం తిరుమలలో ప్రదర్శించబడుతుంది.








తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 జూన్, 2024 సంచిక : 01

వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| హనుమద్వైభవం | శ్రీ గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ | 07 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| సందేహాలు-సమాధానాలు | డా॥రేవూరు అనంతపద్మనాభరావు | 14 |
| వేదమే 'నేత్రం' | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 15 |
| శ్రీకృష్ణామృతం | 'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు | 16 |
| పతంజలి యోగసూత్రములు-విశిష్టత | శ్రీ పి.కృష్ణమూర్తి | 17 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| అంతుచిక్కని ప్రాచీన భారతీయ విజ్ఞానం | డా॥ విశ్వనాథ కుటుంబరావు | 21 |
| కురుక్షేత్రము | డా॥ జి.సుబ్రహ్మణ్యం రెడ్డి | 23 |
| హయగ్రీవముపాస్మహే! | డా॥ యస్.ఏ.టి.రాజ్యలక్ష్మి | 24 |
| 108 దివ్యదేశాలు-తిరువణ్‌పురుడోత్తమన్ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సేవాగ్రగణ్యుడు-శ్రీఆంజనేయస్వామి | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 28 |
| నందనందనుడు కొలువైన 'నందలూరు' | శ్రీ ఇలపావులూరి వేంకటేశ్వర్లు | 31 |
| అగస్త్యమహర్షి | శ్రీ ఎం.వి.అవధాని | 33 |
| 'సమదర్శనం' | ఆచార్య ఎస్.మురళీధర రావు | 35 |
| భారతీయ గణితం | ఆచార్య వి.రమేష్‌బాబు | 36 |
| మేల్నాడు రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 38 |
| "సింధుం మాతృతమామ్" | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 39 |
| "శ్రీవేంకటపతి తన దాసులను గాచే అనంతుడు" | శ్రీ వారణాశి దుర్గాప్రసాద్ | 40 |
| జై చిరంజీవ...! | డా॥ అద్దంకి శ్రీనివాస్ | 42 |
| దురాశ | స్వామి జ్ఞానదానంద | 43 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| ఆరోగ్యభాగ్యానికి ద్రాక్ష | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన - కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 47 |
| హరి నామ మహిమ (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| దుష్టుడిపై జాలి ఉండదు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| 'పరోపకారగుణాలచే జన్మ సఫలమవుతుంది' (భాస్కరశతకం) | డా॥తిరుమల శ్రీనివాసాచార్య | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
వెనుకచిత్రం : తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి తెప్పోత్సవం



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# మానవసేవే మాధవసేవ

**"యోగో యోగవిదాం వరః"** అనే పదము విష్ణు సహస్రనామంలో ఉన్న ఒక ప్రశస్తమైన మాట. ఇది విష్ణుని ఒక విశిష్ట గుణమును (గురుత్వ పరిమాణము) తెలియచేసే ఒక పదము. **"యోగో"** అనేది చిత్తస్థైర్యమును చేసేది. "యోగ" అనేది ధ్యానము. "యోగవిదాం వరః" అంటే యోగ విదులకు ఉత్తముడు. ఈ పదములు విష్ణుని తన భక్తులకు ధ్యానంలో స్థిరతను అందిస్తాయి. అట్లే- **"యోగక్షేమం వహామ్యహం"** అనే వాక్యము భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించింది. యోగభావన మరియు ఆత్మసమర్పణకి భగవద్గీత యుద్ధానంతరం అర్జునుడు తన మనస్సును స్థిరం చేయడానికి శ్రీకృష్ణుడు ఉపయోగించిన ఒక ఉపదేశముగా ప్రసిద్ధిగాంచినది.

**'యోగ'** ఒక ప్రాచీన భారతీయ అభ్యాసము మరియు తంత్రాత్మక మాధ్యమము. ఇది మానసిక, శారీరిక, మానసిక-శారీరిక సహజముగా సాధన చేస్తుంది. యోగలో- వ్యాయామం, ప్రాణాయామము, ధ్యానము మరియు ఆధ్యాత్మిక అభ్యాసములు ఉన్నాయి. యోగద్వారా, మనసును శాంతమైనదిగా చేయవచ్చు. యోగ అనే ప్రణాళికను ఉపయోగించి, స్వచ్ఛమైన హృదయం, ఆరోగ్యం మరియు ఆధ్యాత్మికస్థితిని పొందవచ్చు.

**'యోగః కర్మసు కౌశలం'** - కర్మసు కౌశలం అనేది కర్మానుష్ఠానాన్ని సమర్థంగా నిర్వహించే సామర్థ్యము. ఈ విధముగా వ్యక్తి, తన కర్తవ్యాలపై ఆసక్తితో, నిష్కామముగా చేయగలిగే **'యోగ్యత'** పొందుతాడు. అయితే, ఈ యోగానుష్ఠానం- యోగపద్ధతిలోని ఒక భాగము మాత్రమే కాదు, ఇతర యోగ విధులలోని, విభిన్న ఆశ్రమాలలోని విభిన్న కార్యాలలో కూడా ఉపయోగించబడుతుంది. కాబట్టే భారతదేశం ప్రపంచ దేశాలన్నింటిలోనూ అగ్రగామిగా ఉంటోంది. అందుకే **జూన్ 21**ని ప్రతిసంవత్సరం **ప్రపంచం మొత్తం "అంతర్జాతీయ యోగ దినం"**గా జరుపుకుంటోంది.

**తిరుమల తిరుపతి దేవస్థానములు** కేవలం భక్తులకు స్వామివారి దర్శనవిషయంలోనే కాక, సామాజికసేవలకూ పెద్దపీట వేస్తోంది. **యోగా, ఆయుర్వేదం, అల్లోపతి** వైద్యంతో కూడిన వ్యాధినివారణ, రోగనిరోధక చికిత్సలు మరియు ప్రేమకు ఆధారమైన చిన్నపిల్లల విషయంలో తమ దృష్టిని సారించింది. ఎట్లంటే - తిరుపతిలోని **యోగాధ్యయన కేంద్రం** ద్వారా శారీరిక మానసిక రుగ్మతలను తొలగించడం, **ఆయుర్వేద ఆసుపత్రి** ద్వారా ఆయుర్వేదంతో రోగాలను నయం చేయడం, ఆధునిక వైద్యంతో **శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)** ద్వారా అల్లోపతి వైద్యం, **బర్డ్** ద్వారా ఎముకల అంగవికలతను సరిచేయడం, **శ్రీపద్మావతీ హృదయాలయ** ద్వారా చిన్న పిల్లలలకు సంక్రమించిన గుండెకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేయడం లాంటి వాటిని, అట్లే తిరుమలలో అస్వస్థత గురి అయ్యే భక్తులకు అత్యవసర చికిత్సను అందించడం కోసం **అశ్విని వైద్యశాల**ను ఏర్పాటు చేసి, **తిరుమల తిరుపతి దేవస్థానం** అనే మహత్వపూర్ణ ధార్మికసంస్థ భక్తులసేవలో మరియు ఆరోగ్య కార్యక్రమాలలో ప్రముఖ పాత్రను వహిస్తోంది.

అందుకే **'మానవసేవే మాధవసేవ'**గా **తిరుమల తిరుపతి దేవస్థానములు** దేశంలోని ధార్మిక సంస్థలన్నింటిలో ముందుంటోంది.

**// ఓం నమో వేంకటేశాయ //**

# హనుమద్వైభవం




- శ్రీ గౌరిపెద్ది వేంకటశంకర భగవాన్, 94927 04983

**హ**నుమ జన్మచరితమే అతివిశిష్ట వైభవం.

"వైశాఖమాసీ కృష్ణాయాం దశమీ మంద సంయుతా పూర్వప్రోక్త పదాయుక్తా' '.. 36-6వ పట..

పరాశరసంహిత.

వైశాఖ బహుళదశమీయుక్త పూర్వాభాద్ర నక్షత్రంలో మధ్యాహ్న వేళ స్వామి జన్మముహూర్త నిర్ణయం.

విష్ణు, బ్రహ్మాండ, స్కంద, పద్మపురాణాలు ఉటంకించిన మేరకు హనుమ వేంకటాచలంలోనే, సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామిని ఆరాధిస్తూ, మాత అంజనాదేవి చేసిన తప, జప, ధ్యాన, పూజా, దానాదుల దీక్షాఫలితమే హనుమ జననం. రుద్రాంశుడై వాయుదేవుని వర మహిమతో, అంజనాదేవి కోరికచే వాయుదేవ సమానశక్తి, వేగము కలిగి విశిష్టలక్షణాలతో అవతరించాడు.

మహాబలుడు, సర్వదేవమయుడు, వేదవేదాంగ తత్త్వజ్ఞుడు, నారాయణభక్తుడు, బ్రహ్మవిష్ణుశివాత్మకుడు, సకలవిద్యా విశారదుడు, సర్వలక్షణ సంపన్నుడని పరాశర మహర్షి వర్ణించాడు.

ప్రత్యక్షదైవమైన సూర్యుని వద్ద విద్యాబుద్ధులు గడించినారు హనుమ. వైవస్వతుడుగా కృష్ణుని వద్ద వేదాధ్యయనం గావించిన భాస్కరుడే గురువై, హనుమ విద్యా విజ్ఞాన ప్రమాణాలు అమోఘమైనవని గ్రహించాలి. శ్రీరాముడే హనుమను 'వాక్యమ్ వాక్యవిశారద' అని ప్రశంసిస్తూ లక్ష్మణునితో 'క్షుణ్ణంగా సకలవేద, శాస్త్ర పరిజ్ఞానం కలవారే అలా సంభాషించగలర'ని చెప్పారట. హనుమ నామానికి అర్థంగా 'సుస్పష్టమైన సంభాషణా చతురుడ'ని విజ్ఞుల ఉవాచ. వానరవంశానికి ఆద్యుడైన జాంబవంతుడు బ్రహ్మదేవుని నోటిద్వారా సృష్టింపబడి, వామనమూర్తి కంటే మునుపే కృతయుగంలోనే జన్మించాడని, అట్టి మహానుభావుడే హనుమను లంకాపయనానికి నిర్ధారిస్తాడు. వానరవీరులందరిలోకి సముద్రంపై శతయోజనపర్యంతం దాటి తిరిగిరాగల శక్తి హనుమకు మాత్రమే ఉందని గ్రహిస్తాడు. సమయోచిత నిర్ణయము, సంభాషణాచాతుర్యము, అష్టసిద్ధి ప్రధానుడైన ఆంజనేయుడే యోగ్యుడని శ్రీరాముడు సీతాన్వేషణ బాధ్యతల నప్పగిస్తాడు.

అణిమాది అష్టసిద్ధులను జయించిన స్వామి మహేంద్ర గిరిపై కొండంత రూపం పొంది, సముద్రలంఘనానికి తాడించి చేసిన పదఘట్టన అతిభీకరంగా మారి, మహేంద్రగిరివనాల్లోని మృగాలు, నదీనదములు, ఇతర ప్రాణులు, బలంగా ఎత్తైన వృక్షాలు కకావికలమయ్యాయి. ఇది స్వామిబలానికి, శక్తికి నిదర్శనం. సూర్యతేజ ప్రకాశమానుడైన పవనాత్మజుడు జలధిపై పయనిస్తుంటే అలలు ఉవ్వెత్తున ఎగసి పడినాయట.

శ్రీరామచంద్రుని కార్యార్థం సాగిపోతున్న హనుమను వాయుదేవుడే కాక సిద్ధ, చారణులు, ఇతర దేవతలు సవినయంగా స్తుతిస్తూ సహకరించారు.

సముద్రుని ఆదేశంతో మైనాకుడు తనశిఖరాలపై సేద దీరమనికోరుతూ "మీ తండ్రి వాయుదేవుడే నన్ను ఇంద్రుని వజ్రాయుధఘాతం నుండి రక్షించాడు. ప్రతిఫలంగా సేవించు కునే భాగ్యం కల్గించమని" కోరుతాడు.

ముహూర్తమాత్రం కాలయాపన జరిగినా తన ప్రతిజ్ఞకు విఘాతం కాగలదని సున్నితంగా తిరస్కరిస్తాడు. హనుమకున్న నిశ్చలకార్యదీక్ష, సమయపాలన మనకు ఆదర్శం.

ఉత్తమకార్యంలో అనేక విఘ్నాలు ఎదురు అవుతూనే ఉంటాయి. అవాంతరాలను ఎదుర్కొని కార్యసాధన చేయడ మెలాగో, తొణకకుండా బెణకకుండా కార్యాన్ని చక్కబెట్టడ మెలాగో హనుమనే మనకు చేసి చూపించాడు.

బ్రహ్మవరగ్రహీతయైన సురస విషయంలోనూ అదే సరళి. ముహూర్తకాలం విఘ్నం కలిగించి ఆంజనేయుని బలపరాక్రమములను, ఆత్మస్థైర్యాన్ని పరీక్షించమని సముద్రుడే సురసను ప్రేరేపిస్తాడు. వికృతరాక్షస రూపం ధరించి తననోట ప్రవేశించమని కోరగా, సీతారాములను ఒకపరి చేర్చి, తదుపరి ఆమె విన్నపాన్ని నెరవేరుస్తానని, తనను నమ్మమని చెప్పినా ఆమె వినలేదు. పోటీపడి పరస్పరం వారిరువురూ ఆకృతులను పలు రెట్టింపులు పెంచుకుంటూ పోగా, స్వామి అణిమాసిద్ధితో అంగుష్ఠరూపుడై ఆమె నోటిలో ప్రవేశించి, వెంటనే బయటకు వచ్చి "దాక్షాయణీ! నమో నమః. వైదేహిమాతను వెదకటానికి వెళుతున్నాను. నీ వరము నెరవేరినది కదా!" యని తిరిగి పయనమైన హనుమను సురస, తదితర భూతములన్నియు ప్రశంసించి ఆశీర్వదిస్తారు.

తదనంతరం సింహిక విషయంలో సమయోచితంగా పోరాడుతాడు. వజ్రకాయుడైన హనుమ సిద్ధచారణుల సాక్షిగా, విచిత్రాకృతులు పొంది ఆమె నోటిలో ప్రవేశించి మర్మస్థలంలో గ్రుద్ది సంహరించి, మనోవేగంతో బయటకు వస్తాడు. ఆమెను హతమార్చుటకు కారణభూతునిగా బ్రహ్మ ఆంజనేయుని సృష్టించారట.

సింహిక మరణించాక ఆకాశచారిణులైన భూతములు మారుతితో ఇట్లనిరి.

"నిస్పృహ, అపజయము బారినపడకుండా ఉండా లంటే ధైర్యము, సూక్ష్మదృష్టి, బుద్ధిదక్షత, కార్యసామర్థ్యం అనబడే చతుర్విధగుణాలు ఖచ్చితంగా ఉండాలి."

లంకానగర భౌగోళిక పరిస్థితుల గురించి సమగ్ర అవగాహన కోసం మారుతి త్రికూట పర్వతం పైనుండి పరిశీ లిస్తాడు. దుర్గమమైన లంకానగరం కొండశిఖరంపై నిర్మింపబడి ఉండటంతో దానిని చేరుకోవటం, తనతోకూడి అంగదుడు, నీలుడు సుగ్రీవులకు మాత్రమే సాధ్యం. దూతగా తన మనోరీతులను ఎలాగ సంయమనముతో అదుపులో ఉంచుకుని రామకార్యం విఘ్నం కాకూడదనేదే హనుమ ప్రణాళిక, దానికి వలసినంత నిపుణతను సాధించాడు.

హనుమకున్న శాపమొక్కటే... తన శక్తి ఎదుటివారు చెబితేగాని ప్రయోగించలేడు. క్రోధాన్ని కొన్ని సమయాలలో అణచుకోలేని స్థితి. ఎందుకంటే తనకు రాముని మించి వేరొండు లేదు. రామునికోసం ఏమైనా చేసేయాలి అంతే. ఆ నేపథ్యంలో తను ఎలామారుతున్నాడో తాత్కాలిక ఉద్వేగం కలిగినా, త్వరలోనే మనసును నియంత్రించుకోగల మహాసమర్థుడు.

సీతాన్వేషణలో లంకానగరమంతా కలియతిరుగు తాడు. ఆ నగరములోని నలుమూలలా తీవ్రంగా వెదకి వేసారి పోతాడు హనుమ. సీతావలోకనము సాధ్యపడదేమోననే సందేహం క్రమేణా పెరుగుచున్నది. ఒకవేళ సీతమ్మ ప్రాణ త్యాగము చేసుకుందేమోనన్న భావంకూడ కలిగింది. జానకీమాత జాడ తెలుసుకోక వేచియున్న వానరవీరులకు, ఆతృతతో ఎదురుచూస్తున్న రామలక్ష్మణుల పరిస్థితి దైన్యంగా ఊహించు కోలేకపోతాడు. మరొకమారు నిర్వేదమునకు లోనవుతూ, చింతాక్రాంతుడవుతాడు.

'చితి' నిర్జీవిని దహిస్తే, 'చింత' జీవితుడినే దహిస్తుంది. వానప్రస్థమా, మరణమా అనే అనిశ్చిత స్థితికి గురై, ఆత్మ త్యాగానికి సైతం మానసికంగా ఉద్యుక్తుడౌతాడు హనుమ.

ఎట్టకేలకు అశోకవనంలో సీతమ్మతల్లిని దర్శిస్తాడు. కాంతివిహీనయై, శోకవదనముతో, మురికితోకూడిన కేశములతో రాక్షసస్త్రీల నడుమ శీలబలముచే రక్షింపబడి, అధైర్యపడనిదైన సీతమ్మను చూసి తొలుత చలించినా, తేరుకుని ఆనందబాష్పాలు రాగా, కన్నులు నులుముకుని భక్తితో రామలక్ష్మణులకు నమస్కరించుకుంటాడు.

కొంతసేపటికి, అక్కడకు రావణుడు తన స్త్రీపరి వారముతో వస్తాడు. సీత రావణుల సంవాదము, రాక్షస స్త్రీల

వేధింపులు విని బాధాతప్తురాలైన జానకీదేవిని ఓదార్చాలని నిర్ణయించుకుంటాడు.

'అవశ్య మేవ వక్తవ్యం మానుష వాక్య మర్ధవత్' అనుకుని, మనిషిలాగ మాటలాడితే ఆమె మరింత భయపడి, అరచిన రాక్షసస్త్రీలు మేల్కొని తనను గమనిస్తే ఎంతటి అనర్థానికైన దారి తీయగలదని, దూతగా సాధించతగ్గ కార్యం తన మూలంగా చెడిపోరాదని భావించి, తుదకు ఆమె వినే విధంగా రామచరిత గానాన్ని వినిపిస్తాడు.

హనుమ గావించిన రామచరితగానాన్నివిని సీత సంతోష పరవశ అయింది. సీత సందేహాలను నివృత్తి చేసేందుకు తన వాస్తవ రూపాన్ని సాక్షాత్కరింపచేసి దర్శనమిస్తాడు. తనేస్వయంగా శ్రీరాముని సన్నిధికి తీసుకెళ్లగలనని పలికినపుడు, సీత శ్రీరాముడే రావణుని వధించి రక్షించాలనుకుంటుంది. అందుకు శ్రీరాముని ఉంగరమును గురుతుగా అందజేసి, నమ్మకాన్ని బలపరుస్తాడు.



రావణుని కలవటమేమంత సులభంకాదు. కాబట్టి, ప్రమదావనాన్ని ధ్వంసం చేసి, అడ్డగించిన రాక్షసయోధులతో దాడికి దిగుతాడు. ఇంద్రజిత్ బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడు. హనుమకున్న వరమహిమ కారణంగా, అతనిని ఎటువంటి శస్త్రాలు, ఆయుధాలు హతమార్చలేవు. ఉద్దేశ్య పూర్వకంగానే హనుమ బందీగా లొంగటంతో రావణుని సభకు తీసుకువస్తారు. తనను నిరాసనుడిని చేయగా, తోకను చుట్టచుట్టి ఆసనంగా చేసుకుని, రావణునికి శ్రీరామ చంద్రుని వంశచరితను, పరాక్రమవిశేషాలను విశదీకరిస్తాడు.

తానెవరో చెప్పి, సోదరసమానుడైన సుగ్రీవుని దూతగా సందేశాన్ని వివరిస్తూ, అధర్మప్రవర్తనుడైన రావణుని 'తగినదుష్ఫలితాన్ని అనుభవిస్తావ'ని సూటిగా హెచ్చరిస్తాడు. లంకనంతటినీ సర్వనాశనము చేయటానికి తానొక్కడే చాలని నిర్భయంగా ప్రకటిస్తూ, సీతాపహరణం చేసిన శత్రువులందరినీ హతమారుస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. రావణుని ఆగ్రహానికి గురై తోకకు నిప్పు అంటింపబడగా, అవకాశాన్ని మలుచుకుని విభీషణుని ఇల్లు తప్ప, అందరి ఇళ్ళనూ దహనం గావిస్తాడు. సీతాదేవి అగ్నిని ప్రార్థించి హనుమకు అపకారం జరుగనివ్వదు.

లంకాదహనం తొందరపాటు చర్య అని గ్రహించి తనను తానే అసహ్యించుకుంటాడు.

హనుమకున్న శాపమొక్కటే.. తన శక్తి ఎదుటవారు చెబితేగాని ప్రయోగించలేడు

## శ్రీ శంకుస్థాపన స్తంభ ఆంజనేయస్వామి

**తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయప్రాంగణంలోని విమానప్రదక్షిణమార్గంలో ఈశాన్యంలో శ్రీయోగనరసింహస్వామివారి ఆలయం ఉంది.**

**ఈ ఆలయ ప్రదక్షిణమార్గంలో ఈశాన్యం వైపు ఉన్న స్తంభాన్ని 'శంకు స్థాపనస్తంభం' అని పిలుస్తారు. ఈ స్తంభంపై నాలుగువైపులా శ్రీ ఆంజనేయ స్వామి శిల్పాలు దర్శనమిస్తాయి.**

**పూర్వం తొండమాను చక్రవర్తి స్వామివారి ఆజ్ఞమేరకు శ్రీనివాసుడికి ఆలయాన్ని నిర్మాణం ప్రారంభించే సమయంలో ముందుగా ఈ స్తంభాన్ని నిలిపి శంకుస్థాపన చేసినట్లు చెబుతారు. అందువల్లనే దీనిని శంకుస్థాపన స్తంభం అని పిలుస్తారు.**

**కాగా, కొందరు పండితులు ఇది ఆనందనిలయశంకుస్థాపన సమయంలో కాకుండా శ్రీయోగనరసింహస్వామి ఆలయనిర్మాణ సమయం నాటి శంకు స్థాపన స్తంభం అయి ఉంటుందని పేర్కొ న్నారు.**

**ఏమైనప్పటికీ భక్తులు ఈ స్తంభా నికి ప్రదక్షిణలు చేసి స్తంభంపై నలు వైపులా ఉన్న శ్రీఆంజనేయస్వామి వారికి నమస్కరిస్తారు.**

**ఈ విధంగా చేయడం వల్ల భక్తులు శీఘ్రంగా స్వంత ఇంటిని నిర్మించుకుంటారనే విశ్వాసం భక్తులలో ఉంది.**

దీని పర్యవసానంతో ఎట్టి అవాంతరాలు జరుగుతాయో అని భావించి తనమూలంగా సీతారాములకు అపకారం సంభవిస్తుందేమోనని వ్యథ చెందుతాడు. కోపాన్ని వదలు కోనందులకు చింతిస్తాడు. రామకార్యం నెరవేరకపోతే తనకు మరణమే మేలని దిగజారి పోయే ఆలోచనలతో ఉద్విగ్నుడయి, తమాయించుకుని లక్ష్యసాధన వైపు దృష్టి పెడతాడు.

లక్ష్యసాధనలో లోటుపాట్లను సరిదిద్దుకుని విజయానికి ఉద్యుక్తుడు కావాలి కాని, మధ్యలోనే ప్రయత్నాన్ని విరమించరాదని లోకానికి స్పష్టం చేస్తాడు.

తదనంతరం సీతాదేవిని దర్శించి, సంతోషవదనయై ఆమె పలికిన సందేశాన్ని విని, తన గురుతుగా ఇచ్చిన చూడామణిని గ్రహిస్తాడు. రామజయంపై సీతమ్మకు విశ్వాసాన్ని కలిగించి తిరుగు ప్రయాణం సాగిస్తాడు.



మహేంద్రగిరిని చేరి, తన రాకకై ఎదురుచూస్తున్న జాంబవంత, అంగదాది వానర ప్రముఖులను కలిసి లంక ప్రయాణం సఫలమైనదని వివరాలు విశదీకరిస్తాడు. సుగ్రీవ సమేతుడై ఆతురతతో నిరీక్షిస్తున్న రామలక్ష్మణులను చేరుకుంటారు.

**దృష్టాదేవీతి హనుమద్వదనా దమృతోపమమ్,**
**ఆకర్ణ్య వచనమ్ రామో హర్షమవాప సలక్ష్మణః**

'చూచితిని సీతమ్మను'–అన్న అమృతోపమమైన హనుమ పలుకు రామలక్ష్మణు లకు మహదానందభరితమయింది. సమయస్ఫూర్తి, తడబాటులేమి, అర్థవంతమైన భాషణములే హనుమభూషణములు. రాముని ఆదేశంతో సమూలంగా లంకలో జరిగిన విశేషాలు వివరిస్తాడు. ఈ సంభాషణ రామరావణయుద్ధానికి, వ్యూహరచనకు ఆధారం. రామవిజయానికి ధర్మస్థాపనకు మూలపురుషుడుగా చరిత్రలో నిలిచాడు.

పరాశరమహర్షి స్వామి పంచవక్త్రరూపాన్ని వర్ణిస్తూ..... ధ్యానశ్లోకం ఇలా...

**"ధ్యాయేత్ వానర నారసింహఖగరాట్క్రోడాశ్వవక్త్రాంచితమ్**
**ఫాలాక్షస్ఫుటపంచవక్త్ర రుచిరమ్ బాలార్కకోటి ద్యుతిమ్**
**హస్తైశ్శూలకపాలముద్గరహలం కౌమోదకీ భూరుహమ్**
**ఖట్వాంగాంకుశపాశపర్వతధరమ్ పీతాంబరమ్ వానరమ్"**

**.... 59– పం.పట.పరాశర సం.**

నుడివిన ధ్యానశ్లోకంలో హనుమసకలదేవతాస్వరూపాన్ని అవలోకించగలం.

*॥ జై శ్రీరామ్ ॥*

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

బ్రహ్మ అంతటితో ఆగలేదు. విఖనసుణ్ణి రమ్మన్నాడు. వైఖానసపద్ధతిలో రథోత్సవానికి తగిన లగ్నం పెట్టమని కోరాడు. విఖనసుడు పంచాంగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి–

'చతుర్ముఖా! కన్యారాశిలో సూర్యుడు ప్రవేశించే నెలలో చిత్తానక్షత్రంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేయాలి. ఉత్తరాషాఢలో రథోత్సవం నిర్వహించవచ్చు. శ్రవణనక్షత్రంలో 'తీర్థవారి' అనడంతో బ్రహ్మ సకలదేశాధిపతులకు చారుల ద్వారా వర్తమానం పంపాడు. బ్రహ్మదేవుని ఆదేశంతో ద్రవిడ, కర్ణాట, కురు, కుకుర, కేకయ, కోసల, బర్బరాది ఛప్పన్నారు దేశాధిపతులు చతురంగబలాదులతో సకుటుంబ సమేతులై శేషాద్రికి పయనం కట్టారు.

ఆ సందర్భంలో శేషాద్రి మార్గంలో పయనించే వారికీ సామాన్యజనులకు కూడా అన్నసత్రం, చలి పందిరులు (నీరాగారాలు) నిర్మించారు. తమ తమ సంపదలకనుగుణంగా అన్నోదక, వస్త్ర భూషణ, ఛత్రచామర, పాత్ర, పాదుక, వాహనాది దానాలు చేశారు. అంతేకాదు వర్ణభేదం పాటించక అందరు 'గోవింద గోవింద' నామోచ్చారణలతో వేంకటాచలం ఎక్కుతూ శేషాద్రి చేరుకున్నారు. కొండ మీద విడుదులలో విశ్రమించి, పుష్కరిణిలో తానమాడి, వరాహస్వామిని దర్శించి కానుకలు సమర్పించి, ఆపై శ్రీనివాస దర్శనం చేసి స్వామికి వస్త్రభూషణ ధన రాసులను సమర్పించారు.

బ్రహ్మోత్సవక్రమం కొండ అంతా కోలాహలంగా కనిపిస్తుంటే బ్రహ్మ విష్వక్సేనుని చూచి–

'సేనాధిపా! నా తండ్రికి మహోత్సవాలు జరిపించాలనే నా కోరిక తీరనున్నది. అందుకు తగిన ఏర్పాట్లను చేయవలసింది'గా ఆనతిచ్చాడు.

విష్వక్సేనుడు బ్రహ్మ ఆనమేరకు పరివారానికి తగిన పనులను కేటాయించి సర్వమూ సన్నద్ధమని బ్రహ్మకు విన్నవించాడు.

అలాగే విఖనసమహర్షి మృత్సంగ్రహం, పుణ్యాహవచనం, పాలికలలో నవధాన్య నిక్షేపం చేశాడు. ఆ పై హస్తానక్షత్రంలో అంకురార్పణం నైవేద్యాదులు పూర్తి చేశాడు. మరుసటిరోజు వాస్తు హోమం, గరుడప్రతిష్ఠ, గరుడహోమం, భేరీతాడనం, కంకణధారణాది వైదిక కార్యాలను శాస్త్రోక్తంగా ముగించాడు.

హరికి, శ్రీభూనీళాదులకు నూతన వస్త్రాభరణాలర్పించి అలంకరింపజేశారు. రత్నాలు పొదిగిన బంగారు తిరుచ్చిలో వేంచేపు చేశారు. మంగళవాద్యాలు మోగుతుంటే, దిగ్బలి చల్లుతుంటే, ధ్వజపటం, ఆపై సుదర్శనచక్రం, సేనాధిపతి నడుస్తూంటే, సనకాదులు పొగడుతుంటే, దేవాధిదేవతలు ఛత్రచామరాదులతో తిరువీధులలో విహారానికి సంసిద్ధులు చేశారు. బ్రహ్మదేవుడు శ్రీభూనీళా సమేతుడయిన హరిని ఆనందనిలయానికి ప్రదక్షిణంగా వేంచేపు చేశాడు. విష్వక్సేనుడు శాస్త్రానుసారం ధ్వజారోహణ ఏర్పాట్లు చేశాడు. ఆ రాత్రి నవకలశస్థాపన చేసి, అష్టదిక్పాల ఆవాహనం చేయించి, పవిత్రాగ్నిని ప్రజ్వలింపజేసి, సకలదైవతాపారమాత్మికలైన హోమాదులు జరిపించాడు.

నక్షత్ర దినవార హోమాలు కొనసాగించాడు. దిగ్బలులతో దివ్యచక్రానికి వేంచేపు చేయించాడు. భేరి మొదలయిన వాద్యాలు మోగుతుంటే, ముందు బ్రహ్మ రథం సాగుతుంటే, స్వామి శేషవాహనం మీద శ్రీనివాసుడుగా ప్రదక్షిణం చేయించి బ్రహ్మ హరిని స్వస్థానం చేర్పించాడు.

ఇలాగే నవకలశ పాలికారాధన, నైవేద్యహోమ చక్ర బలిలాంటి వాటికి సంబంధించిన నిత్యకృత్యాలు శాస్త్రోక్తంగా చేసి చిన్నశేషవాహనం మీద మరుసటి ఉదయం ఊరేగింపు జరిగేలా చేశాడు. ఆ రాత్రి పుష్పమౌక్తిక హంసవాహనం, మూడవ రోజు ఉదయం సింహవాహనం, రాత్రి పుష్పమాక్తిక విమానవాహనం, నాల్గవ రోజు ఉదయం సర్వభూపాలవాహనం, రాత్రి కల్పవృక్షవాహనం, అయిదవ రోజు ఉదయం మోహినీ వేషధరుడయిన హరికి పల్లకీసేవ, ఆ రాత్రి గురుడోత్సవం. ఆరవ రోజు ఉదయం హనుమద్వాహనం, సాయంకాలం వసంతోత్సవానంతరం ఐరావతోత్సవం. ఏడవ రోజు ఉదయం సూర్య ప్రభవాహనం, రాత్రి చంద్రప్రభవాహనం, ఎనిమిదవ రోజు ఉదయం షోడశమహాదానాదులు పూర్తి చేసి బంగారు కొండ లాంటి రథంపై శ్రీభూనీళాదులతో హరిని రథంపై వేంచేపు చేయించి బ్రహ్మ అలఘురథంలో ముందుకు కదులుతుండగా దిక్పాలకులు, దేవగణం సేవిస్తుండగా, రంభాద్యప్సరసలు రథంపై పారిజాతపుష్పాలు చల్ల నృత్యగీతలు సాగగా కనుల పండువగా రథోత్సవం సాగింది. బ్రహ్మోత్సవాలలో చివరిదైన అవభృథస్నానం కొనసాగించినవారలతో శ్రీనివాసుడు చేయెత్తి..

బ్రహ్మరుద్రాది దిక్పాలులారా! నా మాట వినండి. శ్రవణనక్షత్రం రోజు చక్రాయుధానికి తీర్థవారి జరిగిన స్వామి పుష్కరిణిలో ఎవరయితే పుణ్యస్నానాలు చేస్తారో వారు గతంలో చేసిన పాపాలన్నీ నశిస్తాయి. అంతేకాదు పవిత్రస్నానం కారణంగా భాగ్యవంతులవుతారు. ఇహంలోనూ పరంలోనూ సుఖజీవితం గడుపుతారు. ఇది సత్యమనగానే బ్రహ్మ, పరమ శివులు కూడా ఇది నిజమన్నారు. ఆపై స్వామి కోవెలలో కల్యాణమంటపాన అధివసించాడు.

బ్రహ్మోత్సవాల చివర అనుష్ఠింపవలసిన హోమాది కృత్యాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. తదనంతరం స్వామి బంగారు సింహాసనంపై ఆసీనుడయి–

"కమలజ! నీ సంకల్పం ఫలించింది. నాకు పరమ సంతోషం. నీవు ముందుండి జరిపావు కనుక ఇలాంటి ఉత్సవాలు నీ పేరుననే విఖ్యాతమవుతుంది.

అంతేకాదు నీవు సంకల్పించి నిర్వర్తించిన ఈ బ్రహ్మోత్సవానికి వచ్చినవారు, బ్రహ్మోత్సవవైభవాన్ని దర్శించినవారు పునర్జన్మాదులు లేకుండా శాశ్వతానందం అనుభవిస్తారు. వారిని సదా నేను రక్షిస్తుంటాను.

నా రూపాన్ని ధ్యానించేవారిని, నా కీర్తనలు పాడే వారిని, అన్యచింతలు మాని నాపట్ల విశ్వాసం ప్రకటించిన వారిని, భక్తిభావనతో అర్థించేవారిపట్ల నేను సదా ఆసక్తితో ఉంటాను. వారి ఆపదలను పరిహరిస్తాను. వారు కోరే వరాలిస్తాను. కనక రత్న వస్తు వాహన ధాన్య సంతానభాగ్యాలు ప్రసాదిస్తాను. చివరకు వారికి పురుషార్థాలలో నాల్గవది ముక్తి తథ్యం. నన్నెంత విశ్వసిస్తే ఆ నమ్మకానికి తగినట్లు ఫలం. ఈ వేంకటగిరిలో ఎవరయినా అన్న, గృహ, పాత్ర, అర్థదానాదులు చేస్తారో వారికి భూలోకంలో సకలభోగ్యాలబ్బుతాయి."

శ్రీహరి శివుణ్ణి, ఇంద్రాదుల వైపు తిరిగి "ప్రముఖులార! కన్యారాశిలో జరిగే బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం జరగాలి. మీరందరు విచ్చేయవలె. మీ సహకారంతో వైభవంగా కొనసాగవలె" అన్నాడు.

రాజుల కేసి దృష్టి మరల్చి 'అవనీపతులార! మీరు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలకు రండి. మీకున్న ద్రవ్యంలో నాల్గవ భాగాన్ని నాకు ఇవ్వండి. అద్దాన మా సామ్రాజ్యవిస్తృతి తథ్యం' అని ఆనతిచ్చాడు.

'విప్రులారా! పుణ్యకర్మలు ఆచరించండి. మహారాజులార! బ్రాహ్మణకుటుంబాలకు రక్షణగా ఉండండి. వైశ్యులార! వర్తక వాణిజ్యాదుల్ని న్యాయమార్గంలో కొనసాగించండి. ఇతరులార! ఈ గిరి మీద పుష్ప, తులసికావనాలు ఏర్పాటు చేయండి.'

అన్ని వర్గాల వారికి ఆదేశాలిచ్చి వారికి బహుకరించి– 'ప్రస్తుతం మీరందరూ మీ మీ స్వస్థలాలకు వెళ్ళి మళ్ళీ వచ్చే బ్రహ్మోత్సవాలకు తప్పకరండి.'

అంటూ ఆగంతులకు వారి వారి ప్రదేశాలకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చాడు. ఆపై బ్రహ్మాదులను చూసి– ఈ వేంకటాద్రిలో ఎవరయిన బ్రాహ్మణోత్తములకు అన్నదానం చేస్తే నేను సంతృప్తుణ్ణి అవుతాను. అలాగే విద్యాదానం చేస్తే ఆ వంశజులు పుణ్యలోకాలకు చేరుకుంటారు. బృందావనం తీర్చి తులసివనం పెంచి ఆ తులసీదళాలను భక్తితో అర్పించేవారికి స్వర్గసామ్రాజ్యం అనుగ్రహిస్తాను. స్వర్గభోగానంతరం ముక్తి ప్రసాదిస్తాను. అలాగే వేంకటాద్రిలో పూలతోటలు నిర్మించి ఆ పూలను భక్తితో నాకు సమర్పించేవారికి, అహంకార విముక్తులయిన వారికి మోక్షం తథ్యం. అలాగే భక్తితో షడ్రసోపేతాన్నం

సమర్పిస్తే సమస్తలోకాలు సంతృప్తిపడతాయి అంటూ కర్మ, జ్ఞాన, భక్తి, ధర్మ, సూక్ష్మాలను విశదంగా చెప్పాడు. ఆపై 'జలజ సంభవా! నీవు సత్యలోకం నుండి ఇక్కడే చిరకాలముండి బ్రహ్మోత్సవం బ్రహ్మాండంగా నిర్వహించావు. నేను శ్రీభూనీళా దులం ఎంతో సంతోషించాం. నేను ఈ శేషాద్రిలోనే ఉంటాను. అయితే నీకు ఏ వరం ఇవ్వగలను?' అన్నాడు. అప్పుడు బ్రహ్మ–

'జనక! నాకు ఎన్నో వరాలిచ్చారు. నన్ను తగిన రీతిలో. గౌరవించి నా మాటలకు విలువలిచ్చారు. నాకు ఏ కొరత లేదు. మీరు అంతర్ధానం గాక ఇలాగే ఇక్కడే ఉండాలని నా తపన. నరులందరు నరకంలో పడక కాపాడతాననడమే నాకు మీరిచ్చిన వరం. మరో వరం నాకవసరం లేదు.' అంటే హరి–

'తనయా! నా పట్ల విశ్వాసముంచి భక్తిభావనతో జీవించేవారికి ఎవరయినా ఆటంకాలు కల్పిస్తే నేను సుతరామూ ఊరుకోను. మీకు తెలుసుగా జయవిజయులు నా ద్వారపాలకు లైన వారి ఔద్ధత్యానికి తగిన శిక్ష వేశాను. భాగవతాపచారం చేసిన వారిని యమలోకంలో పడవేస్తాను. అంతేకాదు ఎంతటి పాపియైనా నన్ను శరణువేడితే వారిని తప్పక కాపాడతాను.

నా భక్తుల్ని నిందించేవారిని, గురుదూషకుల్ని, నమ్మిన వారిని నట్టేట ముంచిన వారిని నరకంలో పడవేస్తాను. దుష్టుల మర్దించి, దుర్బలులైన శిష్టులను రక్షించడానికోసం నేను శేషా చలంలోనే కలియుగాంతం దాకా ఉంటాను. ఇక నీవు సత్య లోకానికి వెళ్ళి సృష్టికొనసాగించు. నిన్ను సదా పోషిస్తాను" అంటూ ఇంద్రుని కేసి తిరిగి–

'దేవేంద్రా! నీవు సురలతో స్వర్గానికి వెళ్ళు. నీ బాహు బలాన్ని పెంచుకో. ముల్లోకాలను పాలించు. దైత్యుల ఆగడాలకు చలింపకు. ఇకపై నీకు సర్వత్ర జయమే' అన్నాడు.

ఆపై శివుని కేసి చూసి–

"గిరినాయక! నా మహోత్సవానికి అన్నివిధాల సహక రించావు. నాకు పరమానందం. ఇంక నీవు వెండికొండకు వెళ్ళి నీ భక్తుల్ని సదా రక్షించు.

పరమశివా! వైకుంఠం కన్నా, క్షీరసముద్రం కన్నా, సూర్య మండలం కన్నా, శ్వేతదీపం కన్నా, శేషగిరి విశిష్టం. అందుకే భూలోకవైకుంఠంలాంటి ఈ చోటనే నేనుండాలనుకుంటున్నాను. నీవు సువర్ణముఖీతీరాన తూర్పున ఉందువు గాని"–

## 2024, జూలై నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 07 | పూరీజగన్నాథరథయాత్ర |
| 10-12 | శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవం |
| 15 | శ్రీపెరియాళ్వార్ శాత్తుమొఱ |
| 16 | తిరుమల శ్రీవారి ఆణివరఆస్థానం |
| 17 | తొలిఏకాదశి |
| 21 | గురుపూర్ణిమ, ఆళవందార్ వ.తి.న. |
| 22 | తిరుపతి శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ |
| 29నుండి ఆగష్టు 07వరకు | శ్రీఆండాళ్ తిరువాడిప్పూరం ఉత్సవాలు |
| 30 | ఆడికృత్తిక |

అగస్త్యాదులను చూచి 'పరమపావన! నీకు ఎక్కడయితే ఇష్టమో అక్కడ నిష్ఠతో తపం కొనసాగించు' అన్నాడు.

సనకసనందనాదుల్ని చూచి– 'యోగివరులారా! మీరు విరాగులు. జ్ఞానామృతంపానం చేసేవారు. తృప్తి కలవారు. మీరు ఇచ్ఛావిహారులుగానే మసలండి' అన్నాడు.

బ్రహ్మోత్సవానంతరం బ్రహ్మ హంసవాహన మెక్కి సత్యలోకం చేరుకున్నాడు. ఇంద్రుడు ఐరావతమెక్కి అమరావతి వైపు పయనం సాగించాడు. రుద్రుడు నందివాహనమెక్కి శేష గిరికి ప్రదక్షిణగా కపిలతీర్థమార్గాన కైలాసానికి వెళ్లాడు.

అగస్త్యాదిమునులు, సనకాది యోగులు స్వామి పుష్క రిణికి ఉత్తరంవైపున– పాపవినాశనాది తీర్థాలలో మునకలు వేస్తూ పాపవినాశనానికి ఉత్తరం వైపున తుంబురుతీర్థం వైపు కదిలారు. ఫాల్గుణశుద్ధపౌర్ణమినాడు అరుంధతీమాత లక్ష్మీదేవి నుద్దేశించి తపస్సు చేసిన ప్రదేశంలో తపం కొనసాగించారు. మరి కొందరు మునులు తమకు నచ్చిన ప్రియమైన తీర్థాదుల ప్రదేశాలు తపస్సు అనుకూలమని అక్కడక్కడ నిలిచారు. ఇది బ్రహ్మోత్సవక్రమమని సూతుడు శౌనకాదులకు విశదీకరిం చాడు. అంతేకాదు బ్రహ్మోత్సవక్రమాన్ని వ్రాసినా, చదివినా, విన్నా వారందరు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధులతో మనుగడ సాగిస్తారని ఫలశ్రుతి కూడా చెప్పాడు. (ఇంకా ఉంది)

# సందేహాలు సమాధానాలు

-డా॥ రేవూరు అనంతపద్మనాభరావు

**ప్ర) తైత్తిరీయోపనిషత్ అంటే ఏమిటి?**

*-ఏ.సుబ్బారావు, ఒంగోలు.*

**జ)** తిత్తరి పక్షులు ప్రకటించినందున 'తైత్తరీయోపనిషత్'గా పేర్కొంటారు. ఇది కృష్ణ యజుర్వేద తిత్తరిశాఖకు చెందినది. ఉపనిషత్తులలో ఈనాటికీ సంప్రదాయకంగా బోధన ఈ ఉపనిషత్తుకే జరుగుతున్నది. ప్రస్తుతకాలంలోని కర్మకాండలు (పూజలు) మొదలైన వివరాలు వీటిలో ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. ఈ ఉపనిషత్తు ఐదు ప్రశ్నములు (భాగాలు)గా అధ్యాపక ప్రసిద్ధం. అవి- 1)శిక్షావల్లి, 2)ఆనందవల్లి 3)భృగువల్లి 4)నారాయణప్రశ్న 5)చిత్త ప్రశ్నము. ఈ ఉపనిషత్తు ఆంధ్రపాఠము, ద్రవిడపాఠము అని రెండు విధాలుగా ఉంది. ఆంధ్రపాఠమే హెచ్చు ప్రాచుర్యం పొందింది. శిక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లి ప్రశ్నములకు శంకరభగవత్పాదులు భాష్యము, విద్యారణ్యుల బృహద్వివరణం, సురేశ్వరాచార్యుల భాష్యవార్తికం వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఈ ఉపనిషత్తులో మొత్తం 112 అనువాకాలున్నాయి. శిక్షావల్లిలో 12, బ్రహ్మవల్లిలో 10, భృగువల్లిలో 10, నారాయణ ప్రశ్నలో 80 అనువాకాలున్నాయి. మంత్రాల సముదాయమే అనువాకం.

**ప్ర) నిత్యమూ ఆదిత్యహృదయం పఠిస్తే ఆరోగ్యం, సంపద, సంతానం కలుగుతాయా?**-*జి.శకుంతల, నరసాపురం.*

**జ)** యుద్ధభూమిలో చింతాగ్రస్తుడైన శ్రీరామచంద్రునికి అగస్త్యమహర్షి ఆదిత్య హృదయాన్ని బోధించాడు.

ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్
జయావహం జపేన్నిత్యం అక్షయం పరమం శివం॥
సర్వమంగళమాంగల్యం సర్వపాపప్రణాశనం
చింతాశోకప్రశమనం ఆయుర్వర్ధనముత్తమమ్॥

అని ఆదిత్యహృదయస్తోత్రంలోనే స్పష్టంగా ఆయురారోగ్యాలు ప్రస్తావన ఉంది. ఆయురారోగ్యాలుంటే సర్వ సంపదలు ఉన్నంత భాగ్యం. భగవంతునికి మనకేమి ఇవ్వాలో స్పష్టంగా తెలుసు.

**ప్ర) శివానందలహరి, సౌందర్యలహరి- ఈ రెండింటిలో ఉత్తమ గ్రంథం ఏది?**

*- కె.రమేష్, విజయవాడ*

**జ)** భగవత్స్తోత్రాలు దేనికి అవే ఉత్తమాలు. ఆదిశంకరాచార్యులు పరమశివుని ప్రస్తుతిస్తూ వంద సంస్కృతశ్లోకాలు వివిధ ఛందస్సులలో శ్రీశైలంలో ఉండగా చెప్పారని ప్రతీతి. శివ+ఆనందతరంగాలు- శుభప్రదమైన ఆనందతరంగాలు అని భావం. అది భక్తికి ప్రతీకలు. పరమశివుని అనుగ్రహం పొందడానికి శక్తివంతమైనది. ఆధ్యాత్మిక ఆలోచనలకు ప్రేరకాలు. అందుకే ఒక శ్లోకంలో 'కిం దుర్లభం' అంటారు భగవత్పాదులు. భక్తితో ఆరాధిస్తే సాధ్యం కానిదేది? అలానే సౌందర్యలహరిని కూడా ఆదిశంకరులే స్తోత్రం చేశారు. లలితాదేవికి అంకితం. వీటిని జపించడంవల్ల జీవితంలో అత్యద్భుత ఫలితాలు సాధించవచ్చునని భక్తుల విశ్వాసం. ప్రతికూల ఆలోచనల నుండి విముక్తి కలిగి జీవితంలో మనం కోరుకున్న ఫలితాలు సిద్ధిస్తాయి..

**ప్ర) 'నిదానమే ప్రధానం' అన్న పెద్దలు, 'ఆలస్యం అమృతం విషం' - అంటున్నారు. ఎందుకు?**

*- ఫణికుమార్, విజయవాడ.*

**జ)** మనకు లోకోక్తులు అనేకం. ఆ యా సందర్భాలను బట్టి వాటిని మనం అన్వయం చేసుకోవాలి. తొందరపాటుతో కూడిన పనుల వలన ఎన్నో అవరోధాలు, ఆటంకాలు కలుగుతాయి. అలాంటిచోట నిదానమే ప్రధానమని పెద్దల సలహా. అలా కాకుండా ఏదైనా శుభకార్యం తలపెట్టినపుడు మీనమేషాలు లెక్కగడుతూ, కాలయాపన చేస్తే, అలాంటి ఆలస్యం వలన శుభపరిణామాలకు బదులు చెడు ఫలితాలు కలుగుతాయి. రెండు సందర్భాలను మనం ఒకచోట కలిపి ఆలోచించరాదు.

**ప్ర) ప్రవృత్తిమార్గం, నివృత్తి మార్గం - ఈ రెండింటిని ఆచరణ చేయాలంటే ఏది ముఖ్యం?** *-సి.హెచ్.శేషగిరి, తెనాలి.*

**జ)** మన సంప్రదాయంలో ప్రవృత్తి, నివృత్తి మార్గాలు రెండు సూచింపబడ్డాయి. ఇంద్రియానందమార్గం ప్రవృత్తి. బాహ్య ప్రపంచం వైపు చర్య మరియు దృష్టిని నిర్దేశించే మార్గమిది. భౌతిక ప్రపంచంలో నివసిస్తున్నపుడు ఎక్కువ సమయం ప్రాపంచిక విషయాలవైపు దృష్టి సారిస్తారు. మనుష్యులకు అహంకారం సహజం. అది సాత్త్విక, రాజసిక, తామసిక అహంకారాల రూపంలో జీవితంలో ఒకానొక అంకం వరకు పయనించడానికి ప్రవృత్తి ప్రధానసాధనం.

'ద్వివిధ హి వేదోక్త ధర్మః ప్రవృత్తి నివృత్తి లక్షణం'. రెండోమార్గం నివృత్తి మార్గం. ఇది తాబేలు కాళ్లను లోనికి ముడుచుకోవడం వంటిది. అంటే మనలోని మనం చూసుకోవడం. మనలోని మనం ప్రయాణించడం నివృత్తి. ఇలా అంతర్ముఖం కావడం కూడా కర్మకు మూలాధారమే. బాహ్యాకర్తవ్య నిర్వహణ చేయడమేగాక, అనివార్యమైన పరిస్థితులలో ప్రశాంతంగా తనలో తాను అంతర్లీనం కావడం అలవరుచుకోవాలి. ఇలా ప్రవృత్తి, నివృత్తి పడుగుపేకల్లా అల్లుకున్న జీవితమే సంపూర్ణ జీవితం. అప్పుడు జగత్తు సజావుగా సాగుతుంది.

# వేదమే 'నేత్రం'

– డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు, 98850 03420

వేదం గొప్పనేత్రం వంటిది. ఈ విధమైన ఉపమానాన్ని ఎవరుచెప్పారు? అని అంటే, విదురనీతి, మనుస్మృతి– హయశిర ఉపాఖ్యానం, వాధూలస్మృతి, నైషధీయచరితం, ఉత్తరచంపూ, శ్రీరంగరాజస్తవం, యాదవాభ్యుదయం, దేహళీశస్తుతి, దేశిక ప్రబంధం అని ఈ విధంగా ఎన్నోగ్రంథాలలో ఈ విధమైన ఉపమానం మనకు కనిపిస్తుంది. సామాన్యంగా గమనించి నప్పుడే ఇన్ని విధాలైన ఆకారాలు కనిపిస్తే, ఇక లోతుగా నిశితంగా గమనిస్తే మరెన్ని కనిపిస్తాయోకదా! వేదాన్ని కంటితో సమానంగా పోల్చడంలో ఉండే తాత్పర్యమేమి? అనే విషయాన్ని గమనించినప్పుడు కూడా, దానికి తగిన సమా ధానాలు కూడా అక్కడక్కడ కనిపిస్తాయి. మనం, ఏ వస్తువును చూడాలని కోరుకుంటామో దానికి అనుగుణంగా మననేత్రం కూడా మారుతుంది అని అంటున్నది విదురనీతి. *"గంధేన గావః పశ్యంతి, వేదైః పశ్యంతి బ్రాహ్మణాః, చారైః పశ్యంతి రాజానః, చక్షుర్భ్యా మితరే జనాః"*–జంతువులు వాసన ద్వారా విషయాలను చూస్తాయి, అంటే, తెలిసికొంటాయి. వేదం ద్వారా బ్రాహ్మణులు చూస్తున్నారు, అంటే, విషయాన్ని తెలుసుకుంటున్నారు. ప్రభువులు గూఢచారులద్వారా తెలుసు కుంటున్నారు. ఇక, సామాన్యమానవులు తమ నేత్రాలతో దర్శిస్తున్నారు.




ఆ విధంగానే, వారు వారు చూచే విషయంకూడా వేరు వేరుగానే ఉంటుంది. జంతువులు తమ ఎరను వాసన ద్వారా చూస్తాయి. బ్రాహ్మణులు అతీంద్రియాలైన వస్తువులను వేదంద్వారా దర్శిస్తారు. రాజులు తమ శత్రురాజుల సంగతులను గూఢచారులద్వారా చూస్తారు. సామాన్యమానవులు తమకంటి ముందు ఉండే వస్తువులను తమనేత్రాలతో చూస్తారు.

మనం దేనిని చూడకోరుతున్నామో, దానికి తగినట్లు మననేత్రాన్ని మార్చుకోవాలి. పరలోకం, పరమాత్మ మొదలైన విషయాలను మనం దర్శించాలని అనుకుంటే, వాటిని మనం వేదం ద్వారా దర్శించాలి. వేదాన్ని కంటితో సమానంగా చెప్పిన వారి దృష్టి ఏమంటే, ఆ వేదంలోని ప్రాధాన్యంలో దృష్టి– "సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్" అనే ఒక సంస్కృత సామెత ఉన్నది. దీని అర్థం ఏమంటే, మనకు ఉండే అన్ని ఇంద్రియాలలోను కన్ను ప్రధానమైన ఇంద్రియం అని. ఆ విధంగానే, మనకు ఉండే అన్ని ప్రమాణాలలోనూ వేదమే ముఖ్యమైన ప్రమాణం. అందుచేత, అన్ని ఇంద్రియాలలో ప్రధానమైన కంటితో సమానంగా, అన్ని ప్రమాణాలలో ప్రధానమైనదిగా వేదాన్ని చెప్పడం తగినది కదా!

మహాభారతంలో హయశిర ఉపాఖ్యానం అనే ఒక కథ ఉన్నది. ఆ ఉపాఖ్యానం హయగ్రీవ

వృత్తాంతాన్ని తెలియజేస్తున్నది. ఆ వృత్తాంతంలో– బ్రహ్మ అసురుల వల్ల తనవద్ద ఉండే వేదాలను పోగొట్టుకున్నట్లు తెలుపబడింది. ఆవిధంగా వేదాలను పోగొట్టుకున్న బ్రహ్మ ఏమని బాధపడ్డాడు? అంటే, **"వేదా మే పరమం చక్షుః వేదా మే పరమం ధనమ్"** అని. వేదాలు నాకు గొప్పకన్ను, వేదాలు నాకు గొప్ప ధనం. **"అంధకారమయా జాతాః లోకా వేదవివర్జితాః"**– వేదాలులేని ఈలోకం నాకు చీకటిమయంగా తోస్తున్నది. **"అహో బత! మహద్దుఃఖం వేదనాశనజం మమ"**– 'అయ్యో! అయ్యో!! వేదాలను పోగొట్టుకున్నందున నాకు చాలా దుఃఖం కలుగుతున్నది.' అని బ్రహ్మ చాలా బాధపడ్డాడు. ఈ బ్రహ్మ వచనాలలో మొదట వేదం గొప్పనేత్రం అని చెప్ప బడింది. కంటిని పోగొట్టుకున్న వానికి లోకం అంతా చీకటిగా

## శ్రీకృష్ణామృతం...

ఒక పరి నిను గన నా భాగ్యమే హరి!
కన్నుల వీక్షింప సౌభాగ్యమే॥

అది క్షీర సంద్రము అది ఆదిశేషుడు
అవి పట్టు పరుపులు ఆ పైన బటువులు
ఎఱ్ఱకలువల జంటను మించు కోమలము
అమ్మ కరముల నడుమన నీ చరణ ద్వయము
ఒక పరి నిను గన నా భాగ్యమే॥

అవి శంఖు చక్రములదే పాంచజన్యము
ఆచేత పద్మము అదే కౌమోదకము
మణిమయ భూషణ కాంతులు మెరయగ
అభయము నిచ్చుచూ ఆ దివ్య హస్తము
ఒక పరి నిను గన నా భాగ్యమే॥

అవి మీన నేత్రములదే మంద హసితము
అవి మిగుల ప్రేమల కారుణ్య దృక్కులు
మెరయు మేఘపు రాశి ఒద్దిక దాల్చగ
నీ రూపుగా కూడి దరిశన మీయగ
ఒక పరి నిను గన నా భాగ్యమే॥



–'అనంత'
కృష్ణసుందరి సత్తిరాజు,
99103 10594

తోస్తుంది కదా! ఆవిధంగానే, వేదనేత్రాన్ని పోగొట్టుకున్నవానికి లోకం అంతా చీకటిగా తోచడం సహజమే.

వేదం ఎవరికి నేత్రం అవుతున్నది? పై కథలో బ్రహ్మ వేదం తనకు నేత్రమని అన్నాడు. **"లోకత్రయీం త్రయీ నేత్రామ్"** అని మహాకావ్యాలలో ఒకటి అయిన నైషధీయచరితం పలుకుతున్నది. మూడులోకాలకు వేదం నేత్రమట. అందువల్లనే మనుస్మృతిలో **"పితృదేవమనుష్యాణాం వేదః చక్షుః సనా తనమ్"** అనే ఒకవచనం ఉన్నది. పితృదేవతలకు, దేవతలకు, మానవులకు వేదమనేది గొప్పనేత్రంగా ఉన్నది అని ఈ స్మృతి వచనం తెలుపుతున్నది.

'శ్రుతిస్మృతీ తు విప్రాణాం చక్షుషీ ద్వే వినిర్మితే" అనేది ఒక సూక్తి. విప్రులకు వేదాలు, స్మృతులు– అనేవి రెండుకళ్ళు అయ్యేటట్లు నిర్మింపబడ్డాయి– అనే అర్థం దీనివల్ల వస్తున్నది. ఈ వచనం వాధూలస్మృతిలో ఉన్నది.

ఇదే భావాన్ని **"శ్రుతిఃస్మృతిశ్చ విప్రాణాం నయనే ద్వే ప్రకీర్తితే, కాణస్తదేకయా హీనః ద్వాభ్యామంధః ప్రకీర్తితః"**– శ్రుతి, స్మృతి అనేవి రెండు కన్నులుగా విప్రులకు చెప్పబడ్డాయి. వీటిలో ఒకకన్ను లేనివాడు కాణుడు అని, రెండు కళ్ళు లేని వాడు అంధుడు– అని చెప్పబడుతున్నాడని పరాశరస్మృతి తెలుపుతున్నది.

'ఉత్తరచంపూ' అనే ఒకగొప్పకావ్యాన్ని వేంకటాధ్వరి అనే మహాకవి రచించారు.

అందులో శ్రీరామచంద్రుని గొప్పతనాన్ని గూర్చి చెబుతూ శ్రుతిని కన్నుగా కలిగి ఉంది. యోగులకందరకు ఆ వేదమే నేత్రం అవుతున్నది అని వేంకటాధ్వరి చమత్కారంగా అంటారు.

ఈ విధంగా వేదాన్ని కంటితో పోలుస్తూ పలకడంలోని స్వారస్యం ఏమంటే– **వేదం నేత్రం వలె ప్రధానం. వేదం కన్ను వలె ప్రమాణం. కంటికి ఏ హాని కలుగకుండా కనురెప్పలతో కాపాడుకునేటట్లే, వేదానికి ఏవిధమైన హాని కలుగకుండా మనం అన్ని విధాలుగా ప్రయత్నించి రక్షించుకోవాలి** అని.

అందుకే– మేము వేదాన్ని అధ్యయనం చేస్తున్నాము. ఆ వేదం మమ్మలను రక్షించు గాక!!

ఓమ్ తత్సత్



# పతంజలి యోగసూత్రములు- విశిష్టత

- శ్రీ పి.కృష్ణమూర్తి, 92905 16358.

అంతర్జాతీయ యోగాదినం జూన్, 21 సందర్భంగా..

యోగసాధనకు "ధర్మము" అనే విత్తనము ఆధారము. ఇది మహావృక్షమై పుష్పించి ఫలించును. పతంజలి యోగసూత్రములు 196 యోగసూత్రముల సముదాయము. ఇవి నాలుగు భాగములు లేక పాదములుగా విభాగించిరి.

1) సమాధిపాదము; 2) సాధనపాదము; 3) విభూతి పాదము; 4) కైవల్యపాదము

## 1)సమాధిపాదము

మనస్సుని లేదా ఆలోచనా గమనమును నియంత్రించుటకు అవసరమైన సాధనము. 'సమము' అంటే సమాన దృక్పథం, మనోవాక్కాయ కర్మలందు సమాన దృక్పథము కల్గి ఉండుట. మన సమదృష్టి, సత్త్వము, రాజసము, తామస గుణములపై ఆధారపడి ఉండును. 'యోగ' అంటే 'సమాధి', 'సమాధి' అంటే యోగము.

**సమాధి-** 1)మనదృష్టిని వస్తువుపై కేంద్రీకరించుట 2)మనదృష్టిని శూన్యముపై కేంద్రీకరించుట.

సమాధిగమనము అయిదు అవస్థలపై ఆధారపడి ఉంటుంది.

**మనిషి దృక్పథం-** 1)సరియైన దృక్పథం- సాధనమున సాధించును; 2)తప్పుడు దృక్పథం- మనోవికారములు మూలము; 3)తప్పుడు ఆలోచనలు లేదా మంచి, చెడుల మధ్య డోలాయమాన స్థితి; 4) నిద్రలేక అతినిద్రలేక నిద్రపట్టకపోవడం; 5)జ్ఞాపకాల పందిరి.

మనిషి జీవితము, ఎట్లంటే సాలెపురుగు వలె ప్రేమతో, శ్రమించి తన గూడును అందముగా నిర్మించినట్లు, సాలెపురుగుకి అది అందమైన బందిఖానా అని తెలియక శ్రమించి అందులో చిక్కుకుంటుంది. ఇలాగే కోరికల వలయంలో మనిషి చిక్కుకొని- మనోవైకల్యము, మనఃక్లేశమునకు గురి అవును. సంతోషము, విచారము, బాధ, బరువు అనేవి ఫలాలు. ఇవి విడివడాలంటే 'యోగాభ్యాసము' ఒక్కటే మార్గము. అభ్యాసము మరియు వైరాగ్యం అనేవి మూలాధారములు.

## 2)సాధనపాదము

సాధనపాదము ఆధ్యాత్మిక సమ్మిళితము. దీనికి, సోపానములు ఎనిమిది. *యమము, నియమము, ఆసనములు, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము మరియు సమాధి.*

1)యమము 2)నియమము 3)ఆసనములు 4)ప్రాణాయామము- ఆధ్యాత్మికసాధనలో పురోగమించుటకు ఉపయోగము; 5)ప్రత్యాహార 6)ధారణ- స్వాధ్యాయనము లేదా స్వంతంగా నేర్చుకొనుట; 7)ధ్యానము 8)సమాధి-అంతా పరమాత్ముడిదే అనే భావన- ఆత్మార్పణము.

అవిద్య, అవివేకము- అన్ని రకముల రుగ్మతలకు మూలం ఫలితము అహంకారము, మమకారము, హేయభావము. కోరికలు పెంచుకోవడంలో నియంత్రణ అవసరం. ఋషి పతంజలి అష్టాంగయోగమును అనుష్ఠించినట్లైతే శరీరము, ఆత్మలో పేరుకున్న మలినాలు కరుగుతాయి. అప్పుడే నిజమైన చైతన్యము మనోవికాసము సిద్ధించును.

### అ) యోగాసనాలు

సాధనాఫలితం, శరీరమార్పులు గుర్తించుట. సమయానుకూలంగా వాతావరణ మార్పులకు వచ్చు

రుగ్మతలను తట్టుకొనుటకు తగ్గ అవగాహనను కలిగి ఉండుట. సమస్యలను తొందరగా పరిష్కరించుట. దృష్టిని స్థిరీకరించు శక్తిని కలిగి ఉండుట మొదలగునవి **'యోగాసనాల'** ఫలము.

### అ)ప్రాణాయామము

దీర్ఘశ్వాస, శ్వాసను ఆపడం, వదలడం, మళ్లీ ఆపడం పీల్చడం అను ఉచ్ఛ్వాస నిశ్వాసములు క్రమపద్ధతిలో సాధన చేయడం అవసరం. దృశ్యము, ధ్వని, స్పర్శ, ఆకారం, రుచి, వాసనలను నియంత్రించి శక్తిని దృఢము చేయును.

### ఇ)ప్రత్యాహారము

సంకల్ప, వికల్పముల నుండి మనోవైకల్యము కలగకుండుట. శరీరము, మనస్సు మరియు ఆత్మ మొదలైనవి ఒకటిగా అంతర్ముఖము అగును. ఆలోచనల శుద్ధి తనంతట అదే అగును. తేజస్సు మరియు ఓజస్సు వృద్ధిచెంది అవిద్య, అమాయకత్వము, అహంకారము, నాది, నేను అనే భావనను తొలగించును. ఏదో సాధించాలనే తపన బదులు జరుగుచున్న మార్పులకు సాక్షిగా నిలుచును.

## 3)విభూతిపాదము

యోగసాధనలోని ముఖ్య ఉద్దేశ్యము, వాతావరణములో ఉన్న దివ్యశక్తిని శరీరములోనికి లయంచేయడం. సాధకుడు భూత, భవిష్యత్ మరియు వర్తమానముల పూర్తిజ్ఞానము కలిగి ఉండటం. ఇతరుల మనస్తత్త్వము, పూర్తిగా అవగాహన కలుగును.

ఇక్కడే సాధకునికి అనితర శక్తులు సంక్రమించును. అతిజాగ్రత్తతో వ్యవహరిస్తే ఆధ్యాత్మికతను సంతరించుకొనును. అనితర శక్తులతో సిద్ధిని పొందును. తన్ను తాను నిగ్రహించుకొని ఆధ్యాత్మికముగా ఎదిగిన, కైవల్యమార్గము సులభతరమగును లేదా ఈ విభూతులను స్వార్థము కోసం దుర్వినియోగము చేసిన అధోగతి తప్పదు.

## 4)కైవల్యపాదము

వ్యక్తి గుణాతీతుడు లేదా త్రిగుణాత్ముడు అగును. తామసిక, రాజసిక, సాత్త్విక గుణములకు అతీతుడు. పూర్ణపురుషుడు, లోకాతీతుడు, విధిని నిర్వర్తించి భగవంతునియందు లయముచేయును. ఫలితము అప్రధానము. అంటీ అంటనట్లు సంచరించును. సాక్షిగా నిలుచును. ఇది సుశిక్షితుడైన సాధకుని లక్షణము. యోగసాధన ఆధ్యాత్మికత, ఔన్నత్యమునకు చేర్చును.

యోగసాధకుడు, తన గురువు చరణములను ఆశ్రయించిన యోగాభ్యాసము తదుపరి తనలో నిక్షిప్తమైన అతీంద్రియ శక్తులను గుర్తించును.

### సాధకుని సాధనకు ఉపయుక్తము

*1)ఆత్మార్పణము- మనోవాక్కాయ కర్మలు భగవత్ అర్పణము చేయాలి.*

*2)తపన- సాధించాలనే నిరంతర కృషి, మంచికి పాటుపడే తత్త్వము కల్గి ఉండాలి.*

*3)నిరంతర అవగాహనము- పరిస్థితులు బేరీజు వేసికొను చతురత కల్గి ఉండాలి.*

*4)ఎక్కువ సమయము కేటాయించడం- లక్ష్యము సాధించుటకు సమయమును ఎక్కువగా కేటాయించాలి.*

### భగవదర్పణము

*1)కర్మలను ఆచరించుటయందు నిష్కామబుద్ధి.*

*2)కోరికలను అదుపులో ఉంచడము.*

*3)మనస్సుని ఏకాగ్రచిత్తమునందు లగ్నం చేయడం.*

*4)అన్నీ నాకే కావాలి అన్న తపననుండి విడివడటం.*

### నరజన్మకి ఈతి బాధలకి మూలము

*1)అమాయకత్వము, తెలివిహీనత, అవిద్య.*

*2)అహంకార, మమకారములు.*

*3)రాగద్వేషములు.*

*4)చావుభయం.*

*5)జీవిత గమనములో ఒడిదుడుకులను తట్టుకోలేకపోవడం.*

*6)జీవేచ్ఛ నశించకపోవడము.*

పతంజలి, అష్టాంగయోగమును అనుష్ఠించిన భౌతికమైన, మానసికమైన రుగ్మతల నుంచి మానవాళి విమోచనము ప్రాప్తించును.

సుశిక్షితుడైన సాధకుని అహంకారము సత్త్వగుణ సమ్మిళితము. తన మనోభావములను భగవత్ ఆదేశమునకు ముడిపెట్టి పరిశీలించును. ఇతరుల జ్ఞానమునుండి విజ్ఞానము పొందుటకు కృషి జరుపును. నిరంతర విద్యార్థి.

ఈ విధంగా యోగసాధనలో ప్రవేశించి మనలోని మానసిక ఒత్తిడులను, రుగ్మతలను తొలగించుకోవాలి.

*ఓమ్ తత్ సత్॥*

*గత సంచిక తరువాయి భాగం....*

గరుడా! అనంతా! భగవంతునిచే మీరు అనుగ్రహింప బడుదురు గాక!

కాసారయోగి పరమాద్భుత భక్తిబద్ధ
వాఙ్మాల్యభూషితమహోత్పల రమ్యపాద,
గోపాధినాథ వసుదేవకుమార కృష్ణ
శ్రీగోవిందరాజ విజయీ భవ గోకులేంద్ర.

శ్రీభూతయోగి పరికల్పిత దివ్యమాన
జ్ఞానప్రదీపపరిదృష్ట గుణామృతాబ్ధే,
గోగోపజాలపరిరక్షణ బద్ధదీక్ష
గోవిందరాజ విజయీ భవ గోపవంద్య.

మాన్యానుభావ మహదాహ్వయ యోగిదృష్ట
శ్రీశంఖచక్ర కమలాసహితామలాంగ,
గోపీజనప్రియచరిత్ర విచిత్రవేష
గోవిందరాజ విజయీ భవ గోపనాథ!

(కాసారయోగి *(పొయ్‌గై ఆళ్వారు)* విరచితములైన భక్తి నిబద్ధములైన వాగ్రూపమాలికలచేత నలంకరింపబడిన కమల మనోజ్ఞములైన పాదములు గలవాడా! గోపాలపాలకా! వసుదేవపుత్రా! కృష్ణా! గోకులనాథా! గోవిందరాజా! జయశీలుడ వగుము.

శ్రీ భూతయోగి *(పూదత్తాళ్వారు)*చే సృష్టింపబడిన వెలుగొందెడి జ్ఞానప్రదీపముచే చక్కగా నెరుగబడిన గుణములకు నమృతసాగర స్వరూపా! గోవులను గోపాలకులను రక్షించుటయందు దీక్షబూనినవాడా! గోపాలకవందనీయా! గోవిందరాజా! జయశీలుడ వగుము.

మహానుభావుడైన మహదాహ్వయయోగి *(పేయాళ్వారు)*చే సాక్షాత్కరించుకొనబడిన శ్రీమంతములగు శంఖచక్రములతోడను లక్ష్మీదేవి తోడను కూడినట్టి నిర్మలదేహము గలవాడా! గోపికాజనమునకు ప్రియమైన చరిత్రగలవాడా! విచిత్రవేషా! గోపప్రభూ! గోవిందరాజా! జయశీలుడ వగుము.)

పొయ్‌గైయాళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారులను భగవంతుడను గ్రహించు గాక!

శ్రీమత్త్వదీయపదపంకజభక్తినిష్ఠ
శ్రీభక్తిసార మునినిశ్చితముఖ్యతత్త్వ,
గోపీజనార్తిహర గోపజనాంతరంగ
గోవిందరాజ విజయీ భవ గోపరత్న.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు

(సిరిగల నీ పదకమలములందు దృఢభక్తిగల శ్రీభక్తిసార *(తిరుమళిశై ఆళ్వారు)* మునిచేత నిశ్చయింపబడిన నిజస్వరూపము గలవాడా! గోపికాబాధాపరిహారా! గోపజనాంతరంగా! గోపాలమణీ! గోవిందరాజా! జయశీలుడ వగుము.)

శ్రీభక్తిసారయోగి *(తిరుమళిశై ఆళ్వారు)* భగవంతునిచే అనుగ్రహింపబడుదురు గాక!

శ్రీమత్పరాంకుశమునీంద్ర సహస్రగాథా
సంస్తూయమాన చరణాంబుజ సర్వశేషిన్,
గోపాలవంశతిలకాచ్యుత పద్మనాభ
గోవిందరాజ విజయీ భవ గోపవేష.

(శ్రీమత్పరాంకుశ *(నమ్మాళ్వారు)* గ్రథితగాథాసహస్రము చేత స్తుతింపబడుచున్న చరణకమలములు

గలవాడా! సర్వచేతనులకును శేషిభూతుడా! గోపాలకుల భూషణా! పద్మనాభా! గోపాలవేషా! గోవిందరాజా! జయశీలుడ వగుము.)

మన శఠగోపుని (నమ్మాళ్వారులను) భగవంతుడను గ్రహించు గాక!

**శేషాచలే మహతి పాదప పక్షిజన్మ**
**త్వద్భక్తితః స్పృహయతా కులశేఖరేణ,**
**రాజ్ఞా పునః పునరుపాసిత పాదపద్మ**
**గోవిందరాజ విజయీ భవ గోరసజ్ఞ.**

(నీయందలి భక్త్యతిశయముచేత శేషాచలమందు చెట్టు గానైనను పిట్టగానైనను పుట్టుక నభిలషించెడి శ్రీకులశేఖర మహారాజు రాజుచేత మరల మరల ఉపాసింపబడిన చరణ ములుగలవాడా! ఆవుపాలరుచి యరసినవాడా! గోవిందరాజా! జయశీలుడవు కమ్ము.)

శ్రీకులశేఖరాళ్వారులు భగవంతునిచే అనుగ్రహింపబడు దురు గాక!

**శ్రీవిష్ణుచిత్తకృతమంగళ దివ్యసూక్తే**
**తన్మానసాంబురుహకల్పిత నిత్యవాస,**
**గోపాలబాలయువతీవిట సార్వభౌమ**
**గోవిందరాజ విజయీ భవ గోవృషేంద్ర.**

(శ్రీవిష్ణుచిత్త దివ్యసూరి (పెరియాళార్వ)చేత రచింప బడిన మంగళకర దివ్యసూక్తులు గలవాడా! ఆయన హృదయ కమలమునందు నిత్యనివాసము కల్పించుకొనినవాడా! గోప ముగ్ధాంగనా విటసార్వభౌమా! ధేనువృషభపాలా! గోవిందరాజా! జయశీలుడవగుము.)

పెరియాళ్వారులను భగవంతు డనుగ్రహించు గాక!

**శ్రీవిష్ణుచిత్త కులనందన కల్పవల్లీ**
**గోపాలకాంత వినివేశితమాల్యలోల!**
**గోపాంగనాకుచ కులాచలమధ్యసుప్త**
**గోవిందరాజ విజయీ భవ గోధనాఢ్య.**

(శ్రీవిష్ణుచిత్తుల కులమనెడు నందనవనమందలి కల్ప లతవంటి గోదాదేవిచే కుంతలములందు ధరింపబడిన మాల్యమునందు ఆశగొన్నవాడా! గోపాంగనల కుచము లనెడు కులాచలములమధ్య పవ్వళించువాడా! గోధనసమృద్ధిగలవాడా! గోవిందరాజా! జయశీలుడవు కమ్ము.)

పెరియాళ్వారుల కొమారితయగు గోదాదేవి భగవం తునిచే అనుగ్రహింపబడు గాక!

**భక్తాంఘ్రిరేణుమునినా పరమం తదీయ**
**శేషత్వ మాశ్రితవతా విమలేన నిత్యమ్,**
**ప్రాబోధికస్తుతికృతా హ్యవబోధిత శ్రీ-**
**గోవిందరాజ విజయీ భవ గోపబంధూ.**

(మేలైన భాగవతశేషత్వమును ఆశ్రయించినవాడును, నిష్కల్మషుడును, ప్రాబోధికస్తుతిని ('తిరుప్పళ్లియెళుచ్చి' యనెడు మేలుకొలుపు గీతమును) రచించినవాడును అగు భక్తాంఘ్రి రేణుమునిచేత (తొండరడిప్పొడి యాళ్వారనెడి విప్రనారాయ ణుడు) ప్రతిదినము మేల్కొలుపబడినవాడా! గోపాలబంధూ! శ్రీగోవిందరాజా! జయశీలుడవు కమ్ము.)

తొండరడిప్పొడియాళ్వారు (భక్తాంఘ్రిరేణువు) భగవంతు నిచే అనుగ్రహింపబడు గాక!

**శ్రీపాణనామకమహాముని గీయమాన**
**దివ్యానుభావదయమాన దృగంచలాఢ్య,**
**సర్వాత్మరక్షణవిచక్షణ చక్రపాణే**
**గోవిందరాజ విజయీ భవ గోపికేంద్ర.**

(పాణాజ్యులగు (తిరుప్పాణాళ్వార్) మహామునులచేత కీర్తింపబడిన దివ్యప్రభావముగలవాడా! కృపతొలుకాడు క్రీగంటి చూపులవాడా! సకల చేతనరక్షణప్రవణా! చక్రధారీ! గోపికా ప్రభూ! గోవిందరాజా! జయశాలివి కమ్ము.)

తిరుప్పాణాళ్వారులు భగవంతునిచే అనుగ్రహింపబడు దురు గాక!

**భక్తోత్తమాయ పరకాలమునీంద్రనామ్నే**
**విశ్రాణితాతుల మహాధన మూలమంత్ర,**
**పూర్ణానుకంప పురుషోత్తమ పుష్కరాక్ష**
**గోవిందరాజ విజయీ భవ గోసనాథ.**

(పరకాలమునీంద్రు డనుపేరుగల భక్తశిఖామణికి నిధి వంటిమూల (అష్టాక్షరీ) మంత్రమును ఒసగినవాడా! దయా పూర్ణా! పురుషోత్తమా! పుండరీకాక్షా! గోవులతో ఒప్పియుండు వాడా! గోవిందరాజా! జయశీలుడవు కమ్ము.

*(ఇంకా ఉంది)*

విజ్ఞానం

# అంతుచిక్కని ప్రాచీన భారతీయ విజ్ఞానం

- డా।। విశ్వనాథ కుటుంబరావు,
83099 10673

మన భారతదేశం ఎన్నో అద్భుతాలకు చిరునామా. ప్రపంచానికి వైద్యం అంటే ఏంటో తెలియనిరోజుల్లోనే శస్త్ర చికిత్సలు చేసిన ఘనత మన భారతీయ వైద్యులది. ఎన్నో అద్భుతమైన శాస్త్రాలను, సాంకేతిక పరిజ్ఞానాలను మనవాళ్లు కనిపెట్టారు. వాటిలో ఎన్నో అంతుతెలియని శాస్త్రాలు ఉన్నాయి. వాటి గురించి కొంచెం పరికిద్దాం.

## 'అక్షహృదయం'

'అక్షహృదయం' భారతీయులు కనిపెట్టిన ఒక అద్భుతశాస్త్రం. అక్షహృదయం తెలిస్తే లెక్కలు మన వేళ్ళమీద ఉంటాయి. సంఖ్యాశాస్త్రంలో పైమెట్టు అక్షహృదయానిదే. ఈ విద్య తెలిస్తే కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు అవసరం లేదు.

మహాభారతంలో ఈ విద్య గురించిన వివరాలు ఉన్నాయి. నలదమయంతుల కథలో భాగంగా ఈ విద్య గురించి వస్తుంది. కాలం కలిసి రాక నలదమయంతులు అడవుల పాలవుతారు. ఆ సమయంలో దమయంతి కనబడకుండాపోవటం, ఆమెకోసం అడవుల్లో తిరుగుతున్న నలుని కర్కోటకుడు అనే పెద్ద నాగు కాటేయడం, ఆపై అతడు కురూపిగా మారిపోవడం, ఋతుపర్ణుడు అనే రాజు దగ్గరికి వెళితే, అంతా మంచే జరుగుతుందని కర్కోటకుడు చెప్పడం జరుగుతుంది. ఋతుపర్ణుడు రాజు మాత్రమే కాదు, సంఖ్యా శాస్త్రవేత్త కూడా. అతనికి 'అక్షవిద్య'లో మంచి ప్రావీణ్యం ఉంది. ఆ విద్యతో ఒక చెట్టుకి ఎన్ని ఆకులు, పళ్ళు ఉన్నాయో క్షణాల్లో చెప్పగలడు. కర్కోటకుని సలహాతో నలుడు 'బాహుకుడు' అనే మారుపేరుతో ఋతుపర్ణుని దగ్గర చేరాడు. అప్పుడే విదర్భ రాజకుమారి దమయంతికి స్వయంవరం జరుగుతోందని సమాచారం వస్తుంది. ఆ స్వయంవరానికి వెళ్లాలని ఋతుపర్ణుడు అనుకుంటాడు.. కానీ మర్నాడే స్వయంవరం. అతి తక్కువ సమయంలో విదర్భకు చేరడం సాధ్యం కాదు. అయినా, ఋతుపర్ణుడు వెళ్లాలనుకుంటాడు. రథం నడపడంలో దిట్ట అయిన బాహుకుడి పేరుతో ఉన్న నలుణ్ణి ఋతుపర్ణుడు తీసుకెళ్లాడు. గాలి కన్నా వేగంగా రథాన్ని నడిపాడు, ఆ వేగంలో ఒకచోట ఋతుపర్ణుడు వేసుకున్న ఉత్తరీయం పడిపోయింది. రథాన్ని ఆపి ఉత్తరీయాన్ని తీసుకురమ్మని నలుడికి చెప్పాడు, ఋతుపర్ణుడు. అప్పటికే 10 క్రోసుల దూరం వచ్చేశామని నలుడు చెప్పాడు. ఋతుపర్ణుడు ఆశ్చర్యపోయాడు.

ఇంతలో మార్గమధ్యంలో ఒకచోట ఓ పెద్ద చెట్టు కనబడుతుంది. ఆ చెట్టుకి ఐదు కోట్ల ఆకులు, 2,900 పళ్ళు ఉన్నాయని ఋతుపర్ణుడు చెప్తాడు. అప్పుడు ఇద్దరికీ ఒక విషయం అర్థమైంది. నలుడికి రథాన్ని వేగంగా నడిపే 'అశ్వ హృదయం' గురించి తెలుసు. ఋతుపర్ణుడికి కంప్యూటర్లను మించిన అక్షహృదయం గురించి తెలుసు. నలుడు ఋతుపర్ణునికి తన విద్యను నేర్పాడు. బదులుగా ఋతుపర్ణుడు అక్షహృదయాన్ని నలుడికి నేర్పాడు. ఏ జూదంతో నలుడు రాజ్యాన్ని పోగొట్టు కున్నాడో, ఆ జూదంలోనే నలుడు అక్షవిద్య సహాయంతో మళ్లీ రాజ్యాన్ని గెలుచుకున్నాడు.

ఈ విద్య ఋతుపర్ణుడు, నలుడి తర్వాత ఆ స్థాయిలో తెలిసినవాడు శకుని. ఈ విద్యతోనే శకుని ధర్మరాజును పాచికల్లో ఓడించి అడవుల పాలు చేశాడు. ఆ తర్వాత అడవుల్లో ధర్మరాజు కూడా తనకు తెలియని ఈ అక్షహృదయాన్ని ఓ ఋషి దగ్గర నేర్చుకున్నాడు. ఇలా కనపడని అంకెలను కూడా మనసుతో చూసే విద్యే అక్షహృదయం. ఇలాంటి విద్యలు ఎన్నో మన భారతీయులు కనిపెట్టారు.

## 'అశ్వహృదయం'

ఇక నలుగురికి తెలిసిన 'అశ్వహృదయం' మరో అద్భుతం. గుర్రాల గురించి పూర్తిగా చెప్పే విద్యయే అశ్వహృదయం. నలునకు తెలిసిన ఈ విద్య మహాభారతంలో శ్రీకృష్ణుడికి, నకులునకు కూడా తెలుసు. పాండవుల అజ్ఞాతవాసం



సమయంలో నకులుడు ఈ విద్యతోనే విరాటరాజు కొలువులో చేరి, అక్కడ గుర్రాలను అద్భుతంగా తీర్చిదిద్దాడు.

## శిలాహృదయం

ఇక, మరో అద్భుతమైన విద్య **శిలాహృదయం.** తంజావూర్‌లో బృహదీశ్వరాలయం ఉంది. వేలఏళ్ళ క్రితం భారీరాళ్లతో నిర్మించిన ఆ ఆలయం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఆ ఆలయ శిఖరం మీద ఉన్న 80 టన్నుల రాయిని ఎలా పెట్టారు? అన్నది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నయే. కోణార్క్ ఆలయం కూడా ఇలాంటిదే. 13వ శతాబ్దంలో కోణార్క్ ఆలయాన్ని మహాశిల్పి విసుమహారాణ నిర్మించాడు. ఆలయనిర్మాణంలో 1200మంది శిల్పులు పాల్గొన్నారు. అయితే, ఆలయశిఖరాన్ని పైకి మాత్రం ఎక్కించలేకపోయారు. అదే సమయంలో వచ్చిన విసుమహారాణా కుమారుడు ధర్మపథ, రాత్రికి రాత్రే అంత బరువున్న రాయిని శిఖరం మీదకు ఒక్కడే ఎక్కించాడని ఇప్పటికీ అక్కడి ప్రజలు చెప్తారు. 100 ఏనుగులు కూడా కదిలించలేని రాళ్ళను అప్పట్లో అంత ఎత్తున ఎలా పెట్టారు? దీని వెనుక ఉన్న అంతుచిక్కని విజ్ఞానాన్ని 'శిలాహృదయ'మని అంటారు. శిలాహృదయ నైపుణ్యంతో ఒక రాయి గురుత్వాకర్షణని సున్నా చేయొచ్చు అని అంటారు. అంటే, అంతరిక్షంలో గురుత్వాకర్షణ ఉండదు గనుక, ఎంత బరువున్న వస్తువునైనా చిటికెన వేలితో లేపవచ్చు.

## పరకాయ ప్రవేశం

పరకాయ ప్రవేశం అనే గ్రంథాన్ని రచించినది **వాలఖిల్యుడు** అనే ఋషి. ఈ గ్రంథంలోనే 32 రకాల యోగ విద్యలు, అష్టసిద్ధుల గురించి ఉంది. దీనికి మన శరీరంలో ప్రతి భాగం మీద నియంత్రణ అవసరం అంటే ప్రాణం మనం చెప్పినట్టు వినాలి.

సాధారణంగా మనము పంచప్రాణాలు అంటాము. అవి **ప్రాణ, సమాన, అపాన, ఉదాన, వ్యాన** వాయువులుగా ఉంటాయి. ఈ విషయాన్ని వేదాలు ఉపనిషత్తులు చెబుతున్నాయి. ప్రాణం శ్వాసని, ఆలోచనని, స్పర్శని నియంత్రణ చేస్తుంది. అందుకే ఊపిరి ఆగిపోగానే మనిషి మరణించాడని అంటారు. మనిషి చనిపోయినా, ప్రాణం పూర్తిగా శరీరం నుంచి బయటకు వెళ్లడానికి కనీసం రెండు గంటల సమయం పడుతుంది. అందుకే చనిపోయిన వెంటనే దహనం చేయరు. కనీసం రెండు మూడు గంటలు ఆగిన తర్వాతే దహనం చేయాలని శాస్త్రమే చెబుతోంది. అయితే, పంచ ప్రాణాల్లో ఒకటి మాత్రం ఎక్కువ కాలం పనిచేస్తుంది. అది 'వ్యానం'. ఈ వ్యానం ద్వారానే ప్రాణం బయటకు వెళ్తుంది. బయటకు వెళ్లినా 12 రోజులపాటు ప్రాణం అక్కడే తిరుగుతుంది అని మన కర్మకాండసిద్ధాంతం కూడా చెబుతుంది. అందుకే 12 రోజులపాటు కర్మకాండ చేస్తాము. పరకాయప్రవేశం చేయాలంటే, ఈ వ్యానాన్ని నియంత్రణ చేయాలి. అలా వ్యానాన్ని నియంత్రణ చేయగలిగినప్పుడు, మనకు కావలసినప్పుడు ప్రాణాన్ని బయటకు తీసుకురావచ్చు. మళ్లీ కావలసినప్పుడు అదే మార్గం నుంచి ప్రాణాన్ని లోపలికి తీసుకెళ్లవచ్చు. వ్యానం ఉన్నంతవరకు మన శరీరంలో ఏ భాగము పాడవదు. ఆదిశంకరులు ఈ పద్ధతి ద్వారానే పరకాయప్రవేశం చేశారు.

మన లెక్క ప్రకారం ఊపిరి ఆగిపోయిన రెండు గంటల వరకు ప్రాణం అనేది శరీరంలోనే ఉంటుంది కాబట్టి, ఆ సమయం లోనే పరకాయ ప్రవేశం చేయాలి. అలా మన ప్రాణ శక్తిమీద పూర్తి నియంత్రణ సాధించే యోగమే పరకాయప్రవేశం.

ఇంకా మనదేశంలో అద్భుతశాస్త్రాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికీ విజ్ఞానశాస్త్రానికి అందని వింతలెన్నో ఉన్నాయి. అందులో–

## శకునశాస్త్రం

ఈ శాస్త్రాన్ని **గర్గముని** రచించాడు. పక్షుల అరుపులు, మనుషుల మాటలను బట్టి శుభాలు, అశుభాలను చెప్పే శాస్త్ర మిది. ఎవరైనా కొత్తవారు వస్తే వీధిలో కుక్కలు అరుస్తాయి. అలాగే, కొన్ని ప్రకృతి విపత్తులను సీతాకోకచిలుకలు ముందే పసిగడతాయి. మనం కోపం వచ్చినప్పుడు ఒకలా, ఆనందంగా ఉన్నప్పుడు మరొకల ప్రవర్తిస్తాం. అలా పక్షుల, మానవుల మనో విజ్ఞానశాస్త్రాన్ని కలిపి ఉన్న శాస్త్రం శకునశాస్త్రం. ప్రపంచంలో మొట్టమొదటి మనోవిజ్ఞానశాస్త్రవిషయం 'శకునశాస్త్రము'.

## విషశాస్త్రం

ఈ శాస్త్రాన్ని **అశ్వినీకుమారుడు** రచించాడు. ఇందులో 32 రకాల విషాల గురించి ఉంది. ఆ విషాల గుణాలను చెప్పింది. అంతేకాదు, ఆ విషాలను ఎలా తయారు చేయొచ్చు కూడా ఉంది. ఆ విషానికి విరుగుడు గురించి కూడా ఆ శాస్త్రం చెప్పుంది. ఇది ఒక ఆశ్చర్యం.

## గజశాస్త్రం

ఈ శాస్త్రాన్ని సాక్షాత్తు **కుమారస్వామే** రచించారని అంటారు. ఇందులో ఏనుగుల శరీర లక్షణాన్ని పరీక్షించదానికి 16 పద్ధతులు ఉన్నాయి.

## ఇంద్రజాలం

మరో అద్భుతమైన శాస్త్రం **మహేంద్రజాలం**. ఇప్పుడు మ్యాజిక్ అంటున్నాం. ఈ గ్రంథాన్ని **వీరబాహు** అనే ఋషి రచించాడు. ఇందులో అన్ని గారడీవిద్యల గురించి ఉంటాయి. నీటిపై నడవడం, గాలిలో తేలడం ఇలాంటి భ్రమలు కల్పించే విద్యలు ఎలా ప్రదర్శించాలో ఈ మహేంద్రజాల గ్రంథంలో ఉన్నాయి.

ఇలాంటి ఎన్నో అద్భుత గ్రంథాలను మన భారతీయులు సృష్టించారు. భారతదేశంపై జరిగిన ఎన్నో దండయాత్రలతో ఈ గ్రంథాల మూలాలు చాలా వరకు నాశనం అయ్యాయి. అయినా, ఇప్పటికీ సైన్స్‌కి అందని ఎన్నో విషయాలు మన ప్రాచీనఋషులు రచించిన గ్రంథాల్లో కనిపిస్తూనే ఉంటాయి. కాబట్టి భారతీయవిజ్ఞానం విశ్వానికి మార్గదర్శకంగా చెప్పవచ్చు.

# కురుక్షేత్రము

కురుక్షేత్రము ఇది ధర్మ క్షేత్రము
కౌరవపాండవ పోరుకు రణక్షేత్రము॥

వీరులు శూరులు యోధులు ధనుర్ధారులు
అపరిమితముగా నున్న కౌరవ సైన్యములు
పరిమితమైనా గొప్పవి పాండవ బలగాలు
శంఖముల భేరీల మరణ ఘోషలు॥

కపిధ్వజము నీడలో శ్వేతాశ్వములు
రథము పైన ఉన్నారు నరనారాయణులు
ఇరుసైన్యముల మధ్యన కృష్ణార్జునులు
పార్థుడు పరిశీలించెను శత్రుమిత్ర పక్షములు॥

యుద్ధమునకు సిద్ధమైన తాతలు తండ్రులు గురువులు
మరణించుటకై వచ్చిన బంధు మిత్రులు
అయిన వారిని జంపిన రాజ్యాధికారాలు
రక్తముతో తడిసిన నేలపైన భోగాలు॥

వంశనాశనమునకు లేదు ప్రాయశ్చిత్తము
కులస్త్రీల పతనముతో కలుగు వర్ణసంకరము
పితృదేవతలకుండదు పిండప్రదానము
అధర్మము ప్రబలమై ప్రాప్తించును నరకము॥

మనసు వికలముకాగా దేహము కంపించెను
గాండీవము చేజారగ రథముపై చతికిలబడెను
మరణము ఎంతో మేలని నరుడు తలచెను
చిరునగవుల శ్రీకృష్ణుడు గీతబోధగావించెను॥

తటపడెను ధృతరాష్ట్రుని రాజ్యకాంక్ష రీతి
అదుపూ పాదుపూ లేని సుయోధనుని దుర్నీతి
మానవీయవిలువలున్న అర్జునుని పాపభీతి
లోకకల్యాణమునకు పరమాత్మ ధర్మనిరతి॥

విషాదములో నుండి విజ్ఞానము జ్ఞానము పుట్టెను
గాంఢాంధకారమణగి వెలుగు రేఖలు విరిసెను॥

– డా॥ జి.సుబ్రహ్మణ్యం రెడ్డి,
98499 39637

# హయగ్రీవముపాస్మహే!



- డా॥ యస్.ఏ.టి.రాజ్యలక్ష్మి

అశ్వముఖుడై, తనను ఉపాసించిన వారికి వాక్శుద్ధి, సకలవిద్యలు, భూత, భవిష్యత్, వర్తమాన కాలజ్ఞానం ప్రసాదించడానికి విష్ణుమూర్తి అవతరించిన దివ్యస్వరూపమే హయగ్రీవుడు. బ్రహ్మ సృష్టించిన వేదాలపహరించిన మధు కైటభులనే రాక్షసులను సంహరించి, వేదసంరక్షణగావించి, సకల మానవాళికి వేదజ్ఞానాన్ని ప్రసాదించిన అవతార విశేషమిది. ముందు ప్రణవం(ఓంకారం) కల విషట్ శబ్దం(ఆకర్షణశబ్దం)తో 'హ'కార, 'స'కార, 'ఔ'కార, 'మ'కారాలనే బీజాక్షరాలు కల మంత్రమే హయగ్రీవ మంత్రం, *"మననాత్ త్రాయతే ఇతి మంత్రః"* అని మంత్ర వ్యుత్పత్తి. నిత్యం ఎవరైతే మంత్రాన్ని మననం చేస్తారో వారిని రక్షించేది మంత్రం, హయగ్రీవ మంత్రాన్ని సాధన చేస్తే అన్నింటినీ తెలుసుకొనే శక్తి, వశీకరణ శక్తి, సకల భాషాపాండిత్యం, అఖండమణి, కవిత్వం, వాక్సిద్ధి మాత్రమే కాకుండా-

సర్వవేదస్వరూపుడు, వాక్కుకు అధిపతి, వేద మయుడు అయిన హయగ్రీవుని ప్రసన్నం చేసుకోవాలంటే-

హృదయకమలంపై స్వామిరూపాన్ని ప్రతిష్ఠించు కొని, బీజమంత్రాలను ఏకాగ్రచిత్తంతో ఉపాసన చేస్తే, ఆ శక్తి సర్వసిద్ధులను ప్రసాదిస్తుంది. హయగ్రీవోపాసనతోపాటు, గణపతి ఉపాసన, చింతామణి ఉపాసన, సరస్వతి ఉపాసన ఇవన్నీ విద్యలకు సంబంధించినవే. వేదాంతదేశికులు హయగ్రీవస్తోత్రంలో-

"అజ్ఞానాంధకారంలో సైతం సమస్తాన్ని దర్శించడానికి సాధనమైన ఒక అపురూపమైన కాటుకవంటి ప్రజ్ఞ అనెడి దృష్టిని ప్రసాదించేవాక్కుకు అధిపతి, శ్రీమన్నారాయణుని అవతార విశేషమైన హయగ్రీవుడు నా ముఖమునందు సకల వేదవేదాంగాది చతుర్దశ శాస్త్రాలను ప్రసాదించు గాక!" అని స్తుతించారు.

నిర్దుష్టంగా, ప్రీతికరంగా, సకలశాస్త్రవివేకంతో భాషించడం వల్ల అందరినీ అలరించవచ్చు. మన వశంచేసుకోవచ్చు. ఇది సర్వ కాలసర్వావస్థలలోనూ మానవునికి ఎంతో అవసరం. అటువంటి వాక్సిద్ధిని ప్రసాదించే జ్ఞానానందమయుడు, నిర్మలమైన స్ఫటికంవంటి ఆకృతి కలవాడు, సర్వవిద్యలకు ఆధారభూతమైనవాడూ అయిన హయగ్రీవోపాసన మానవజీవితాన్ని జ్ఞానమయం చేస్తుంది.

**జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం।**
**ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ మపాస్మహే॥**

*ఓం హయగ్రీవాయ నమః*



## 108 దివ్యదేశాలు

# తిరువణ్‌పురుడోత్తమన్

## (పురుషోత్తముడు)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

108 శ్రీవైష్ణవదివ్యదేశాలలో తిరునాంగూర్ అనే ప్రసిద్ధ చెందినటువంటి దివ్యదేశాలలో ఒకటి **'తిరువణ్‌పురుడోత్తమన్'** దివ్యదేశము. ఈ దివ్యదేశం శీర్‌కాళి నుండి 8 కి.మీ.ల దూరంలో, అద్భుతమైన ప్రాకారంతో, పెద్దగోడతో, అర్ధ మండపంతో, మహామండపంతో ప్రకృత రామణీయకతతో వెలసిల్లి ఉన్నది. శ్రీదేవి, భూదేవి సమేతుడైనటువంటి మూలమూర్తి 'పురుషోత్తముడు' అనే పేరుతో, తూర్పుదిక్కున నిలుచున్న భంగిమతో, భక్తులని అనుగ్రహిస్తూ ఉన్నాడు. ఉత్సవమూర్తి కూడా 'శ్రీదేవి, భూదేవి సమేతుడై పురుషోత్తముడు' అనే పేరుతోనే కీర్తింపబడుచున్నాడు. అమ్మవారికి ప్రత్యేకమైనటువంటి దేవాలయం, **'పురుషోత్తమ నాయకీ'** అను పేరుతో ఆ మహాలక్ష్మి విలసిల్లి ఉన్నది. స్థలవృక్షం-**'వేపచెట్టు'**. తీర్థం-**'తిరుప్పాఱ్కడల్'**. **'సంజీవి'** విగ్రహవిమానం, అలాగే అరిమేయ విణ్ణగరమ్ అనే దివ్యదేశానికి సమీపంలో ఈ తిరువణ్‌పురుడోత్తమన్ దివ్యదేశము శోభిల్లుచున్నది.

### స్థలపురాణం

కరుణాసముద్రుడైనటువంటి భగవంతుడు భక్తుల యొక్క దుఃఖాలని పోగొట్టడమే తన లక్ష్యంగా పెట్టుకుని అద్భుతమైనటువంటి దివ్యనామముతో పురుషోత్తముడు అనే పేరుతో అందరిచేత పిలువబడుచున్నాడు. ఈ క్షేత్రానికి ఒక చక్కటి మాహాత్మ్యం ఉన్నది. వ్యాఘ్రపాదుడు అనేటటువంటి మహర్షి మంచిభక్తుడు. అతడు ప్రతిరోజూ భగవంతుణ్ణి సుగంధ భరిత పుష్పాలతో పూజించాలని ఆశపడి, వివిధ వృక్షాలనుండి పుష్పాలని సేకరించాలి అనేటటువంటి సంకల్పముతో తనకు పులి వలె కాళ్లు ఉండాలని భగవంతుడి గూర్చి తపస్సు చేసి, ఆ తపస్సు ఫలితంగా పులివంటి కాళ్లను పొంది 'వ్యాఘ్ర పాదుడు' అనే పేరుతో భగవత్‌కైంకర్యం చేస్తూ ఉన్నాడు.

ఒకానొక సమయంలో తన పుత్రుడు అయినటువంటి ఉపమన్యుని పిలుచుకొని ఒక అద్భుతమైనటువంటి పూలతోటకి వెళ్లి ఈ స్వామికి ఈ రోజు ఇచటి నుండి పుష్పాలని కోసి సమర్పించాలి అని అనుకుని, తన పుత్రుణ్ణి ఈ స్వామిసన్నిధిలో వదిలిపెట్టి ఆ పుష్పాలను కోయడానికై, ఆ పుష్పతోటలోకి వెళ్లాడు. కానీ, భక్తితో పుష్పాలను కోస్తూ, తన పుత్రుని మరచిపోయాడు. అప్పుడు స్వామి సన్నిధిలో వదిలిపెట్టినటువంటి ఆ ఉపమన్యు, ఆకలితో ఏడవడం ప్రారంభించాడు. వాత్సల్య దయాపూర్ణురాలైన పురుషోత్తమ నాయకీ తన యొక్క స్వామిని 'అయ్యో! ఆ చిన్ని శిశువు ఆకలితో ఏడుస్తున్నాడు. ఈ ఆకలిని పోగొట్టడానికి మీరు ఏమైనా ఉపాయం చేయండి' అని అడిగిన సందర్భంలో, స్వామి వెంటనే పాలకడలినే ఇక్కడికి తీసుకుని వచ్చి, ఆ పాలను ఉపమన్యువుకు తాగించాడు. తాగిన మరుక్షణమే ఏడుపును నిలిపివేశాడు. అట్టి దయాసాగరుడు ఈ స్వామి.





ఇలా కాలం గడిచింది. ఉపమన్యువు అబోధ దౌమ్యుడు అనే ఆచార్యుని దగ్గర విద్యను ప్రారంభించాడు. ఆ ఆచార్యుడు ఈ ఉపమన్యువు యొక్క రూపాన్ని చూచి చకితుడయ్యాడు. దీనికి కారణం ప్రతిరోజూ కూడా ఇతడు భిక్ష ఎత్తి, ఆ అన్నాన్ని తినడం చేత, ఇతని ముఖవర్చస్సు ఇలా ఉన్నది అని అనుకుని, ఇక నీవు భిక్షను ఎత్తకూడదు అని కట్టడి చేశాడు. అలా చేసినా కూడా ఉపమన్యువు యొక్క ముఖంలో తేజస్సు తగ్గలేదు. అదే సమయంలో ఆ ఉపమన్యువు ఆకలికి తట్టుకోలేక, గురువు మాటను మీరలేక, ఆచార్యుని యొక్క పశువును మేపు సందర్భములో ఆ పాలను త్రాగడం ప్రారంభించాడు. ఇలా తన యొక్క ఆకలిని తీర్చుకున్నాడు.

ఈ విషయాన్ని తెలుసుకున్నటువంటి ఆచార్యుడు అబోధ దౌమ్యుడు ఇకమీదట నీవు ఇలా చేయకూడదు అని ఆదేశించినప్పటికీ, ఇతని ముఖతేజస్సు ఏమీ తగ్గలేదు. ఇతడు ఈ పాలను తాగినందు వల్ల ఈ తేజస్సు తగ్గలేదని అనుకున్నాడు. ఆచార్యుని యొక్క ఆజ్ఞను ఉల్లంఘించకుండా ఉపమన్యువు అలానే ఉండిపోయాడు. కానీ, అతనికి ఆకలి అధికమౌతున్నది. జిల్లేడుఆకుల రసాన్ని తాగి ఉపమన్యువు తన కళ్ళను పోగొట్టుకొని ఒక పాడుబడిన బావిలో పడిపోయాడు. ఒక రోజంతా చూసినా ఉపమన్యువు కనిపించక దౌమ్యుడు అతనిని అన్వేషిస్తూ వెళ్లిన సందర్భంలో పాడుబడిన బావిలో అతడు కళ్లు తెలియక పడిపోయాడని తెలుసుకొని ఆ సమయంలో కూడా ఉపమన్యువు యొక్క తేజస్సు, వర్చస్సు అలాగే ఉండడం చూచి అత్యాశ్చర్యపడి, దౌమ్యుడు 'ఆహా ఇది పురుషోత్తమ స్వామి యొక్క పరిపూర్ణమైనటువంటి అనుగ్రహం కదా! పాల కడలిలో ఉన్నటువంటి ఆ పాలను ఈ బాలుడు తాగినందువలన ఈ ఉపమన్యువు యొక్క తేజస్సు, నిశ్చలంగా స్థిరంగా ఉన్నది' అని భావించి, ఆ ఉపమన్యువుని కాపాడి సకలవిద్యనంతా కూడా అతనికి ఉపదేశించాడని స్థలపురాణం చెబుతున్నది.

ఇచ్చట స్వామివారు పురుషోత్తముడు, అమ్మవారు పురుషోత్తమ నాయకీ పంకజవల్లీ, తిరుప్పాఱ్కడల్ తీర్థం, ఉపమన్యువుకి, వ్యాఘ్ర పాదమహర్షికి ప్రత్యక్షం, మంగళాశాసనం చేసినవారు తిరుమంగై ఆళ్వారులు, పాంచరాత్ర ఆగమము, విశేషం– తిరునాంగూర్ అనే దివ్యదేశంలో, ఉండేటటువంటి ఆరు దివ్యదేశాలలో ఇది నాల్గవ దివ్యదేశము. ఎవరైతే పురుషోత్తమనాయకీ సమేత పురుషోత్తముని దర్శించుకుంటారో వారందరికీ కూడా పరిపూర్ణమైనటువంటి భగవద నుగ్రహం కలుగుతుంది. అలాగే వారి యొక్క జీవితమంతా సుఖ మయం అవుతుంది.

శుద్ధఃశ్రీపురుషోత్తమాఖ్యనగరే దేవోఽపి తాదృగ్విధః
తద్వల్లీమహిషీ సుధాకమలినీ తత్రోపమన్యోః పురా।
ప్రత్యక్షో విమలం విమానమపి తత్ పంచగ్రహాఖ్యం పరమ్
ప్రాతర్భాస్కర సమ్ముఖః సురగణైః ఆసీనరూపో వసన్॥

**విశేషాంశములు**

**దివ్యదేశమున్నచోటు :**
శీర్కాళికి 8కి.మీ.దూరంలో ఉంది.

| | |
|---|---|
| **స్వామిపేరు** | : పురుషోత్తముడు |
| **అమ్మవారి పేరు** | : పురుషోత్తమనాయకి పంకజవల్లీ |
| **స్థలవృక్షం** | : వేపచెట్టు |
| **తీర్థం** | : తిరుప్పాఱ్కడల్ |
| **ప్రత్యక్షం** | : వ్యాఘ్రపాదమహర్షికి, ఉపమన్యువుకు |
| **విమానం** | : సంజీవి విమానం |
| **ఆగమం** | : పాంచరాత్రాగమం |

**మంగళాశాసనం చేసిన ఆళ్వారు :**
తిరుమంగై ఆళ్వారు (10)



2024, ఏప్రిల్ 16 నుండి 25 వరకు జరిగిన
ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి
బ్రహ్మోత్సవ దృశ్యమాలిక

# తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సేవాగ్రగణ్యుడు-శ్రీఆంజనేయస్వామి

జూన్ 1వ తేదీ హనుమజ్జయంతి సందర్భంగా...

- డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, 94919 46070

"దేవకార్యముల దిక్కువరేణ్యుడు భావింపగల తపః ఫల పుణ్యుడు,
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు సావధానుడు సర్వ శరణ్యుడు"

అని అన్నమయ్య శ్రీఆంజనేయస్వామి వారిని గురించి కీర్తిస్తూ 'శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు' అని కీర్తించాడు. అలనాడు శ్రీరాముడి సేవలో తరించిన ఆ స్వామి ఈనాడు కలియుగ వైకుంఠంగా విరాజిల్లుతూ ఉన్న తిరుమల క్షేత్రంలో వివిధరూపాలలో కొలువుదీరి పూజలందుకుంటూ దర్శనమిస్తాడు.



## శ్రీఆజ్ఞాపాలక ఆంజనేయస్వామి (రాములవారి మేడ)

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలోని శ్రీరాములవారి మేడలో ఉన్న ఉత్సవమూర్తి 'శ్రీఆజ్ఞాపాలక ఆంజనేయస్వామి'. ఎవరైనా పెద్దలతో సంభాషించే సమయంలో మన నోటి తుంపరలు, శ్వాస వారి మీద ప్రసరించకుండా ఉండేందుకు మన నోటికి చేయి అడ్డు పెట్టుకుని సంభాషించడం సంప్రదాయం. అదే రీతిలో శ్రీరామచంద్రమూర్తి వారి ఆజ్ఞ వింటూ చేతిని నోటికి అడ్డం పెట్టుకున్న రూపంలో ఈ స్వామివారు ఉన్నారు. అంటే శ్రీ రామచంద్రమూర్తి ఆజ్ఞను శిరసా వహించే రూపం ఈ స్వామివారిది. తిరుమలలో శ్రీరామనవమి, శ్రీరామపట్టాభిషేకంలతో పాటు శ్రీరామ చంద్రమూర్తికి జరిగే పూజలు, ఉత్సవాల సమయంలో వారి ఎదురుగా నిలుచుని వారి ముందువైపు నడుస్తూ స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ స్వామి వారిని దర్శించడం వల్ల భక్తులలో వినయ విధేయతలు వృద్ధి చెందుతాయని చెబుతారు.

## శ్రీబేడీ ఆంజనేయస్వామి

తిరుమల క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి ఎదురుగా ఉన్న సన్నిధివీథిలో, స్వామి వారి ఆలయానికి అభిముఖంగా ఉన్న ఆలయమే- 'శ్రీబేడీ ఆంజనేయస్వామి' వారి ఆలయం. అంజనాద్రిపై ఆంజనేయుడు అల్లరిగా తిరుగుతూ అందరినీ భయాందోళనలకు గురిచేస్తూ ఉండటంతో ఆంజనేయస్వామి తల్లి అయిన అంజనాదేవి కాళ్ళకు, చేతులకు బేడీలు తగిలించి ఎక్కడికీ కదలకుండా శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఎదురుగా నిలబెట్టినట్లు కథనం. ఈ స్వామివారి కాళ్ళకు చేతులకు బేడీలు తగిలించినట్లుగా ఉండటం వల్ల స్వామివారికి శ్రీబేడీ ఆంజనేయస్వామి అనే పేరు ఏర్పడినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది. గర్భాలయంలో సుమారు ఆరు అడుగుల ఎత్తు ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారు కొలువుదీరి పూజలందుకొంటూ దర్శనమిస్తారు.





## శ్రీకోనేటిగట్టు ఆంజనేయస్వామి

తిరుమలలో స్వామి వారి పుష్కరిణికి ఈశాన్యమూలలో అంటే శ్రీవరాహస్వామి వారి ఆలయానికి ఎదురుగా 'శ్రీకోనేటిగట్టు ఆంజనేయ స్వామి' ఆలయం ఉంది. కోనేటిగట్టు మీద ఉండడం వల్ల ఈ స్వామికి ఆ పేరు వచ్చినట్లు తెలుస్తోంది. పశ్చిమాభిముఖంగా ఉన్న ఈ ఆలయంలో నమస్కార భంగిమలో స్వామివారు దర్శనమిస్తారు. 16వ శతాబ్దంలో శ్రీఆంజనేయస్వామివారిని వ్యాసరాయలు ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

## శ్రీతలయేరుగుండు ఆంజనేయస్వామి

అలిపిరినుంచి తిరుమలకు వెళ్ళే కాలినడక మార్గంలో పాదాల మండపం దాటిన అనంతరం దర్శనమిచ్చే ప్రాంతంలోని ఒక పెద్ద గుండులాంటి రాయికి 'తలయేరుగుండు' అని పేరు. ఈ గుండు పైభాగంలో శ్రీ ఆంజనేయస్వామి వారు నమస్కార భంగిమలో దర్శనం ఇస్తారు. క్రింది భాగంలో గుండు పైన మోకాళ్ళు, తల తాకించడం వల్ల ఏర్పడిన గుంతలు ఉన్నాయి. నడకమార్గంలో భక్తులు కొండపైకి వెళ్ళేటప్పుడు మరియు స్వామివారిని దర్శించుకుని కొండ దిగివచ్చే భక్తులు ఈ ఆంజనేయస్వామి వారికి నమస్కరించి తమ తలను, మోకాళ్ళను ఈ గుండుకు ఆనిస్తారు. అందువల్ల నడవడం వల్ల కాళ్ళనొప్పులు రావనీ, శ్రమ ఉండదని భక్తుల నమ్మకం.




ఈ విధంగా తిరుమల క్షేత్రంలో వైభవంగా విరాజిల్లుతూ ఉన్నాడు శ్రీఆంజనేయస్వామి.

*"పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు*
*పరగి నానా విద్యల బలవంతుడు॥"*



తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి
పుష్పయాగమహోత్సవం
2024, జూన్ 14

# నందనందనుడు కొలువైన 'నందలూరు'

- శ్రీ ఇలపావులూరి వేంకటేశ్వర్లు



శ్రీమహావిష్ణువు భూలోకంలో అనేకానేకరూపాలలో, ఎన్నో నామాలతో కోవెలలో కొలువు తీరి,కొలిచినవారికి కొంగుబంగారంగా పిలవబడుతున్నాడు. అలాంటి వాటిల్లో ఒకటి ఆంధ్ర ప్రదేశ్ అన్నమయ్యజిల్లాలో శ్రీహరి **'సౌమ్యనాథస్వామి'**గా వెలసిన క్షేత్రం **"నందలూరు".** నందనందనుడు వెలసిన కారణంగా ఈ గ్రామానికి నందలూరు అన్న పేరు వచ్చిందని చెబుతారు. సుందరశిల్పాలతో కళకళలాడే ఆలయం శతాబ్దాల చరిత్రకు సాక్ష్యం.

**పౌరాణికగాథ-**లోకకంటకుడైన హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత కూడా నరసింహుని ఉగ్రత్వం తగ్గలేదు. అరణ్యంలో చెంచువనిత రూపంలో లక్ష్మీదేవి సాహచర్యంతో స్వామి సౌమ్యుడైనాడు. ఆ రూపానికే **"సౌమ్యనాథుడు"** అనిపేరు.

తొలుత నిరంతరం నారాయణనామాన్ని జపించే నారదమహర్షి ఇక్కడ ఎన్నో పురాణాలలో పేర్కొన్న *బాహుదా (చెయ్యేరు)* నదీతీరంలో ప్రతిష్ఠ చేశారని స్థానికంగా ఒక కథనం ప్రచారంలో ఉన్నది. నారదప్రతిష్ఠిత శ్రీసౌమ్యనాథస్వామికి దేవతలే ఆలయం నిర్మించారని, కాలగతిలో అది శిథిలంకాగా దాని మీదే ప్రస్తుత ఆలయాన్ని నిర్మించారని అంటారు. ఆ కథనం నిజమా అన్నట్లుగా ఆలయస్తంభాలకు మిగిలిన ఆలయాలలో ఉన్నట్లు పైన సింహపు తలలు ఉండకుండా క్రింద ఉంటాయి.



**ఆలయవిశేషాలు-** పదిఎకరాల విశాలస్థలంలో చుట్టూ ప్రహరీగోడ, నాలుగువైపులా గోపురాలతో దుర్భేద్యమైన కోటలా కనపడుతుంది. పదకొండవ శతాబ్దంలో కులోత్తుంగ చోళరాజు ఇక్కడ ఆలయనిర్మాణాన్ని ఆరంభించారు. తదనంతరం ఈ ప్రాంతాన్ని పాలించిన పాండ్య, కాకతీయ, విజయ నగరరాజుల కాలంలో కూడా నిర్మాణప్రక్రియ కొనసాగింది. పదిహేడవ శతాబ్దంలో పూర్తి అయినట్లుగా శాసనాల ఆధారంగా తెలుస్తోంది. తూర్పుగోపురం గుండా ప్రాంగణంలోనికి ప్రవేశిస్తే ఈశాన్యంలో పుష్కరిణి, రాతిస్తంభం, ధ్వజస్తంభం, గరుడాళ్వార్ సన్నిధి, పక్కనే ఉన్న మండపంలో ఆంజనేయస్వామి సన్నిధి ఉంటాయి. పూర్తిగా ఎర్రరాతితో నిర్మించబడిన ఈ ఆలయాన్ని తిరువణ్ణామలైలో ఉన్న శ్రీఅరుణాచలేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరూపంగా పేర్కొంటారు.

మొత్తం నూటఎనిమిది స్తంభాలపైన ప్రధాన ఆలయం నిర్మించారు. స్తంభాలపైన పురాణఘట్టాలను, నాటి ప్రజల జీవనశైలిని, చిత్రవిచిత్రమైన జంతువులను, ఆంజనేయ, గరుడ రూపాలను సుందరంగా జీవం ఉట్టిపడేలా మలిచారు. గర్భాలయ వెలుపలి గోడలలో శ్రీగణేశ, శ్రీఆదిశేషవిగ్రహాలను నిలిపారు. ముఖమండపం నుండి కొద్దిగా ఎత్తులో ఉన్న గర్భాలయానికి సోపానమార్గం ఉన్నది. ఇరువైపులా జయ విజయులు ఉంటారు. మండపద్వారం వద్ద ఉండగానే శ్రీసౌమ్యనాథస్వామి దివ్యరూపం నయనమనోహరంగా దర్శనమిస్తుంది.









గర్భాలయాలలో విద్యుద్దీపాలుండవు. అయినా కళకళ లాడుతూ కనపడతారు స్వామి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఉండే సూర్యకాంతితో ప్రకాశిస్తూ ఉంటారు మూల విరాట్టు. ఇది ఒక ప్రత్యేకతగా చెప్పుకోవాలి.

కలియుగవైకుంఠములో కొలువు తీరిన వేంకటేశ్వరుని ప్రతిరూపంగా ఉండే ఈ ఏడు అడుగుల సుందరస్వామిలో కన పడే తేడా ఒక్కటే. అక్కడ వరదహస్తం కాగా ఇక్కడ అభయహస్తం. రెండూ భక్తులు భగవంతుని నుండి కోరుకునేవే కదా!

ఆలయపైకప్పుకు ఒకపెద్దచేప చెక్కబడి కనపడుతుంది. 'కలియుగాంతానికి వచ్చే జలప్రళయంలో ఇది జీవం పోసుకొని ఈదుకుంటూ వెళుతుంది' అన్నది స్థానికుల నమ్మకం. ఆలయంలో తమిళంలో ఎక్కువగా, తెలుగులో కొద్దిగా శాసనాలు చెక్కబడి ఉన్నాయి. వివిధ రాజవంశాల రాజులు స్వామికి సమ ర్పించుకొన్న కైంకర్యాల వివరాలు వీటిల్లో రాయబడినాయి. కాకతీయప్రతాపరుద్రుడు గాలిగోపురం నిర్మించి, వందఎకరాల మాన్యం ఆలయనిర్వహణకు ఇచ్చినట్లుగాను, సమీపంలోని పొత్తపిని పాలించిన తిరువేంగళనాథుని సతీమణి చెన్నమరాణి శ్రీసౌమ్యనాథునికి బంగారుకిరీటం, శంఖుచక్రాలు, మరెన్నో స్వర్ణాభరణాలు సమర్పించుకొన్నట్లుగా శాసనాల ఆధారంగా తెలుస్తోంది.

**అన్నమాచార్యుడు-** వాగ్గేయకారుడు అన్నమయ్య కొంతకాలం నందలూరులో సౌమ్యనాథుని సేవలో గడిపారని, తన కీర్తనలతో స్వామిని ప్రస్తుతించారని శాసనాలలో పేర్కొనబడినది.

**తొమ్మిది ప్రదక్షిణాలు-** దృఢమైననమ్మకంతో, బలమైన కోరికతో "ఓం శ్రీసౌమ్యనాథాయ నమః" అంటూ గర్భాలయం చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేసి మొక్కుకొంటే, మనోభీష్టాలు నెర వేరుతాయి అన్న ఒక విశ్వాసం తరతరాల నుండి ఇక్కడ కొన సాగుతూ వస్తోంది. కోరిక నెరవేరిన వారంరోజులలో వచ్చి నూట ఎనిమిది ప్రదక్షిణలు చెయ్యాలి అనికూడా అంటారు.

**బ్రహ్మోత్సవాలు-** మానసపుత్రుడు నారదుని సహాయంతో విధాత బ్రహ్మ ఆరంభించినందున బ్రహ్మోత్సవాలని పిలుస్తారు. ప్రతి సంవత్సరం జూలైనెలలో శ్రవణానక్షత్రంనాడు ఆరంభించి తొమ్మిదిరోజుల పాటు ఘనంగా జరుపుతారు. ఆలయం వెలుపల ఉన్న మరో కోనేరులో తెప్పోత్సవం జరుగుతుంది.

**పూజలు-** ప్రతినిత్యం ఉదయం 6గంటలనుండి 12వరకు, తిరిగి సాయంత్రం 4నుండి రాత్రి 8వరకు తెరిచి ఉండే ఆలయంలో ఎన్నోవిధాల నిత్యపూజలు నియమంగా చేస్తారు. అన్ని పర్వదినాలలో, అష్టమి, నవమి తిథులలో, ధనుర్మాసంలో విశేషపూజలు భక్తుల కోరిక మేరకు జరుపుతారు.

*'ఓం శ్రీసౌమ్యనాథాయ నమః'*

మన మహర్షులు

# అగస్త్య మహర్షి

- శ్రీ ఎం.వి. అవధాని

చెట్లు కాసే తీయని పళ్లలా, నదులు మోసుకొచ్చే చల్లని నీళ్లలా, సజ్జనుల సంపదలన్నీ పరోపకారం కోసమే. జనావాసాలకు దూరంగా ఆశ్రమాలలో నిరాడంబరంగా జీవిస్తూ తపస్సు చేసుకొనే మహర్షుల తపోబలం కూడా లోకోపకారం కోసమే. 'అగస్త్యుడు' ఒక గొప్ప మహర్షి. ఈయన ఇప్పటికీ కూడా జీవించి ఉన్నాడనే నమ్ముతారు.

## వింధ్యుని గర్వమణచుట

అగస్త్యుని ఆశ్రమము వింధ్యపర్వత సమీపమున కలదు. మేరుపర్వతం అన్నింటికన్నా ఎత్తైన పర్వతం. దాని ఎత్తును చూసి భరించలేక ఈర్ష్యతో వింధ్యపర్వతం కూడా దానికంటే ఎత్తుగా పెరిగి సూర్యగమనాన్ని కూడా అడ్డగించ సాగింది. దీంతో రాత్రింబవళ్ళు సరిగ్గాలేక, మహర్షుల వేద విధులకు ఆటంకం కలగసాగింది. అప్పుడు దేవతలందరూ కలిసి అగస్త్యమునికి తమ సమస్యను విన్నవించి, సమస్య తీరుటకు మార్గం చూపమని ప్రార్థిస్తారు. వారి ప్రార్థనను మన్నించిన అగస్త్యుడు తన భార్యతో కలిసి ఆ పర్వతం వద్దకు వచ్చి, తాము దక్షిణదిశగా వెళుతున్నామనీ, అంత పెద్ద పర్వతాన్ని ఎక్కి దిగలేమనీ ఎత్తుని తగ్గించుకుని తమకు దారివ్వమని కోరుతారు. మహర్షులంటే భక్తిప్రపత్తులు గల వింధ్యుడు తక్షణమే తన ఎత్తుని తగ్గించుకొని వారు వెళ్ళడానికి వీలుగా దారి ఇస్తాడు. తర్వాత అగస్త్యుడు తాము మరలా తిరిగి ఉత్తరదిశగా తిరిగి వస్తామని అప్పటిదాకా అలాగే ఉండమని చెబుతాడు. కానీ మళ్ళీ తిరిగి రాడు. అప్పటి నుంచీ ఇప్పటిదాకా ఆ పర్వతం అలాగే ఉంది.

ఇంకొక కథనం- శివపార్వతుల కల్యాణానికి ఋషు లందరు ఉత్తరాన ఉన్న హిమాలయాలకు వస్తారు. అప్పుడు వారి శక్తికి ఉత్తరాన భూమి క్రుంగిపోవుచుండడం చూసి శివుడు అందరి శక్తికి ఇంచుమించు సమానమైన అగస్త్యభగవానులను దక్షిణదిక్కున ఉండమని ఆదేశమిచ్చారు. అప్పుడు అగస్త్యుల వారు కల్యాణం చూడలేకపోతున్నందుకు చింతించుచుండగా, వారికి అక్కడనుండి కూడ ప్రత్యక్షంగా చూసే వరాన్ని ప్రసాది స్తాడు. అప్పటి నుండి అగస్త్యులవారు దక్షిణాన ఉన్నారు. వారు మొట్టమొదటి నుండి హిమాలయ పర్వతప్రాంతాల్లో ఉన్నారన్న గుర్తుగా, వారి పేరు మీద ఒక ఊరు కూడా ఉత్తరాఖండ్ నుండి కేదారనాథ్ వెళ్ళే దారిలో ఉంది.

## అగస్త్యముని వివాహం

మనుస్మృతి ననుసరించి అందరు హిందువుల లాగే అగస్త్యుడు కూడా వివాహం చేసుకుని సంతానాన్ని పొందాల్సి వస్తుంది. అప్పుడు ఆయన బాగా ఆలోచించిన పిదప ఒక నిర్ణ యానికి వస్తాడు. ఆయన యోగశక్తిని ఉపయోగించి గుణగణా ల్లోనూ, వ్యక్తిత్వంలోనూ అన్నిరకాలుగా ఒక విరాగికి భార్యగా ఉండేందుకు అవసరమైన లక్షణాలు కలిగిన ఒక ఆడశిశువును సృష్టిస్తాడు. ఇదే సమయంలో ఘనకీర్తి కలిగిన విదర్భరాజు సంతానం కోసం జపతపాదులు చేస్తూ ఉంటాడు. అగస్త్యుడు ఆయన సృష్టించిన శిశువును ఆ రాజు భార్యగర్భంలోకి ప్రవేశ

### వైకుంఠపాళి
### :: 101 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వై | శా | 2 ఖ | మా | 3 స | ము | | | 4 భృ |
| వ | | గ | | త్య | | 5 సా | | గు |
| 6 స్వ | ర్ణ | ము | ఖి | | 7 హ | వి | ర్భు | వు |
| తు | | | | 8 జ | | త్రి | | |
| డు | | | 9 జ | యం | తి | | 10 కాం | 11 చి |
| | | 12 అ | | తి | | 13 ఊ | | త్ర |
| 14 అం | జ | నా | ద్రి | | 15 ధా | రు | ణి | |
| | | వు | | 16 వే | | డు | | 17 క |
| 18 ఊ | ర్జ | | 19 అ | ప | ర్ణ | | 20 క | లి |

పెడతాడు. ఆ రాజదంపతులకు ఆడబిడ్డ పుడుతుంది. ఆమెకు **లోపాముద్ర** అని నామకరణం చేస్తారు. ఆమెకు యుక్తవయస్సు రాగానే అగస్త్యుడు తనతో వివాహం జరిపించాల్సిందిగా రాజును కోరతాడు. మొదటగా ఒక విరాగి నుంచి ఈ ప్రతిపాదన విన్న రాజు విచారిస్తాడు. కానీ అత్యంత ప్రతిభాశీలియైన తన పుత్రిక పట్టుబట్టడంతో వారి వివాహానికి అంగీకరిస్తాడు. దాంతో వారి వివాహం జరుగుతుంది.

## వాతాపి, ఇల్వలుల కథ

ఒకానొకప్పుడు వాతాపి మరియు ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వీరు అడవిలో నివసిస్తూ దారిన పోయే బాటసారులను ఒక విచిత్రమైన రీతిలో చంపి తినేవారు. వాతాపికి సులభంగా తను కోరుకున్న జీవిరూపంలోకి మారే విద్య తెలుసు. ఇల్వలుడికి చనిపోయినవారిని బ్రతికించే సంజీవనీవిద్య తెలుసు. ఎవరైనా బాటసారి వచ్చినపుడు వాతాపి ఒక మేక రూపంలోకి మారిపోయేవాడు. ఇల్వలుడు



ఒక బ్రహ్మచారి వేషం వేసుకుని అతిథులను భోజనానికి ఆహ్వానించేవాడు. మేక రూపంలో ఉన్న వాతాపిని చంపి వారికి మేక మాంసాన్ని పెట్టేవాడు. మేక మాంసాన్ని ఆరగించగానే, ఇల్వలుడు వాతాపిని బ్రతికించడానికి సంజీవనీమంత్రం పఠించేవాడు. అప్పుడు వాతాపి ఆ బాటసారిపొట్టను ఛేదించుకొని బయటకు వచ్చేవాడు.

ఒకసారి అగస్త్యుడు ఆ అరణ్యం గుండా ప్రయాణిస్తుండగా, ఈ రాక్షసులు గమనించి ఆయన్ను విందుకు ఆహ్వానించి, మేక మాంసం వడ్డించాడు ఇల్వలుడు. ఆయన భోంచేసిన తరువాత ఇల్వలుడు యథావిధిగా వాతాపిని బయటకు రప్పించడానికి సంజీవనీమంత్రం జపిస్తాడు. కానీ వాతాపి మాత్రం ఎంతకీ తిరిగి రాడు. ఎందుకంటే వీరి విషయం ముందుగా తెలుసుకున్న అగస్త్యుడు 'జీర్ణం జీర్ణం, వాతాపి జీర్ణం' అనగానే వాతాపి జీర్ణమైపోయాడని ఇల్వలుడికి తెలియజేస్తాడు.

కాలకేయగణాలు అనే రాక్షసులు పగలంతా కనబడకుండా సముద్రంలో దాక్కొని, రాత్రి వేళల్లో తాపసుల మీద పడి చంపేస్తూ ఉండేవాళ్లు. దేవతలు అగస్త్యుణ్ణి ప్రార్థిస్తే, ఆయన సముద్రాన్నంతా ఆపోశన పట్టి, చుక్క మిగలకుండా తాగేశాడు. కాలకేయగణాలకు దాక్కొనేందుకు చోటు మిగలలేదు. దాంతో దేవతలు వాళ్లను సంహరించగలిగారని పురాణగాథ.

వనవాసం చేస్తున్న శ్రీరాముడు అగస్త్యాశ్రమం దర్శించి మహర్షిని సేవించాడు. అగస్త్యుడు రాముడికి వైష్ణవధనుస్సు, అక్షయతూణీరం, దివ్యఖడ్గాలు బహూకరించి, సమీపంలో ఉన్న పంచవటిలో కుటీరం కట్టుకొని నివసించమని సూచించాడు. అనంతరం, రామరావణ యుద్ధంలో అగస్త్యుడు రణరంగానికి వెళ్లి రాముడికి శుభదాయకమైన **'ఆదిత్య హృదయా'**న్ని బోధించి ఉత్సాహపరిచాడు.

ఇంద్రపదవి పొంది కళ్లు నెత్తికెక్కి, సప్తర్షులను పల్లకీ బోయీలుగా నియమించిన నహుషుణ్ణి క్షణకాలంలో కొండచిలువగా మార్చి కళ్లు తెరిపించింది అగస్త్యుడే.

అటువంటి అగస్త్యుడు మహర్షులలో మహోన్నతుడుగా కీర్తి పొందాడు.

గీతోపదేశం

# 'సమదర్శనం'

– ఆచార్య ఎస్.మురళీధర రావు

**సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥**

ధ్యానయోగపరుడు సర్వభూతములయందు ఆత్మను, ఆత్మయందు సర్వభూతములను సమానముగా దర్శించును.

ధ్యానయోగపరులు అందరూ, అంతా ఆత్మస్వరూపమే అన్నభావన కల్గి ఉందురు. ఈ భావనే 'ఏకాత్మభావన'. చరాచరప్రాణులయందు అఖండాత్మచైతన్యమును ధ్యాని మాత్రమే దర్శించగలడు.

ధ్యాని తను సంకల్పించిన ప్రతీపనిని దైవభావనతో చేయడం వలన అది భగవత్సేవే అవుతుంది. అట్లే, తను సంభాషించిన ప్రతీమాట మృదుభావనతో మాట్లాడడం వలన అది భగవత్ సంకీర్తనమే అవుతుంది.ధ్యాని తను చూసినదంతా స్వాత్మభావనతో దర్శించడం వలన అది భగవత్ దర్శనమే అవుతుంది.

సృష్టికర్త తన సృజనలో – ప్రతీది పరమాత్మభావనతో మనం చూడాలనీ, ప్రతీ జడచేతనాలలో తానై యుండి దైవత్వాన్ని దర్శించుకోమన్నాడు. ధ్యానిలా జీవించమన్నాడు.

మొక్క, చెట్టు, వనం, అడవి, తోట మొదలగు వాటి పేర్లు వేరైనా వీటి బీజమూలం ఒక్కటే. అది అర్థం చేసుకోమనే



వీటి యందు కూడా పరమ'ఆత్మ'గా తానే ఉన్నానని భగవంతుడు తెలియజేస్తున్నాడు. అందుకు కొన్ని ఉదాహరణలు– **తులసిమొక్క** నిత్యపూజలందుకునే దేవతామూర్తికాగా, **రావిచెట్టు** విష్ణుమూర్తి స్వరూపముగా భాసిల్లగా, **వేపచెట్టు** మహాలక్ష్మి స్వరూపమైంది.

ఇక బావి, చెరువు, కాలువ, నది, సముద్రం అని వేర్వేరు పేర్లతో పిలవబడినను వీటన్నింటిలో ఏకమై ఉన్నది నీరు ఒక్కటే. వీటన్నింటి యందు ఉన్నది ఒకే చైతన్యం. అది అర్థంచేసుకునే గంగా, యమున మొదలగు నదులను దేవతా స్త్రీలుగా కొలవడం.

అలానే పాము సుబ్రహ్మణ్యస్వామిగా, కుక్క కాలభైరవుడుగా, గోమాత సకలదేవతలకు నిలయమైన దేవతామూర్తిగా, సూర్యాది గ్రహాలూ దైవస్వరూపాలుగా గుర్తించి ఆరాధిస్తున్నాం.

ఇక హిమాలయాది పర్వతశ్రేణులు, శేషాద్రి, భద్రాద్రి కొండలు, గుట్టలు మిట్టలు భగవంతుని నివాసాలుకాగా, పంచభూతాలూ పరమాత్మస్వరూపాలై 'అంతటా ఉన్నది పరమాత్మే' అన్న భావనను దృఢపరుస్తున్నాయి.

ఇలా సృష్టిలో అణువణువున భగవంతున్ని దర్శించడం, సమస్తమునూ పరమాత్మస్వరూపముగా భావించడమూ, పవిత్ర భావంతో పూజించడం– ఇదే భారతీయ దార్శనికత్వం; ఇదే మానవుని మాధవుడుగా మార్చగలిగే దార్శనికత్వం; ఇదే సర్వత్రా, సర్వదా, సర్వమూ అఖండాత్మ చైతన్యరూపమునకు దర్పణం.

సమస్త సృష్టికి ఆధారభూతుడు పరమాత్మయే! అణువణువూ వ్యాపించి ఉన్నది ఆ భగవంతుని తత్త్వమే. ప్రతీ జడచేతనలయందు ఉన్నది పరమాత్మ అంశయే!

దీనినే ధ్యానయోగమందు ధ్యాని దర్శిస్తాడు. ఏకాత్మ భావనతో సర్వాత్మను దర్శిస్తాడు.

# భారతీయ గణితం



– ఆచార్య వి.రమేష్ బాబు,
94912 71729

గణితశాస్త్రప్రాముఖ్యం లౌకికంగానీ, వైదికంగానీ, ధార్మికక్రియలు అన్నింటిలో విశేషస్థానం ఉంది.

అర్థశాస్త్రం, సంగీత నాటకాలు, పాకశాస్త్రం, వైద్య, వాస్తు నిర్మాణాది శాస్త్రాలకు కూడా గణితం తప్పనిసరి. ఛందస్సు, తర్కము, వ్యాకరణం, విభిన్న కళలు కూడా గణితాన్ని ఉపయోగించుకున్నాయి. గ్రహగతులు, గ్రహణాలు, గ్రహ కూటములు, చంద్రసంచారం దేనికైనా కూడా గణితమే శరణ్యం. ద్వీపాలు, సముద్రాలు, పర్వతాలు వీటికి సంబంధించిన సంఖ్యలు, ప్రమాణాలు ఏవి తెలుసుకోవాలన్నా, భూమి మీద భవనాల లెక్కలకైనా, అంతరిక్షం గురించి తెలుసుకోవాలనుకున్నా, జ్యోతిర్లోక, స్వర్గలోక, నరకలోక విషయం ఏదైనా ఇంకెన్నో విధాల ప్రమాణాన్ని నిర్ణయించడానికి గణితం లేకుండా ఏదీ తెలియదు. జీవుల ఆకృతులు– ఆయుష్షులు, వాని ధర్మాలు, పురోగతి, సమస్తవిషయాలు కూడా గణితంతోనే ముడిపడి ఉన్నాయి. అసలు ఇన్ని మాటలు ఎందుకు? త్రిలోకాల్లో సకల చరాచరాల్లో, ఏ వస్తువుకు గణితప్రమేయం లేకుండా అసలు అస్తిత్వమే లేదు. గురుపరంపరని మార్గదర్శకంగా సంఖ్యాజ్ఞాన సముద్రం అనబడే సముద్రం నుండి ఎన్నో రత్నాలు, పాషాణాల నుంచి బంగారం, ఏదో కొంచెం కొంచెం ఏరుకున్నట్లుగా గణితశాస్త్రానికి సంబంధించిన ఈ కొద్దిపాటి జ్ఞాన మంతా *'గణితసారసంగ్రహం'*గా, గణితశాస్త్రాన్ని విశ్వానికి తెలియజేసింది భారతీయ ప్రాచీన గణితం.

చరాచర జగత్తు, లోకాలోకాలు, సకలపదార్థాలు, రోదసి కాలము అన్నింటిలోనూ గణితానికి, గణితశాస్త్రంలో ఉండేటువంటి తాత్వికదృష్టిని కూడా మనం ఆలోకించ వచ్చు. అంటే కేవలం గణితం అంటే ఏ+బి అని ఎ$^2$–బి$^2$ అని కాకుండా గణితశాస్త్రాన్ని ఏ విషయానికైనా అన్వయించేటువంటి అనుసంధానం చేసేటటువంటి ప్రక్రియ, ప్రథమంగా సుమారు 11 శతాబ్దాల క్రితమే పురాతనమైనటువంటి అతిప్రాచీన భారతీయ **'గణితంలో గణితసార'** సంగ్రహ రచనల్లో ఉంది. గణితశాస్త్రాన్ని ప్రస్తుత ఆధునిక దృష్టితో విశ్లేషించటం అవసరమని గ్రహించి అటువంటి విశ్లేషణలు కూడా ప్రాచీన భారతీయగణితంలో వివరించబడ్డాయి.

ఉదాహరణకి కాలాన్ని తీసుకుందాం–కాలం అనంతం, దానికి ఆది, అంతం లేవు. అయినప్పటికీ కూడా గణితశాస్త్ర సహాయంతో మనం కాలాన్ని వినియోగంలోకి, అవగాహన పరిధిలోకి తెచ్చుకున్నాం. పరోక్షంగా కొలతలు కూడా వేస్తున్నాం, వాస్తవానికి చలనం, కాలం రెండూ కూడా సాపేక్షకాలు, పరస్పర పరస్పరాశ్రిత భావనలు. కాలం లేకపోతే చలనానికి అర్థం లేదు. చలనం లేకపోతే కాలానికి విలువలేదు. సృష్టిలో ఉండే పదార్థాలు అంతా కూడా చలనరహితమైపోతే కాలం స్తంభించి పోతుంది. ఈ రెండిటిమధ్య ఉండేటువంటి పారదర్శకత తెలియజేయడానికి అప్పటి గణితజ్ఞులు ప్రయత్నించారు.

తేనెతుట్టెలో తేనెటీగలు నిర్మించే షడ్భుజాకారపు మైనం గదుల్లో గరిష్ఠత, కనిష్ఠత సూత్రాల ప్రయోగం కానవస్తుంది. అంటే ఈ రోజున మనం చెప్పుకుంటున్న 'మాక్సిమా' 'మినిమ' సూత్రం దీనికి వర్తిస్తుంది. అసలు కొన్ని పక్షులుగాని, జంతువులు గాని ఒక ఋతువులో వేలకొలది మైళ్ళు దేశాంతర



నిండుకుండ తొణకదు

గమనం చేసి వలసపోయి ఋతువుమారగానే తిరిగి తమ తమ స్థావరాలకు ఎలా చేరుకోగలుగుతున్నాయి?

గణితశాస్త్రప్రాశస్త్యాన్ని మరికొంత విస్తరంగా తెలుసుకోవడానికి ప్రయత్నం చేద్దాం. పరమాణుగర్భంలోనే సంచలనాలు, విశ్వగురుత్వ పరిణామాలు, పరిమాణాలు, ఏవి కూడా మానవుడు చూడగలిగినవి కావు. అలాగే అనంతదూరంలో ఉండే నక్షత్రమండలాలు కూడా మనం చూడలేము. మరి వీటన్నిటి గురించి మనం ఎలా తెలుసుకోగలుగుతున్నాము, అంటే కేవలం గణితశాస్త్ర అవగాహన ద్వారా మాత్రమే, మరి అటువంటి గణితశాస్త్రానికి మూలం ఏది? అవధులు ఏమిటి? అవతరించింది ఎప్పుడు? అంటే సమాధానం కొంచెం కష్టమే, ఇంకా విశ్వసృష్టికర్మ, మహావిస్ఫోటన సిద్ధాంతం అనండి, లేదా సంకోచ, వ్యాకోచ సిద్ధాంతమే కానివ్వండి, గణితశాస్త్ర ఆధారంగానే నిర్వచింపబడుతున్నాయి. ఆదిలో ఏర్పడినటువంటి నక్షత్రమండలాలు, 'స్పిరల్స్' పరిభ్రమిస్తున్నాయి. అనాదిగా ఉంటున్నటువంటి ఈ ధర్మాలను విశ్లేషించడం మానవప్రతిభకు ఈనాటికీ కూడా సాధ్యపడలేదు.

ఖగోళాలు అనుసరిస్తున్న భౌతికన్యాయాలన్నీ కూడా గణితశాస్త్రపరిధిలోనివి మాత్రమే. సూర్యగోళం ఎప్పుడు ఆవిర్భవించింది? దానికి అసలు అన్నిగ్రహాలు ఎలా ఏర్పడ్డాయి? ఈ ఏర్పడిన గ్రహాలన్నీ, గోళాలుగా మరొక పెద్ద ద్రవ్యరాశి చుట్టూ, దీర్ఘవృత్తాకారంలో ఎందుకు పరిభ్రమిస్తున్నాయి? మరికొన్ని గోళాలు అనంతంలో నుంచి వచ్చి సౌరమండలంలోకి ప్రవేశించి పరావలయపదంలోకి వెళ్లి మళ్లీ అనంతంలోకి వెళ్లి ఎలా అదృశ్యం అవుతున్నాయి? అసలు భూగోళం ఎప్పుడు చల్లబడింది? ఎప్పుడు ప్రాణికోటికి నివాసయోగ్యంగా మారింది? ఎవరు చెబుతారు ఈ ప్రశ్నలన్నింటికీ జవాబులు? చూడనివి, మనం చూడలేనివి ఎన్నో విషయాలు గణితశాస్త్రం వల్లనే గమ్యములవుతున్నాయి. జీవ ఆవిర్భావానికి, గణాంకశాస్త్రనమూనాలతో సంభావ్యతా సూత్రాల సాయంతోనే వివరించగలుగుతున్నాం.

జడ ప్రకృతి అంటే రసాయనశాస్త్రసంబంధంగా కూడా గణితశాస్త్రమే వివరించగలగాలి. కార్బన్ అణువుల ఆక్తాహెడ్రన్ క్రమాకృతిలోనే సమకూడి వజ్రంగా స్ఫటికీకరణం

*రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః।*
*రాజా! సర్వస్య లోకస్య దేవానామివ వాసవః॥*
*(రామాయణమ్- అరణ్యకాండ)*

**శ్రీరాముడు సత్యధర్మస్వరూపుడు. నిరుపమాన పరాక్రమశాలి. దేవతలకు ఇంద్రుని వలె, సకల లోకాలకు మహారాజు.**

చెందుతున్నాయి. ఎంత ఆశ్చర్యం కదా- కార్బన్ అన్నది ఎక్కడపడితే అక్కడ చూడగలిగిన మనం, అది వజ్రంగా మారడానికి కారణం, దాని యొక్క ఒక క్రమాకృతి అని తెలుసుకుంటే ఆశ్చర్యపోక తప్పదు. సిలికా అణువుల స్ఫటిక రూపంలో పిరమిడ్ కొనలు గల, షడ్భుజి ఆకార పట్టకంగా ఏర్పడుతున్నాయి. ఇటువంటి స్ఫటికీకరణ ధర్మాలైనా, వక్ర ధర్మాలైనా గణితం లేకుండా మానవునికి జ్ఞానపరిధిలోకి రావు, అర్థము కావు. భూమి వయస్సు 470 కోట్ల సంవత్సరాలు కాగా, దానిపైన వృక్షాలు 250 కోట్ల సంవత్సరాల పూర్వమే సంభవించినాయి. వాటివల్లనే ఆహారం, ప్రాణవాయువు, సంచారం ఏర్పడి ప్రాణికోటి ఆవిర్భావానికి తెర తీయడం జరిగింది. తత్ ఫలితంగా 40 కోట్ల సంవత్సరాల పూర్వం, భూతలంపై తొలి జంతుజాలం ఆవిర్భవించింది. ఇక తొలి మానవుడు కాలు పెట్టి ఏ పది లక్షల సంవత్సరాలో మాత్రమే అయింది, మానవ నాగరికత వయస్సు కేవలం పదివేల సంవత్సరాలు, అందులో చరిత్రకు అందినటువంటి కాలం కేవలం 5000 సంవత్సరాలు. ఇక ఈ లెక్కన అనంతకాలంలో మానవుడు నిర్మించుకున్నటువంటి గణితశాస్త్రవయసెంత అంటారు? ఉదాహరణకి వృక్షసంతతిని తీసుకుందాం. ఆకులు తొడిగే విధానం, సువర్ణ నిష్పత్తి. ఎందుకు సువర్ణనిష్పత్తిని అనుసరిస్తున్నాయి? ప్రొద్దుతిరుగుడుపువ్వులోని గింజల ఆకృతి, ఎప్పుడు చూసినా సంవర్గమాన క్రమరూపంలోనే ఎందుకు ఉంటుంది? ఆయా ఋతువుల్లో క్రమం తప్పకుండా పూస్తూ, కాస్తూ, ఆకులను రాలుస్తూ మొదలైన ప్రక్రియలన్నీ ఏ జీవ గడియారాన్ని అనుసరించి జరుగుతున్నాయి? అంటే ఇవన్నీ కూడా గణితశాస్త్రవిధేయంగానే జరుగుతున్నాయి అన్నది మనకి స్పష్టం అవుతున్నది.

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

ఇన్ని విశేషాలు విన్న దేవతలంతా అయ్యయ్యో అవేమీ చూడలేదని అన్నారు. "మరైతే మీరంతా వెంటనే బయలుదేరి భూలోకయాత్ర చేసి నేను చెప్పిన అద్భుతక్షేత్రాన్ని మేల్నాట దర్శించండి. కూడా రమ్మంటే నేనూ వస్తాను." అన్నాడు నారదమహర్షి.

లేడికి లేచిందే పరుగన్నట్లు అర్చామూర్తుల విశేషాలు విన్న గంధర్వులు కొందరు తక్షణమే సంసిద్ధత తెలిపారు. సర్వాంతర్యామి నారాయణమూర్తి ఈ కబుర్లన్నీ విని నవ్వి, "ఏమి? ఇక్కడ వైకుంఠంలో నన్ను చూసి తృప్తి కలగటం లేదా, భూలోకానికి వెళదామనుకుంటున్నారు?" అనడిగాడు.

నారదమహాముని తన మనోభావాన్ని వివరిస్తూ భూలోకంలో సాధారణ మానవమాత్రులలాగా అర్చామూర్తుల మహిమాన్విత సౌందర్యాన్ని చర్మచక్షువులతో దర్శించి ధన్యత చెందే ఆనందమే వేరుగా ఉంటుందని స్వామికి విన్నవించాడు.

శ్రీమన్నారాయణుడు చిరునవ్వుతో అనుమతిస్తూ "జాగ్రత్త సుమా. మనుష్యరూపంలో వెళ్తున్నారు. పుష్పక విమానంలో సావధానంగా వెళ్లిరండి" అంటూ ఆశీర్వదించాడు.

ఒక శుభముహూర్తాన నారదముని ఆధ్వర్యంలో దేవతాబృందం భూలోకయాత్రకు బయలుదేరింది. మనం గుర్తు పెట్టుకోవలసినదేమిటంటే ఈ బృందం సభ్యులెవరూ తాము తలచుకుంటే తప్ప ఇతరులకు కనబడరు.

## దివి నుండి దిగివచ్చిన దివ్య సందర్శకులు

నేడు కర్ణాటకగా ప్రఖ్యాతమైన రాష్ట్రం నాడు మేల్నాడుగా రామానుజాచార్యుల పాదస్పర్శతో పునీతమైన దివ్యక్షేత్రంగా ప్రసిద్ధం. మేల్నాడు దర్శించటానికి దివి నుండి భువికి దిగి వచ్చిన దివ్యసందర్శకులు తమ భూలోకయాత్రను పరమ పావనమైన కావేరీనదిలో స్నానమాచరించి ప్రారంభించదలచి నదీతీరంలో పుష్పకవిమానాన్ని దింపారు. వానలు బాగా కురవటంతో నది నిండుగర్భిణిలా జలసమృద్ధితో పరవళ్లు తొక్కుతోంది. కావేరీ, గంగానది వంటి మహానదులు, పాపాలను సైతం ప్రక్షాళనం చేసేటంత మహిమాన్వితమైనవని ప్రతీతి. ఈనాడు మైసూరుగా పిలువబడే ఆ ప్రదేశంలో కృష్ణ రాజేంద్ర సాగర్ ఆనకట్ట ఉంది. గంధర్వులంతా ఆ ఆనకట్టను, నదిని చూసి ఆహా కర్ణాటక ప్రజలు ఇంత సమృద్ధమైన నీటిని పొంది ఎంత సంతోషంగా ఉన్నారో కదా అనుకున్నారు. అంతా నీళ్లలోకి దిగి ఆనందంగా జలక్రీడలు సలుపసాగారు.

ఇంతలో జలక్రీడలాడుతున్న గంధర్వులందరికీ ఒక వింతైన గొప్ప శబ్దం వినిపించింది. హఠాత్తుగా ఆనకట్ట నుండి పడే జలప్రవాహం ఉధృతమైంది. ముందు ఆశ్చర్యపోయినా వారందరికీ త్వరలో ఆ శబ్దమేమిటో అర్థమైంది. ప్రవాహాన్ని అదుపు చేసే పాతబడ్డ ఆనకట్ట తలుపొకటి వర్షాల ధాటికి విరిగిపోయింది.

ఇకనేం, కావేరీనది నూతనోత్సాహంతో అడ్డూ, ఆపూ లేకుండా తన ప్రయాణాన్ని ఉరుకులు, పరుగులతో సాగించింది. తెల్లవారే లోపల అక్కడి నుంచి ప్రయాణమై వెళ్లిపోవాలని గంధర్వులు నిశ్చయించుకున్నారు. మర్నాటికి గాని ప్రజలందరికి ఆనకట్ట తలుపు విరిగిన సంగతి తెలియరాదు. *(ఇంకా ఉంది)*

ఉపనిషద్వాక్యం

# “సింధుం మాతృతమామ్”

**‘నదులు అమ్మ కన్నా ఎక్కువైనవి’ (ఋగ్వేదం)**

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

వైదికసంస్కృతి నదులను ఆరాధించడం ఒక సంప్రదాయం. జడ– భౌతికవాదం ప్రబలిన నేటికాలంలో ఈ ఆరాధన వెనుక నున్న సూక్ష్మం అర్థం కావడం కష్టం. కన్నతల్లి వాత్సల్యంలోని విలువనే గ్రహించలేని కృతఘ్నత ప్రబలుతున్నప్పుడు ప్రకృతి లోని ‘అమ్మతనం’ అర్థమవుతుందా!

జలం మనకు ప్రాణాధారం. ఈ జలాలలోనున్న దైవశక్తిని దర్శించారు మహర్షులు. ‘ప్రకృతి అంతా చైతన్య మయం. ప్రాణవంతం’ అనేది వేదదర్శనం. పంచభూతాలూ పరమేశ్వరస్వరూపాలు. వాటిపట్ల మనం ప్రసరింపజేసే భావ పరంపరకి అవి స్పందిస్తాయి, అనుగ్రహిస్తాయి, ఆగ్రహిస్తాయి. వీటికి పౌరాణిక దృష్టాంతాలే కాక, స్వానుభవ తార్కాణాలూ చాలా ఉన్నాయి.

> *మాతృతమములైన నదులలోని ఆ దివ్యత్వాన్ని దర్శించిన గొప్ప సంస్కృతిలో పుట్టిన మనం ఇప్పటికైనా ఆ భావన కలిగించుకుంటే మన మానసిక స్పందనలన్నీ అమృతవర్షిణీ రాగాలవుతాయి. ప్రకృతి జనని పరవశించి పచ్చదనం పండించుకుంటుంది.*

సీతమ్మ శ్రీరామునితో వనవాసానికి వెళ్ళేటప్పుడు సరయూ, గంగ, గోదావరివంటి నదులకు నమస్కరించి, ముత్తైదువలకువలె అర్చనలు చేసింది. నదీమాతృకలు పరదేవతా స్వరూపాలు అనేది ఆర్షభావన. ఈ దేశపు ఆత్మ భావన.

శ్రీరాముడు సముద్రానికి సేతువు నిర్మించేటప్పుడు దర్భశయనదీక్షతో సముద్రాన్ని ప్రార్థించడం అందరికీ తెలిసినదే. సేతుబంధన దక్షత ఉన్న నలుడు తన సేవలోనే ఉన్నా, ప్రకృతి అనుకూలించకపోతే ఏదీ సాధ్యం కాదు.

నదులనీ, వనాలనీ ఆరాధించడం అనాగరికం కాదు. అది నాగరికతను మించి ఎదిగిన గొప్ప సంస్కారం.

అందుకే భగీరథచక్రవర్తి గంగను తీసుకువచ్చి, ఆ జలాలతో తన పితరులకు సద్గతులు కలిగించాలని తపస్సు చేశాడు. హిరణ్యతేజుడు, పురూరవుడు వంటి మహారాజులు సైతం తపస్సుల ద్వారా నదీమాతృకల్ని ప్రసన్నం చేసుకున్నారు.

‘ఆపోవా ఇదగ్ంం సర్వం’ అని జలశక్తిని గుర్తించింది వేదసంస్కృతి.

నదులను ఆధారం చేసుకొని గొప్ప గొప్ప నాగరికతలను ఆవిష్కరించుకున్నాం. ఎన్నో ఉత్సవాలు, పుష్కరాది వైభవాలు, దేవాలయాలు నదుల తీరాలలో ఆవిష్కరించుకున్నాం. నదుల తీరాలలో ఆ అమ్మల్ని పలకరిస్తూ కొలుచుకుంటున్నాం.

ఆయా పుణ్యకాలపర్వాలలో విభిన్న ప్రాంతాల వాళ్ళు అంతా కలసి ఎంత సమైక్య సాంస్కృతిక సౌజన్య సంగీతాన్ని ఆవిష్కరిస్తున్నారో మనకు తెలుసు. ఒక్కొక్క నదీ జలకణం – మన భౌతిక దేహాలనే కాక ఆత్మల్ని కూడ కడుగుతున్న అనుభూతితో అద్వితీయ ఔన్నత్యాన్ని సాధించుకుంటున్నాం.

గంగమ్మ, గోదారమ్మ, కృష్ణమ్మ అని నదుల్ని అమ్మలుగా పూజిస్తాం మనం. వాటి చలువ వల్ల అన్నం తింటున్నాం. దాహార్తిని పోగొట్టుకుంటున్నాం. కృతజ్ఞత అనేది మానవీయ దృష్టి, ఆ మానవతకు సార్థక్యం కల్పించిన సంస్కృతిలో పుట్టిన మనమే– ఎన్ని పుణ్యనదుల్ని కలుషితం చేస్తున్నాం! ఎన్నింటినో నామరూపాల్లేకుండా చేశాం! ఏ మాత్రం జాగ్రత్త లేకుండా, నిర్లజ్జగా నదీమతల్లుల్ని కాలుష్యమయం చేస్తూ విర్రవీగుతూ, వాటి ఫలితాలు అనుభవిస్తున్నాం.

ఋగ్వేదంలో– ఒక యజ్ఞం పూర్తి చేసుకు వచ్చిన విశ్వామిత్రుడు అతని పడవ వెళ్ళలేనంత తీవ్రంగా ఉన్న శతురూ(సట్లెజ్), వ్యాస(విపాశా)నదుల్ని ప్రార్థించి, అనుగ్రహంతో వెళ్ళిన గాథ ఉంది. శైశవ కృష్ణుని తీసుకువస్తున్న వాసుదేవునకు యమున తనంత తాను దారినివ్వడం మనకు తెలిసినదే.

మాతృతమములైన నదులలోని ఆ దివ్యత్వాన్ని దర్శించిన గొప్ప సంస్కృతిలో పుట్టిన మనం ఇప్పటికైనా ఆ భావన కలిగించుకుంటే– మన మానసిక స్పందనలన్నీ ‘అమృతవర్షిణీ’ రాగాలవుతాయి. ప్రకృతి జనని పరవశించి పచ్చదనం పండించుకుంటుంది.

ఓమ్ తత్సత్!!

## శ్రీవేంకటేశ్వరలీలలు



# "శ్రీవేంకటపతి తన దాసులను గాచే అనంతుడు"

– శ్రీ వారణాశి దుర్గాప్రసాద్

తిరుమల శ్రీవారు నేను కొలుచుకునే దైవం. తిరుమల తిరుపతి దేవస్థానంవారు పరిష్కరించి ముద్రించిన 29 సంపుటాల అన్నమయ్య కీర్తనలను, మా ఇంట్లో "తాళ్ళపాక వారి అర" పేరుతో ఒక అరను కేటాయించుకుని వాటిని నేర్చుకుంటూ పాడుకుంటూ అలౌకిక ఆనందాన్ని పొందు తుంటాను. అన్నమయ్య రచించిన కీర్తనలలో "వేంకటగిరి" పదంతో ఉన్న 100 కీర్తనలను ఎంచుకొని, వాటికి భాష్యాన్ని జతచేస్తూ "అన్నమయ్య వేంకటగిరి శతకీర్తనలు" పేరుతో సంకలనం చేసి ముద్రించాలనే సంకల్పంతో ఉన్న తరుణంలో నా జీవితంలో జరిగిన వేంకటేశ్వరస్వామివారిలీల భక్తులకు తెలియజేస్తున్నాను.

మా అమ్మాయి వివాహం నెల్లూరులో జరిగింది. బంధుమిత్రుల రాకతో వివాహము అంగరంగ వైభవంగా జరిగింది. వివాహానికి ముందురోజు రాత్రి నా శ్రీమతి నాకు మా అమ్మాయి తాలూకు 5 సవర్ల బంగారు గొలుసు దాచమని అప్పజెప్పింది. మరునాడు వివాహసమయంలో ఆ గొలుసును మరలా తానే తీసుకుంది. వివాహనిర్వహణలో నిమగ్నమై ఉన్న నేను ఆ విషయాన్నే మర్చిపోయాను.

ఆ రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత విలువైన వస్తువులను సరిచూసుకుంటూ తాను నాకిచ్చిన నగ గల్లంతయిందని గుర్తించి నాపై దుర్భాషలాడటం ప్రారంభించింది. నేను సమాధానమిస్తూ "నాకు అప్పచెప్పావు. అది ఎక్కడికి పోదు. నేను కొలిచే తిరుమల శ్రీవారు మన ఇంటి సింహద్వారం నుంచి అన్ని గదులలో పరివేష్టితమై ఉన్నారు. అది గల్లంతయ్యే అవకాశం లేదని" చెప్పాను.

కాని నా శ్రీమతి నోటి వాగ్ధాటిని కట్టడి చేయడం సాధ్యం కాలేదు. మరునాడు ఇల్లంతా వెతికారు. నగ కన బడలేదు. కల్యాణమండపం నుండి తీసుకొని వచ్చిన సూట్ కేసులన్నీ తెరచి, జల్లెడబట్టిన రీతిలో వెదికారు. ఫలితం శూన్యం. ఆ తర్వాత తను నన్ను అనుమానించడం ప్రారంభించింది. అక్కడితో ఆగలేదు. బంగారునగమీద ఏర్పడిన వ్యామోహం భగవంతుని, భగవంతుని లీలలను విశ్వసించే స్థాయి నుండి పూర్తిగా తగ్గిపోయింది.

మూడవ రోజు ఉదయం నేను దేవుని గదిలో కూర్చొని తిరుమల శ్రీవారిని పూజిస్తున్నాను. ఆ సమయంలో కన పడకుండాపోయిన ఆ నగను గుర్తుచేసుకుంటూ "నువ్వే దానిని ఏదో చేసి ఉంటావు. నేను నిన్ను పూర్తిగా అనుమానిస్తున్నాను" అంటూ నామీద నింద మోపి ఆవేశంతో కేకలు వేస్తూ నా ఆధ్యాత్మిక జీవితాన్ని, వేంకటేశ్వరతత్త్వాన్ని ఎగతాళి చేయడం మొదలెట్టింది.

అంతేకాదు ఆ మరునాడు ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో నూతన వధూవరులతో సహా కల్యాణ ఉత్సవానికి హాజరుకావడానికి టిక్కెట్లు బుక్ చేసుకుని ఉన్నాం. అదేరోజు సాయంత్రం 5 గం॥లకు రూ.300/–ల టిక్కెట్లు స్వామి దర్శనం కోసం సిద్ధం చేసుకొని ఉన్నాం. ఈ సమయంలో ఇంట్లో ఏర్పడిన ఈ స్థితికి మనసు ఓ పట్టాన స్థిమితం కావడంలేదు. అయినా సరే చెక్కుచెదరని వేంకటేశ్వరతత్త్వాన్ని మనసులో నింపుకొని పూజను కొనసాగిస్తూ, స్వామివారికి నైవేద్యం నివేదించి గంట మ్రోగించే తరుణంలో, మా ఆవిడ, మా అబ్బాయి ఆనందంతో ఉన్న ముఖాలతో, కనపడకుండాపోయిన



నగను చేతిలో పట్టుకొని పూజగది దగ్గరకు వచ్చి నిలబడ్డారు. గత 3 రోజులుగా, సూట్‌కేసులోని దుస్తులను, చీరలను జల్లెడపట్టిన రీతిలో వెదికినా కన్పించని నగ, ఇప్పుడు సూట్‌కేసులను పైకి ఎత్తితే చీరలనుండి నగల పెట్టెతో (జువెలరీ బాక్స్) సహా జారి నగ క్రింద పడిందని చెప్పారు.

ఆ సమయంలో నా ఆనందానికి అంతులేదు. పోయిందనుకున్న నగ కనిపించినందులకు కాదు. తిరుమల శ్రీవారిని భక్తితో సేవ చేస్తున్నందుకు, ఈ దాసునిపై మోపిన నిందను తొలగించేందుకు స్వామి వారే స్వయంగా పూనుకున్నారు. లేకపోతే ఆ నగ ఇప్పటికిప్పుడు క్రిందపడి కన్పించడమేమిటి? స్వామివారి అనుగ్రహం కాకపోతే వెంటనే అన్నమయ్య వ్రాసిన కీర్తనలలోని పదాలు గుర్తుకొచ్చాయి.

"పరగు శ్రీ వేంకటపతి తన దాసులను అరుదుగ కాచే అనంతుడితడు". ఈ వాక్యాన్ని నిజం చేస్తూ నాపై మోపిన నిందను బాపి తన దాసులపట్ల ఆయనకున్న శరణాగతిని నిజంచేసి చూపించాడు. ఆనందంతో, భక్తిపారవశ్యంతో, అన్నమయ్య కీర్తనలు పాడుకుంటూ కారులో తిరుమలకు చేరి మరునాడు ఉదయం స్వామివారి కల్యాణోత్సవం, ఆ సాయంత్రం 300 రూపాయల ప్రత్యేక దర్శనాన్ని పూర్తి చేసుకొని ఇల్లు చేరాం.

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారు చూపే ఇటువంటి లీలలు భక్తుల ఆధ్యాత్మిక వారధికి మరింత ప్రోదిని కల్పిస్తాయి. అందుకే అన్నమయ్య రచించిన ఓ కీర్తనలోని ఈ పల్లవిని పదే పదే పాడుకుంటూ ఉంటాను.

"ఘనుడాతడే మము కాచుగాక హరి
అనిశము మేమిక అతనికే శరణు
శరణో శరణో వేంకటరమణ- శరణో శరణో సంకటహరణ"

*ఓం నమో వేంకటేశాయ!!*

## గ్రంథసమీక్ష

### తిరుచానూరు అలమేల్మంగ-అన్నమయ్య కీర్తనలు

రచన- డా॥పగడాల నారాయణ; పుటలు-160; వెల-రూ.100/-; ప్రతులకు- శ్రీమతి పి.సంధ్య, ఇ.నెం.18-4-150, రైల్వేకాలనీ ఎక్స్‌టెన్షన్,5వ క్రాస్, తిరుపతి-517501; ఫోన్-9160727374.

తిరుచానూరు అలమేల్మంగ-అన్నమయ్య కీర్తనలు అను ఈ గ్రంథంలో క్షేత్రచరిత్రను, శ్రీపద్మావతీదేవి అవతారవైభవాన్ని, ఈ క్షేత్రానికి అనుబంధం ఉన్న శ్రీకృష్ణస్వామి, శ్రీసుందరరాజ స్వామి ఆలయాలతో పాటు పుష్కరిణి చెంతనున్న శ్రీసూర్య దేవాలయం మరియు పద్మసరోవరాన్ని గురించి సంక్షిప్తంగా వివరించారు. ఈ క్షేత్రంలో అమ్మవారికి పాంచరాత్ర ఆగమోక్త ప్రకారంగా జరిగే నిత్యోత్సవ, వారోత్సవ, నక్షత్రోత్సవ, మాసోత్సవ మరియు బ్రహ్మోత్సవాలను సంక్షిప్తంగా తెలియచేశారు. ఈ ఉత్సవాలలో ఆనాటినుంటి ఈనాటి వరకు సంప్రదాయబద్ధంగా జరిగే పంచమీతీర్థం, మరియు వరలక్ష్మీవ్రత వైశిష్ట్యాన్ని చక్కగా ఈ గ్రంథంలో వివరించారు.

ఈగ్రంథం తిరుచానూరి క్షేత్రాన్నిగూర్చి పౌరాణికంగా, చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా వివరించడమే గాక, అన్నమయ్య సంకీర్తనా సాహిత్యములోని అలమేలుమంగా సంబధమైన 132 కీర్తనలను సేకరించి, ఇందులో అమ్మవారి వసంతాల, తట్టు పునుగు, జాజర, తిరునాళ్ళ, హారతి, పుష్పయాగ మంగళకీర్తనలు పాఠకులకు వీలుగా అన్నమయ్య సంకీర్తనా ప్రవంతి నుండి అందించడం ముదావహం. **- పి.సంధ్య.**



# జై చిరంజీవ...!

– డా॥ అద్దంకి శ్రీనివాస్

అంజనేయుడు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల అంశతో జన్మించాడు. ఏదైనా పనిని ఎన్ని మార్గాలలో ప్రయత్నించినా సఫలం కాకపోతే, ఒక్క హనుమంతుని ఉపాసన ద్వారా తప్పక సఫలమౌతుందని సాధకుల అనుభవవాక్యం. అందుకే ఆర్తిగా–

'అసాధ్య సాధక స్వామిన్! అసాధ్యం తవ కిం వద।
రామదూతః దయాసింధో మమకార్యం సాధయా ప్రభో॥'

అని అనాలట. అసాధ్య సాధకుడైన ఆ స్వామికి అసాధ్యం అన్నది ఏదీ లేదు. మన పురాణాల ఆధారంగా ఆంజనేయుడు పంచముఖుడు.

వందే వానర నారసింహ ఖగరాట్ క్రోడాశ్వవక్త్రాన్వితమ్
నానాలంకరణం త్రిపంచనయనం దేదీప్యమానం రుచా।
హస్తాబ్జైః అసి ఖేట పుస్తక సుధాకుంభాంకుశాద్రిం హలం
ఖట్వాంగం ఫణి భూరుహం దశభుజం సర్వారి గర్వాపహం॥

1)వానర 2)నారసింహ 3)గరుడ 4)వరాహ 5)అశ్వం అనేవి పంచముఖాలు. ఖడ్గం, ఖేటం, పుస్తకం, సుధాకుంభం, అంకుశం, అద్రి, హలం, ఖట్వాంగం, సర్పం, వృక్షం అనే పదింటినీ తన పది భుజాలతో ధరించి సకల దుష్టశక్తుల్ని హరించే దివ్యశక్తిసంపన్నుడు. హనుమంతుడు బాహ్యంగా పంచముఖాలతో, సాక్షాత్తూ ఈశ్వరాంశతో జన్మించి నప్పటికీ మాటలో, మన్ననలో, నడకలో, నమ్రతలో, భక్తిలో, యుక్తిలో, ధైర్యంలో, స్థైర్యంలో బహుముఖీనమైన ప్రతిభా పాటవాలు కన్పిస్తాయి.

హనుమంతుడు ఉత్తమసేవకుడు. అత్యుత్తమ శక్తి, ప్రతిభ ఉన్నా దాసత్వాన్ని శ్వాసించే వ్యక్తి. అందుకే రామదాసులలో మిన్నగా నిలిచాడు. స్వామిభక్తిలో పరిపూర్ణతని, పరాయణత్వ పరాకాష్ఠని ప్రదర్శించాడు. ఒక వ్యక్తిని నమ్మితే నూటికి రెండువందలపాళ్ళు నమ్మాలని రాముణ్ణి నమ్మికొలిచిన విశ్వాసపాత్రుడు. అందుకే హనుమంతునిలాంటి సేవకుడు దొరకడం నా అదృష్టమని రాముడు కొనియాడాడని 'తులసీదాస్' కీర్తించాడు.

మహోన్నత భక్తుడు ఆంజనేయుడే. *"యత్ర యత్ర రఘునాథకీర్తనమ్ తత్ర తత్ర కృతమస్తకాంజలి...."* రామకీర్తన జరిగే చోట హనుమ పులకితగాత్రుడై ఉంటాడు.

వాయుపుత్రుడు విద్యల నిధి. సాక్షాత్తూ హయగ్రీవుడే ఆంజనేయుడు, పంచముఖులలో ఒకటైన అశ్వముఖమే హయగ్రీవునిది. హయగ్రీవుడు సకలవిద్యానాయకుడు. అందుకే హనుమంతుడు నవవ్యాకరణ పండితునిగా ప్రసిద్ధి పొందాడు. సూర్యుని వద్ద ఆ విద్య అభ్యసించాడు. రాముని చరితంలో హనుమంతుడు లేని అంకం ఊహించలేనిదన్నంతగా కలిసిపోయిన రాముని ఆత్మబంధువు. ఋష్యమూకంపై రామలక్ష్మణుల్ని కలసింది మొదలు, వారి దివ్యత్వాన్ని గుర్తించిన జ్ఞాని. తన జన్మంతా సేవించి చిరంజీవిగా నిలిచిన ధన్యుడు.

కార్యదీక్షాదురంధరుడు. తాను సాధించిన కార్యాన్ని తన విజయంగా కాక, వానరుల విజయంగా అభివర్ణించిన మహోన్నతుడు. శక్తి ఉన్నా అణకువను, వేగం ఉన్నా ఆలోచననూ ఎలా ధరించాలో హనుమంతుణ్ణి చూసి నేర్చుకోవాలి, రామనామాన్నే తన ఆహా రపానీయాలుగా కీర్తించే హనుమంతుని భక్తి అతని శక్తి అని చాటి చెప్పిన దివ్యపురుషుడు. సువర్చలా సమేతుడైన ఆంజనేయుడు నిత్యబ్రహ్మచారి. సదా రామపర బ్రహ్మం కోసమే చరించేవాడు.

ఆధ్యాత్మిక పురుషులకూ హనుమే కొండంత దిక్కు. హనుమంతుడు చూపిన దారిలోనే 'జీవాత్మ' అనే రాముడు 'సీత' అనే కుండలినీశక్తిని మేల్కొల్పాడు. లౌకికులకు ఆంజనేయుడి సందేశాలేన్నో ఉన్నాయి. విశ్వాసపాత్రుడై రామకార్యాన్ని దీక్షగా నిర్వహించడం, సుగ్రీవమంత్రిగా తగిన సలహాలు ఇవ్వడం, రామసుగ్రీవమైత్రిని ప్రోత్సహించడం, వానరుల్ని సంఘటితం చేసే కార్యాన్ని సాధించడం, ఆశ్రితుల్ని రక్షించడం వీటిలో కొన్ని.

ఆంజనేయుడంటే కొండంత నమ్మిక. భక్తుల హృదయాలలో నిండిన ఆత్మస్థైర్యం. పిల్లల గుండెలపై ధైర్యంగా వెలిగే దేవుడు. అత్యంతప్రమాదకరమైన వాహనాలు తిరిగే దారులలో, ఊరిపొలిమేరలలో అభయహస్తుడై నిలిచి సర్వదా రక్షించే 'రహదారి దేవుడు'. నమ్మికొలిచిన భక్తుల కోర్కెలను వమ్ము చేయకుండా, ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా వెంటనే తీర్చే దయాంతరంగుడు. అందుకే ఏ సమస్య ఉన్నా 108 సార్లు 'హనుమాన్ చాలీసా' పారాయణని ఏకధాటిగా చేస్తే సత్వరం ఫలితం ఉంటుందని, దీర్ఘకాలంగా పీడించే రోగాలు, సమస్యలు 'సుందరకాండ' పారాయణం వల్ల ఉపశమిస్తాయని హనుమదారాధకుల ఉద్బోధ. బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం, వాక్పటుత్వం– హనుమత్ స్మరణవల్ల లభిస్తాయి. అందుకే ఓయి హనుమంతా! నీకు సహస్రకోటి నమస్కారాలు.

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసం।
రామాయణమహామాలారత్నం వందే అనిలాత్మజం॥




# దురాశ

– స్వామి జ్ఞానదానంద

చాలాకాలం క్రితం సృంజయుడనే రాజు ఉండేవాడు. అతడికి కుమార్తె ఒక్కతే సంతానం. ఆ రాజుకు 'తనకు వారసుడుగా ఒక కుమారుడు లేకపోయాడే' అన్న కొరత మనస్సులో గూడు కట్టుకొని ఉంది. కనుక తన కొరతను తీర్చుకొనే ఉద్దేశంతో సదాచార సంపన్నులైన విప్రులను రావించి, వారికి ఉపచర్యలు చేసి, తన మనస్సులోని మాటను వారికి తెలిపాడు.

రాజు చేసిన ఉపచర్యలకు ఆ విప్రపుంగవులు పరమానంద భరితులయ్యారు. వారు రాజు కొరత తీర్చమని దేవర్షియైన నారదుని హృదయపూర్వకంగా ప్రార్థించారు. ఆ సమయంలో నారదమహర్షి సృంజయుని అతిథిగా అక్కడే ఉన్నాడు.

రాజు నిమిత్తం చిత్తశుద్ధితో వేడుకొన్న ఆ విప్రపుంగవుల మొర నారదమహర్షి మనస్సును కదలించి వేసింది. దాంతో దేవర్షి రాజు కొరతను తీర్చాలని సంకల్పించాడు.

నారదుడు వెంటనే రాజును తన సమక్షంలోకి రావించి, "రాజా! నీకు ఎటువంటి కుమారుడు జన్మించాలని అభిలాష పడుతున్నావు?" అని అడిగాడు.

రాజు ఏదో సామాన్యమైన వరం కోరి ఉండకూడదా? విధి ఎవరిని విడిచిపెట్టింది! రాజు మనస్సులో దురాశ ప్రవేశించింది.

దురాశ నిండిన మనస్సుతో రాజు నారదునికి నమస్కరించి, "మహర్షి నాకు మీరు పుత్రసంతానవరం ప్రసాదించ గోరితే నేను కోరుకొనేట్టి కుమారుడు జన్మించాలని అనుగ్రహించండి. అంటే– నాకు జన్మించే కుమారుడు అమిత అందగాడు గానూ, ఆరోగ్యవంతుడుగానూ ఉండాలి. దాంతో పాటు అతడు విసర్జించే మలం, మూత్రం, ఉమ్మి, శ్లేష్మంవంటివి బంగారు మయమై ఉండాలి" అని వేడుకొన్నాడు.

కొంతసేపు యోచించిన నారద మహర్షి అన్నింటిని గణనలోకి తీసుకొని, "రాజా! నీ కోరిక మేరకే జరుగుతుంది" అంటూ వరప్రదానం చేసి త్రిలోకసంచారానికి బయలుదేరాడు.



నారదమహర్షి వరప్రభావంతో రాజుకు సముచిత కాలంలో ఒక కుమారుడు జన్మించాడు. రాజు ఆనందానికి హద్దులేకుండాపోయింది.

రాజు తన కుమారుడికి **'సువర్ణష్ఠీవి'** అని నామకరణం చేశాడు. రాకుమారుడు ఏడిస్తే స్రవించే కన్నీరు బంగారు మణులుగా వర్షించేది. తక్కిన ఏ అశుద్ధమైనా విసర్జింపబడు తున్నప్పుడు బంగారమే అయ్యేది! దాంతో రాజు ఆదాయం గణనీయంగా పెరిగింది. రాకుమారుడు– ఉమ్మివేయడం, శ్లేష్మం చీదడం, మలవిసర్జన మొదలైన వాటితో రాజు ఖజానా బంగారు కాసులతో నిండిపోసాగింది. ఇదంతా చూస్తూ రాజు వర్ణనాతీతమైన ఆనందం పొందసాగాడు.

బంగారం అందించే రాకుమారుని గురించిన వార్త దోపిడిదొంగలకు తెలియవచ్చింది. వెంటనే వాళ్ళు ఒక బృందంగా జతకట్టారు. రాకుమారుని అపహరించుకుపోవాలని పథకం వేశారు.

పథకం ప్రకారం ఒక రోజు రాత్రి దోపిడిదొంగలు రహస్యంగా అంతఃపురంలో జొరబడ్డారు. అందరూ గాఢనిద్రలోకి జారుకొన్నప్పుడు గుట్టుచప్పుడు కాకుండా రాకుమారుని అపహరించి తమ స్థావరానికి తీసుకుపోయారు.

రాకుమారుని అపహరించుకుని వచ్చాక దోపిడిదొంగలకు ఏ విధంగా రాకుమారుని విసర్జకాలు పంచుకోవాలో అనే విషయాలలో అభిప్రాయ భేదాలు తలెత్తాయి. అక్కడ కుమారుడు కనిపించక రాజు నాలుగు వైపులకూ సమర్థులైన వీరులను పంపించాడనే సమాచారం దొంగలకు అందినది. రాకుమారుని చాలా రోజులు దాచి ఉంచటం సాధ్యంకాదని, దొంగల నాయకులు చర్చించుకొని, ఒక

నిర్ణయానికి వచ్చారు- రాకుమారుని చంపివేయాలి; తద్వారా లభించే బంగారాన్ని సమానంగా పంచుకుని గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళిపోవాలి- అని అనుకుని-

కరుడు కట్టిన క్రూరత్వానికి ప్రతీకలైన ఆ బందిపోటు దొంగలు రాకుమారుని నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. రాకుమారుని శరీరం రెండుముక్కలు అయిందే తప్ప, అతడి శరీరంలో చిన్నమెత్తు బంగారం కూడా లభించలేదు.

దురాశతో తను కోరిన వరం వలన సృంజయుడు తన కుమారుని కాపాడుకోలేకపోయాడు. రాజుకే పుత్రుని దుర్మరణ శోకం తప్పలేదు. అదే దురాశ కారణంగానే దొంగలూ రాకుమారుని చంపివేశారు. ఈ కారణంగానే వాళ్ళకు కించిత్తు బంగారం కూడా లభించలేదు. అందుకు మారుగా నిష్కారణంగా ఒక పసిబాలుని చంపిన పాపం చుట్టుకొంది. అంతేకాదు రాజు ఆగ్రహానికి గురయ్యారు. చివరకు రాజభటులకు పట్టుబడి ఉరితీయబడ్డారు. కనుక, దురాశచే సృంజయుడు లేకలేక కలిగిన కుమారుణ్ణి కోల్పోయాడు. బందిపోటు దొంగలు ప్రాణాలు కోల్పోయారు.

ఈ విధమైన కథ మహాభారతంలో (శాంతిపర్వం) చోటు చేసుకొంది. ఒకడు, నిత్యం బంగారు గుడ్డుపెట్టే బాతును తెగనరగ్గా దాని కడుపులో అనేక బంగారు గుడ్లు ఉంటాయి; వాటన్నింటినీ ఒకేసారి అమ్మితే అమిత ధనవంతుణ్ణి అయిపోతాను అనుకొని, ఆ బాతును చంపినప్పుడు దాని పొట్టలో ఏదీ లేదు; అంతేకాదు, ప్రతిరోజూ తాను పొందుతున్న నిరంతరమైన ఆదాయాన్ని కోల్పోయాడు- అనే కథను గుర్తుకు తెస్తుంది.

**నీతి- దురాశ దుఃఖానికి చేటు**

## తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి తెప్పోత్సవం

**తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు జూన్ 17వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఘనంగా జరుగనున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వ నున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీఅలమేలుమంగమ్మ పద్మసరోవరతీరంలో పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసారదుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారుపద్మం నుండి ఆవిర్భవించిన అలమేలుమంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.**

**జూన్ 17వ తేదీ మొదటిరోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండోరోజు సుందరరాజస్వామి, చివరి మూడురోజులు పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. చివరి మూడు రోజులపాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3.30గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు అమ్మవారికి స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడవీథుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.**



*(చివరిపుట వివరణ)*

## జ్యేష్ఠాభిషేకం

**ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠానక్షత్రానికి ముగిసేట్లుగా మూడురోజులపాటు తిరుమల శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపంలో జరుగుతుంది. దీన్నే "అభిధేయక అభిషేకం" అంటారు.**

**తరతరాలుగా అభిషేకాదులతో అత్యంత ప్రాచీనములైన శ్రీస్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఉత్సవమే ఇది. ఇది మూడురోజుల పాటు నిర్వహించ బడుతున్నది.**

**మొదటిరోజు శ్రీమలయప్పకు ఉన్న బంగారుకవచాన్ని తీసివేసి, హోమాలు అభిషేకాలు పంచామృత స్నపనతిరుమంజనాదులు జరిగిన తర్వాత శ్రీస్వామివారికి వజ్రకవచం అలంకరించి పురవీథుల్లో ఊరేగిస్తారు.**

**యథాక్రమంగా రెండవ రోజు ముత్యాలకవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవ రోజు కూడ తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు చేస్తారు. ఈ బంగారు కవచ సమర్పణ మళ్ళీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారుకవచంతోనే ఉంటారు.**

**ఆర్జితసేవగా నిర్వహింపబడుతున్న ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొనవచ్చు. ఈ సేవలో పాల్గొన్న భక్తులను కవచంలాగా స్వామి రక్షిస్తాడు.**



*(ముఖచిత్ర వివరణ)*

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** హఠాత్తుగా సంభవించే పరిణామాలను ఎదుర్కొనడానికి సిద్ధం అవుతారు. అవసరాలకు సరిపడా ధనమును ఏర్పరుచుకోగల్గుతారు. సమయోచితంగా ఆలోచించి తగిన నిర్ణయాలను చేయ గల్గుతారు.



**వృషభం–** ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయి. తలచిన పనులలో ఆలస్యం, ఆదాయానికి మించిన ఖర్చు ఉంటుంది. నెలాఖరుకు ఆర్థిక, కుటుంబ విషయాల్లో ముందంజ వేస్తారు.



**మిథునం–** ఈ మాసంలో పెట్టుబడులు లాభదాయకం. ఆర్థికస్థితి మెరుగుపడుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఈ కాలంలో శీతల ప్రాంతాలలో ప్రయాణాలు ఫలవంతంగా మారుతాయి.



**కర్కాటకం–** మీరు అపారమైన తెలివితేటలు ప్రదర్శిస్తారు. ప్రజాదరణ, అభిమానాన్ని చూరగొంటారు. ఇతరులకు మీపై సానుకూల ధోరణి ఉంటుంది. ధనధాన్యాలు వృద్ధి చేస్తారు. విజయకాంక్షతో ఉంటారు.



**సింహం–** వ్యాధి నుండి ఉపశమనం, ఆదాయాన్ని మరియు వృద్ధిని పొందుతారు. అందరితో సత్సంబంధాలుంటాయి. వ్యాపారస్తులకు పంట పండుతుంది. లాభాల బాటన పయనిస్తారు.



**కన్య–** ప్రభుత్వం నుంచి సత్కార పురస్కారాలు లభిస్తాయి. దూరప్రయాణాలు అనుకూలిస్తాయి. చదువులో వృద్ధి కనబడుతుంది. ఆధ్యాత్మిక విషయాలు, దానధర్మాలలో మునిగి ఉంటారు.



**తుల–** నెల ప్రారంభంలో విశేషఫలితాలు తదుపరి సామాన్యము. ఆనందభరితమైన జీవనాన్ని పొందుతారు. కోపతాపాలను ఆవేశాన్ని అదుపులో ఉంచుకోవాలి.



**వృశ్చికం–** చదువు విషయంలో మరింత కృషి, శ్రద్ధ అవసరం. విజయం అన్ని ప్రయత్నాలలో అనుసరిస్తుంది. పెట్టుబడులకు సరైన సమయం కాదు. దూరప్రయాణాల విషయంలో ఆలోచించాలి.



**ధనుస్సు–**ఆర్థికపరంగా చాలా అనుకూలమైన పరిస్థితి, కుటుంబపరంగా మీకు మంచి మద్దతు లభిస్తుంది. సంతానం విషయాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. పెట్టుబడులు మంచి ఫలితాలనిస్తాయి.



**మకరం–** వ్యక్తిగత జీవితం సమస్యలతో కూడి ఉంటుంది. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు, స్పెక్యులేషన్ పనికిరావు. నెల రెండవభాగంలో మంచి ఆదాయం, పై అధికారులతోనూ, సహచరులతోనూ సత్సంబంధాలు ఉంటాయి.



**కుంభం–** మీ ప్రయత్నాలు మంచి ప్రతిఫలాలను ఇస్తాయి. మీకు మరింత ప్రేరణను ఇస్తుంది. శరీరసత్తువ మరియు ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. జీవితంలో కొత్త దృక్పథాన్ని పొందుతారు.



**మీనం–** ఉద్యోగంలో కొత్త బాధ్యతను స్వీకరించుట, అమోఘమైన వాక్పటిమను ప్రదర్శిస్తారు. ఇతరులపై గెలుచుట, దీర్ఘవ్యాధులకు ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకోవడం ద్వారా ఉపశమనం పొందుతారు.

ఆయుర్వేదం

# ఆరోగ్యభాగ్యానికి ద్రాక్ష

-డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ద్రాక్షపళ్ళు ముఖ్యంగా పచ్చ, నల్ల, ఎర్ర అని మూడురకాలుగా మార్కెట్లో దొరుకుతాయి. ఔషధగుణాలు వీటన్నింటిలో ఇంచు మించు సమానంగా ఉంటాయి. వీటిని ఎండించి విక్రయించేది ఎండుద్రాక్ష. పచ్చ ద్రాక్షను ఎండిస్తే కొద్దిగా పచ్చగాను, నల్లద్రాక్ష, ఎర్రద్రాక్షలను ఎండిస్తే నలుపు, ఎరుపు నలుపు వర్ణమిశ్రమవర్ణంలో ఉంటాయి. నిత్యజీవితంలో ఎదుర్కొనే అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపించే ద్రాక్షని ఔషధంగా ఎలా సద్వినియోగం చేసుకోవాలో ప్రస్తుతం తెలుసుకుందాం.

**గ్యాస్ట్రిక్‌ట్రబుల్ సమస్యకు:** 100గ్రా. ఎండుద్రాక్ష, 20గ్రా. అల్లం, 20గ్రా. సోంపుగింజలు, 10గ్రా. మిరియాలు, 10 గ్రా. సైంధవ లవణం కలిపి మిక్సీలో వేసి బాగా కలిపి ఉంచుకుని రోజూ ఒకసారి అన్నంతో లేదా చపాతి లేదా రొట్టె వగైరాలతో తగినంత వాడుకుంటే ఆకలి వృద్ధి అవుతుంది. మంచి జీర్ణశక్తి కలుగుతుంది. కడుపులో వికారం, కడుపు నొప్పి, కడుపుబ్బరం లాంటి జీర్ణాశయసమస్యలు తగ్గుతాయి.

**మూత్రాశయ ఇన్ఫెక్షన్లకు:** 200మి.లీ. నీటిలో 10 ఎండు ద్రాక్షలు, అర టీ స్పూన్ నలగ్గొట్టిన వేప చిగుర్లు, అర టీస్పూన్ తాటికలకండ కలిపి 100మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి వడగట్టి రెండు పూటలా పూటకు 50మి.లీ. చొప్పున సేవిస్తుంటే మూత్రంలో మంట, పోటు, చీము రావటం లాంటి ఇన్ఫెక్షన్ల సమస్య తగ్గుతుంది.

**పైత్యపు దద్దుర్లకు:** రోజూ 3,4 సార్లు పూటకు 100మి.లీ. నీటిలో 10గ్రా. చొప్పున ఎండుద్రాక్ష, జీలకరపొడి, ధనియాల పొడి కలిపి మిక్సీలో త్రిప్పి వడగట్టి త్రాగితే ఒంటిపై వచ్చే దద్దుర్ల సమస్య తగ్గుతుంది.

**వర్షాకాలం, శీతాకాలంలో వచ్చే జలుబు, దగ్గు తగ్గేందుకు:** ఎండు ద్రాక్ష, మిరియాలు, అతిమధురం, పటిక బెల్లం పొడులను ఒక్కొక్కటి 25 గ్రాములు కలిపి మెత్తగా నూరి కుంకుడు గింజంత మాత్రలు చేసి ఆరబెట్టి నిల్వచేసి, మూడుపూటలా ఆహారం తర్వాత పూటకొక మాత్ర చొప్పున సేవిస్తుంటే ఆయా కాలంలో వచ్చే జలుబు, దగ్గులాంటి సమస్యలు త్వరగా తగ్గుతాయి.

**మలబద్ధసమస్యకు:** రోజూ రాత్రి పడుకునేటప్పుడు తగినన్ని నీటిలో 20 ఎండుద్రాక్షలు, ఒక టీ స్పూను ధనియాలు వేసి 10-15 నిమిషాలు నానించి మిక్సీలో బాగా కలియత్రిప్పి 200 మి.లీ. నీటిలో కలిపి, అర టీ స్పూన్ తాటికలకండ కూడా కలిపి కొద్దిసేపు మరిగించి దించి చల్లార్చి వడగట్టి త్రాగితే చక్కటి పరిష్కారం దొరుకుతుంది.

**నోరు, మల, మూత్రద్వారాల నుంచి రక్తం వస్తుంటే:** రోజూ రాత్రి 20-40 ఎండు ద్రాక్షలని తగినన్ని నీటిలో వేసి నాన్చి, ఉదయం పేస్టులా చేసి ఒక గ్రాము చొప్పున అతి మధురం పొడి, శ్రీగంధంపొడి కలిపి సేవిస్తే సత్వర పరిష్కారం దొరుకుతుంది.

**రక్తవృద్ధికి:** రోజూ రాత్రి వేళల్లో 50 గ్రాముల ఎండుద్రాక్షని 100మి.లీ. నీటిలో వేసి ఉదయం వరకు నానించి వాటిని తిని మిగిలిన నీరు త్రాగుచుంటే రక్తలేమి సమస్య తగ్గి తద్వారా కలిగే నీరసం, బలహీనత, బడలిక, ఆయాసం తగ్గుతాయి.

**ఋతుక్రమం సక్రమంగా వచ్చేందుకు:** 100 గ్రాముల ఎండు ద్రాక్ష, ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో విక్రయించబడే 100 గ్రాముల అతిమధుర చూర్ణంలను మెత్తగా దంచి నిల్వ యుంచుకుని రోజూ ఒకట్రెండుసార్లు పూటకు 10-20 గ్రాముల ఔషధాన్ని చప్పరించి తగినన్ని పాలు సేవిస్తుంటే స్త్రీలలో నెలసరి సక్రమంగా జరిగి బహిష్టు కూడా సక్రమ పద్ధతిలో జరుగును.

**పొట్ట, ఉదరంలోని క్రిముల సమస్యకు:** ఎండుద్రాక్ష 100 గ్రా., ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో లభించే వాయు విడంగాల చూర్ణం 100గ్రా. కలిపి దంచి ఉంచుకుని, పూటకు కుంకుడు గింజంత లేదా 2-3 గ్రాములు చప్పరిస్తుంటే క్రిములు హరించి జీర్ణశక్తి మెరుగుపడి తీసుకున్న ఆహారం బాగా వంటికి పట్టి పుష్టి, బలం కలుగుతాయి.



పాఠం-31

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య          నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

| | | | |
|---|---|---|---|
| युष्माभिः = మీ చేత, మీతో | युद्धम् = యుద్ధము-ను | दृष्ट्वा = చూచి | पीत्वा = త్రాగి |
| मार्जालेन = పిల్లి చేత-పిల్లితో | मास्तु = పోనిమ్ము | द्रष्टुम् = చూడన్, చూచుటకు | वसति = ఉంటున్నాడు |
| मूषकैः = ఎలుకల చేత-తో | भवति = అగుచున్నాడు | प्रष्टुम् = అడుగన్-అడుగుటకు | चलति = కదులుచున్నాడు |

## అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి?

01) मूषकाः मार्जालैः युद्धं कुर्वन्ति।

02) वृक्षाः चलन्ति।

03) बालकाः क्षीरं पीत्वा अङ्गणेषु चरन्ति।

04) श्वः प्रातः अहं त्वां द्रष्टुम् आगमिष्यामि।

05) त्वम् अद्य मम जनकं दृष्ट्वा आगच्छ।

06) अस्मदनुजः ब्राह्मणान् प्रष्टुम् अगच्छत्।

07) एते तत्र किं करिष्यन्ति वा पृष्ट्वा आगच्छ।

08) मास्तु! अहमेव गमिष्यामि। त्वम् अत्र वस।

09) एषः बालकः श्वः ब्राह्मणः भविष्यति।

10) त्वम् इदानीं कुत्र गन्तुं चलसि वा वद।

### అ) జవాబులు

01) ఎలుకలు పిల్లులతో యుద్ధమును చేస్తున్నాయి.

02) చెట్లు కదులుచున్నవి.

03) బాలకులు పాలు త్రాగి ప్రాంగణమున నడుచుచున్నారు.

04) రేపు ప్రొద్దున నేను నిన్ను చూడటానికి వస్తాను.

05) నీవు ఈ రోజు మా తండ్రిని చూసి రా.

06) మా తమ్ముడు బ్రాహ్మణులను అడుగుటకు వచ్చెను.

07) వీరు అక్కడ ఏమి చేస్తారో అడిగి రా.

08) పోనిమ్ము! నేనే వెళతాను. నీవు ఇక్కడ ఉండుము.

09) ఈ బాలుడు రేపు బ్రాహ్మణుడు కాగలడు.

10) నీవు ఇప్పుడు ఎక్కడికి వెళ్ళటానికి కదులుతున్నావు. చెప్పుము.

## ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) మీరు మాతో యుద్ధం చేయగలరా?

02) నేనచటికి వెళ్ళవలెను.

03) మీరీ వేళ నెయ్యి తీసుకొని రావలె.

04) వారు మా ఇంటిని చూడవలెను.

05) ఎవరిని చూచుటకు వెళ్ళినావు?

06) వీరిని పిలిచి మా తండ్రి నిక్కడికి రమ్మని చెప్పుము.

07) పోనిమ్ము నీవెందుకు వానితో యుద్ధము చేసినావు?

08) నీవు పిల్లవాడవు కదా!

09) త్వరగా కదులు ఎవరో వచ్చుచున్నారు.

10) మనమీవేళ వారింటికి భోజనమునకు వెళ్ళవలె, త్వరగా స్నానం చేయుడు.

### ఆ) జవాబులు

01) यूयम् अस्माभिः युद्धं करिष्यन्ति वा?

02) मया तत्र गन्तव्यम्।

03) युष्माभिः इदानीम् आज्यं स्वीकृत्य आगन्तव्यम्।

04) तैः अस्मद्गृहं द्रष्टव्यम्।

05) केषां दर्शनार्थं अगच्छ?

06) एतान् आहूय अस्मद् पितरम् अत्र आगन्तव्यम् इति वद।

07) मास्तु! त्वं किमर्थं तेन युद्धं कृतवान्?

08) त्वं बालकः खलु।

09) शीघ्रं चल केऽपि आगच्छन्ति।

10) अद्य अस्माभिः तेषां गृहे भोजनार्थं गन्तव्यम् शीघ्रं स्नानं कुरुत।

చిత్ర కథ

# హరి నామ మహిమ

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్




అన్నం మూట చెట్టుకింద ఉంది. విద్యాపతి చెట్టుపైనే ఉన్నాడు. కాసేపటికి అక్కడికి దొంగలు వచ్చారు. దొంగసొమ్ముని పంచుకున్నారు. తిరిగి వెడుతూ దొంగలు అన్నం మూటని చూసారు...
అరే.. ఇక్కడ అన్నం ఉందిరా! ఇందులో ఎవరైనా మన శత్రువులు విషం కలిపారేమో...
అనుమానంతో దొంగలు అంతా వెదికారు. చెట్టు మీద ఉన్న విద్యాపతిని పట్టుకున్నారు. కిందకి దింపారు.
ఏయ్! ఈ అన్నం తిను! విషం కలిపావా!
నేను తినను. ఇందులో విషం కలపలేదు.
దొంగలు బలవంతంగా విద్యాపతి చేతే అన్నం తినిపించారు.
పదండి పోదాం...
దొంగలు వెళ్లిపోయారు. విద్యాపతి...
సంకీర్తన మహిమని వర్ణించలేం. ఆ మహిమతోనే నాకు అన్నం లభించింది. భక్తులు చెప్పింది నిజమే!
విద్యాపతి పూర్తిగా మారిపోయాడు. భగవన్నామ సంకీర్తన చేస్తూ మంచిమార్గాన్ని అనుసరించాడు.
అయ్యలారా! అందరూ భగవన్నామం పలకండి!
నీతి- భగవన్నామ సంకీర్తనం భక్తి ముక్తిదాయకం
లోకాః సమస్తాః సుఖినో భవన్తు

# బాలవినోదం

సంఖ్యలను కలిపి రంగులు వేయండి



చిత్రాన్ని చూసి రంగులు వేయండి





1)హనుమజ్జయంతి 2)శివుని అభిషేక ద్రవ్యాలు 3)యోగాదినోత్సవం- పైన చెప్పిన పండుగకు, అభిషేక ద్రవ్యాలకు, పర్వదినానికి సంబంధించి తగినట్లుగా సంఖ్యలను వ్రాయండి. ప్రతి విషయానికి సంబంధించిన చిత్రాలను కనుగొనండి



గజిబిజి అక్షరాలను సరైన వాక్యంగా వ్రాయండి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| దు | ప్ప | త | ట | న | ఆ | రా | డి | మా |

జవాబు: ఆడిన మాట తప్పరాదు

సంఖ్యలను కలుపుతూ హనుమ సీతమ్మను చేరుకునే మార్గం చూపండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| | 3 | 4 | 13 | 14 | 15 |
| 1 | 2 | 15 | 12 | 13 | 14 |
| 4 | 3 | 12 | 11 | 20 | 15 |
| 5 | 4 | 9 | 10 | 19 | 16 |
| 6 | 5 | 8 | 19 | 18 | 17 |
| 7 | 6 | 7 | 17 | 19 | 18 |
| 8 | 9 | 10 | 16 | 20 | |
| 9 | 10 | 11 | 15 | | |








కామాఖ్యా ఆలయం, గౌహతి, సరాయిఘాట్ ఉన్న రాష్ట్రం పేరు?

జవాబు: అస్సాం

చక్రంలో అదే రంగులో ఉన్న ప్రశ్నకు తగిన సమాధానం వ్రాయండి






జవాబులు:
1)శ్రీరామ 2)హనుమ 3)సీతమ్మ 4)శ్రీరాముడు 5)తమలపాకు 6)అంజన 7)హనుమ 8)సంజీవని



పిల్లలకు పాఠశాలలు తెరిచారు. పాఠశాలకు వెళ్ళే ఈ విద్యార్థులున్న చిత్రంలో ఒక వస్తువు లేదు. అది ఏదో చెప్పండి.

జవాబు: అమ్మాయి కుడికాలిబూటు





విశ్వదాభిరామం    వేమన పద్యసూక్తి



## దుష్టుడిపై జాలి ఉండదు

కొండెగాడు చావ కొంపదనుక బోవు
వంతు కింతె గాని వగపు లేదు;
కొంకనక్క జావ గొఱ్ఱె లేమిటి కేడ్చు?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** కొండెగాడు= చాడీలు చెప్పేవాడు; వగపు= బాధ; కొంక నక్క= చిన్నజాతి నక్క.

**భావం:** చాడీలు చెప్పేవాడు చస్తే, ఏదో మర్యాదకోసం ఇంటిదాకా వెళ్లి వస్తారు. అంతేకాని వారికి బాధ ఏమాత్రం ఉండదు. చిన్న నక్క చస్తే గొఱ్ఱె లెందుకేడుస్తాయి?

**వివరణ:** కొందరు కొండేలు చెప్తూ నిష్కారణంగా అందరికీ అపకారం తలపెడుతూ ఉంటారు. వారివల్ల సమాజానికి అపకారమే గాని, ఉపకారం ఉండదు. అలాంటివారు చస్తే ఆనందిస్తారే కాని, ఎవరూ బాధపడరు. అయినా ఇరుగు పొరుగువారు ఇంటిదాకా వెళ్లి చూచి వస్తారు. వంకరబుద్ధి అయిన నక్కవల్ల గొఱ్ఱెలు ఎప్పుడూ బాధలు పడుతుంటాయి. కాబట్టి ఆ నక్క చస్తే, పీడ విరగడైనందుకు పండుగ చేసుకొంటాయి. కాని బాధపడవు.

మానవుడు తప్పుడుపనులు చేసి ఇతరులను బాధించగూడదు. ఉపకారం చేసి, అభిమానం సంపాదించుకోవాలి. అపుడే ఇతరులు తన కష్టనష్టాలలో తోడుగా నిలుస్తారు.

*– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

## భాస్కరశతకం

### 'పరోపకారగుణాలచే జన్మ సఫలమవుతుంది'

దాన పరోపకార గుణధన్యత చిత్తములోన నెప్పుడున్
లేని వివేకశూన్యునకు లేములు వచ్చిన వేల సంపదల్
పూనిన వేళ నొక్క సరి పోలును జీకున కర్ధరాత్రియం
దైన నదేమి పట్టపగలైన నదేమియు లేదు భాస్కరా!



**తాత్పర్యం**

భాస్కరా! 'తనకు కల్గిన దానిలో కొంతైనా ఇస్తూ పరోపకారం చేసే గుణాలచే జన్మ సఫలమవుతుంది' అనే చింత స్వాంతంలో లేని అవివేకికి దారిద్ర్యం వచ్చినా, కలిమి కలిగినా ఒకటే; భేదం లేదు. గుడ్డివానికి నడిరేయి అయినా పట్టపగలైనా ఒకటే, భేదం తెలియదు.

*(వ్యాఖ్యాత– డా॥ తిరుమల శ్రీనివాసాచార్య)*

## ఏప్రిల్ నెల క్విజ్–21 సమాధానాలు

01) తారకమంత్రం
02) నక్షత్రగమనం
03) సరస్వతీదేవి
04) ఏకశిలానగరం
05) ఉగాదిపచ్చడి
06) వాల్మీకిపురం
07) మిథిలాపురం
08) హరినామస్మరణం
09) వివాహబంధం
10) ధ్యానసాధన
11) తాళ్లపాక అన్నమయ్య
12) పుష్పయాగం
13) విరాధుడు
14) మత్స్యావతారం
15) ప్రత్యుపకారం
16) ప్రకృతిధర్మం
17) మత్స్యయంత్రం
18) కృతమాలిక
19) సోమకాసురుడు
20) నాగులాపురం

వీటికి సరైన సమాధానాలు రాలేదు

# క్విజ్ 23

01) జలాలలో ఉన్న దైవశక్తిని దర్శించినవారు? జ)..............................
02) కృతజ్ఞత అనేది- జ)..............................
03) జంతువులు తమ ఎరను దేని ద్వారా చూస్తాయి? జ)..............................
04) మనకున్న ఇంద్రియాలలో ప్రధాన ఇంద్రియం? జ)..............................
05) మనకున్న ప్రమాణాలలో ముఖ్యమైన ప్రమాణం? జ)..............................
06) వేదాలను అపహరించిన మధుకైటభులను సంహరించి, వేదసంరక్షణ గావించిన దెవరు ? జ)..............................
07) నారదమహర్షి వరప్రభావంతో సృంజయరాజునకు జన్మించిన కుమారుని పేరు? జ)..............................
08) ఆంజనేయుడు ఎవరి అంశలతో జన్మించాడు? జ)..............................
09) హనుమంతుడు ఎవరి వద్ద విద్యను అభ్యసించాడు? జ)..............................
10) ఆధ్యాత్మిక పురుషులకు కొండంత దిక్కు ఎవరు? జ)..............................
11) యోగసాధనకు ఆధార విత్తనము? జ)..............................
12) వాతావరణంలోని దివ్యశక్తిని శరీరంలోనికి లయం చేయడం దేని ద్వారా సాధ్యమగును? జ)..............................
13) రామానుజాచార్యుల పాదస్పర్శతో పునీతమైన దివ్యక్షేత్రం? జ)..............................
14) నారద, గంధర్వులు దిగిన శ్రీక్షేత్రానికి గల మరొక పేరు? జ)..............................
15) విఖనసముని స్వామివారికి ఏ నక్షత్రంలో రథోత్సవం నిర్వహింపవచ్చునని తెలిపారు? జ)..............................
16) బ్రహ్మోత్సవవైభవాన్ని దర్శించినవారికి ఏమి ఉండదు? జ)..............................
17) స్వామివారికి మూడవ రోజు ఉదయం జరిగే వాహనసేవ? జ)..............................
18) స్వామికి అయిదవ దినం రాత్రి జరిగే సేవ? జ)..............................
19) ఏడవ నాటి రాత్రి సేవ? జ)..............................
20) ఎనిమిదవ నాటి ఉదయం జరిగే సేవ? జ)..............................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-06-2024.**
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రింది వివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .............................. వయస్సు: ..............
పాఠశాల: .............................. తరగతి: ..............
పేరు: ..............................................................
చిరునామా: ..............................................................
..............................................................
..............................................................
.............................................. పిన్‌కోడ్: ..............
ఫోన్ సంఖ్య: ..............................................................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.............................................................. తేది : ..................

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 101



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)విశాఖనక్షత్రం ఉన్న పౌర్ణమి ఏ మాసం?(6); 6)కాళహస్తి సమీపాన ఉన్న నది(4); 7)పులస్త్యుని భార్య(4); 9)ఋషభుని భార్య(3); 10)ఇది ఒక పుణ్యక్షేత్రం(2); 14)వృషభాద్రికి గల మరియొక పేరు(4); 15)భూమి(3); 18)వసిష్ఠుని భార్య(2); 19)పార్వతి(3); 20)నలునితో జూదమాడుమని పుష్కరునితో చెప్పిందెవరు?

### నిలువు

1)సూర్యునికి సంజ్ఞకు కల్గిన కుమారుడు(5); 2)పక్షి(3); 3)భరద్వాజమహర్షి తల్లి(2); 4)విష్ణువు వక్షఃస్థలాన్ని తన్నిన మహర్షి(3); 5)సత్యవంతుని భార్య(3); 8)ఇంద్రుని కూతురు(3); 11)కుబేరుని వీర్యము వలన పుట్టిన ఒక పడుచు(2); 12)యయాతికి శర్మిష్ఠయందు పుట్టిన కుమారుడు(3); 13)చాక్షుషమనువు కుమారుడు(3); 16)ఉగాది పచ్చడిలో వాడే పువ్వు(2) 17)కృథునికి హింసకు కల్గిన కుమారుడు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



2024, ఏప్రిల్ 21 నుండి 23 వరకు
తిరుమల శ్రీవారి ఆలయం వెనుక వైపుగల 'వసంతోత్సవ
మండపం'లో జరిగిన 'శ్రీవారి సాలకట్ల వసంతోత్సవ' దృశ్యం.



2024, ఏప్రిల్ 21 నుండి 23 వరకు
తిరుపతి శ్రీరామచంద్ర పుష్కరిణిలో జరిగిన
శ్రీకోదండరామస్వామివారి తెప్పోత్సవ దృశ్యం.



22-04-2024న ఒంటిమిట్టలో జరిగిన శ్రీసీతారామకల్యాణానికి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు,
ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ
ప్రత్యేక ముఖ్యకార్యదర్శి శ్రీ ఆర్.కరికాలవలవన్, ఐ.ఏ.ఎస్., మరియు
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., గారలు.



22-04-2024న ఒంటిమిట్ట శ్రీకోదండరామయ్య కల్యాణోత్సవ సందర్భంగా
తిరుమల శ్రీవారి తరపున బంగారుఆభరణాలు, వెండి పూజాసామగ్రి, పట్టువస్త్రాలను
సమర్పిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు,
ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు
శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్.లు పాల్గొన్నారు.



26-04-2024న తిరుమల శ్రీవారి దర్శనానంతరం
భారత ఉపరాష్ట్రపతి గౌ॥ శ్రీ జగదీప్ ధన్‌ఖడ్ దంపతులకు
శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న తి.తి.దే.
కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., గారు



26-04-2024న తిరుపతిలోని బర్డ్, శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ
ఆసుపత్రులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగవర్నర్ గౌ॥ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు
సందర్శించిన దృశ్యం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు
శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్., గారలతో బాటు, బర్డ్ ఓ.ఎస్.డి.
డా॥ రెడ్డెప్పరెడ్డి, చిన్నపిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డా॥ శ్రీనాథరెడ్డిలు కూడా పాల్గొన్నారు.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by
Tirumala Tirupati Devasthanams Printing on 25-05-2024 and Posting at Tirupati RMS.
Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal
Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

